జోషి, పి. సి.

కాంగ్రెసు కార్యవర్గానికి కమ్యూనిస్టుల జవాబు

బెజవాడ, 1946

Record no. 100

Jōṣi, Pi. Si.

Kāṅgresu kāryavargāniki Kamyūnisṭula javābu

Bejavāḍa, 1946

Record no. 100

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

జోషి, పి. సి.

కాంగ్రెసు కార్యవర్గానికి కమ్యూనిస్టుల జవాబు / పి. సి. జోషి. - బెజవాడ : ప్రజాశక్తి కార్యాలయం, 1946.

3 volumes. ;17 cm.

Record no. 100

Jōṣi, Pi. Si.

Kāṅgresu kāryavargāniki Kamyūnisṭula javābu / Pi. Si. Jōṣi. - Bejavāḍa : Prajāśakti Kāryālayaṃ, 1946.

3 volumes. ;17 cm.

Record no. 100

35 mm microfilm

Image placement: IA IIA IB IIB   Date filming began:

కాంగ్రెసు కార్యవర్గానికి కమ్యూనిస్టుల జవాబు

పి. సి. జోషి

మొదటి భాగం

యుద్ధం - కమ్యూనిస్టులు

ప్రజాశక్తి కార్యాలయం, బెజవాడ

ప్రచురణ నెం. 133

ఎనిమిది అణాలు

పర్మిట్ నెం. కె. 13/సి.
ప్రజాశక్తి ప్రెస్, బెజవాడ 18-1-46

మొదటి భాగం

అఖిలభారత కాంగ్రెస్ కమిటీ

క్యాంపు: బొంబాయి
21 సెప్టెంబరు 1945

శ్రీయుత సర్దేశాయ్‌గారికి
ఏ. ఐ. సి. సి. సభ్యుడు

ప్రియమైన ....

కాంగ్రెసులోని కమ్యూనిస్టు సభ్యులనుగురించి అనేకనిందలు, అభియోగాలు వర్కింగు కమిటీకి వచ్చాయి. వీటిని ఒక సబ్‌కమిటీకి అప్పగించాము. ఆ సబ్‌కమిటీ వీటిని జాగ్రత్తగా పరిశీలించి ఒక రిపోర్టు తయారుచేసింది; కొన్ని అభియోగాలను పెట్టింది. వాటి నకళ్లు ఇందుతో పంపుతున్నాను. వీటికి సమాధానాలు వ్రాతమూలకంగా పంపమని కోరుతున్నాను. ఈ జాబు మీకు చేరిన రెండువారాల్లో మీ జవాబు నా కార్యాలయానికి చేరాలి. ఈ విషయమై మీరుగాని, మీ తరఫున మరెవ్వరుగాని మమ్మల్ని కలుసుకోగోరితే, మీ కోరికను తీర్చడానికి ప్రయత్నిస్తాము.

మీ విశ్వాసపాత్రుడు,
జె. బి. కృపలాని
ప్రధానకార్యదర్శి.

అభియోగపత్రం

మీరు ఏ. ఐ. సి. సి. సభ్యుడుగా ఉంటూ, ఏ. ఐ. సి. సి. ఆయా సందర్భాల్లో నిర్ణయించే పాలిసీకి, కార్యక్రమానికి బద్ధుడవై ఉండవలసి ఉంటూ, 1942 జూన్ తదనంతరం అట్టి పాలసీని, కార్యక్రమాన్ని వ్యతిరేకించారు; ముఖ్యంగా 1942 ఆగస్టులో ఏ. ఐ. సి. సి. నిర్ణయించిన పాలసీని, కార్యక్రమాన్ని ఆచరణలో తీవ్రంగా వ్యతిరేకించారు.

భారతస్వాతంత్ర్యాన్ని అంగీకరించి, జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించేంత వరకు యుద్ధకృషికి తోడ్పడకూడదని కాంగ్రెసు చెప్పినప్పటికీ, మీరు ఆ యుద్ధాన్ని ప్రజాయుద్ధమంటూ, పత్రికలు, పుస్తకాలు, సభల ద్వారాను, ఇతరవిధాల యుద్ధకృషికి అనుకూల ప్రచారాన్ని సాగించారు.

భారతజాతీయ కాంగ్రెసు పాలసీని, కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్నటువంటి మీ పార్టీ అయిన భారతకమ్యూనిస్టు పార్టీ నిర్ణయించిన పాలసీని అనుసరించే మీరీవైఖరి నవలంబించారు.

కాంగ్రెసు వ్యక్తులపైని, కాంగ్రెసులోను, వర్కింగుకమిటీలోను ఉన్న గ్రూపులపైని మీరు తీవ్రమైన ఆరోపణలు చేశారు.

ఈ కారణాలవల్ల కాంగ్రెసు నిబంధనావళి ప్రకారం మీరు డిసిప్లినరీ చర్యకు పాత్రులయారు.

కాబట్టి అలాంటిచర్య మీపై ఎందుకు తీసుకోకూడదో తెలుపవలసిందని ఇందుమూలకంగా కోరడమైనది.

శ్రీయుత కృపలానీగారికి డా. అష్రాఫ్ ఉత్తరం

శ్రీ జె. బి. కృపలానీ బొంబాయి
ప్రధాన కార్యదర్శి 27-11-45
అఖిలభారత కాంగ్రెసు కమిటీ.

ప్రియమైన శ్రీ కృపలానీ,

కాంగ్రెసు కార్యవర్గం కమ్యూనిస్టు ఏ. ఐ. సి. సి. సభ్యులపై పెట్టిన అభియోగపత్రానికి మా జవాబు పంపుతున్నాను.

జవాబుపంపడం ఆలస్యం అయినందుకు చాల విచారించుతున్నాను. కాని మీరు, మీవర్కింగుకమిటీ ఒకవిషయాన్ని గుర్తించుతారనుకుంటాను. మేము ఎన్నికలలో నిమగ్నులమై యున్నాము. పైగా మీ అభియోగపత్రం చాలా పెద్దదిగా ఉంది. కొద్దిలో సమాధానం ఇవ్వడానికి వీలులేకుండా ఉంది.

ఏ ఒకరిపైననూ గాకుండా మీరు కమ్యూనిష్టుపార్టీయొక్క పాలసీని ఆచరణనే, సవాలుచేశారు. అందుచేత మాయందరి తరపున మాపార్టీకార్యదర్శియైన పి. సి. జోషి మీ అభియోగపత్రానికి జవాబు ఇచ్చారు.

మేమిలా చేసినందుకు మీ రభినందిస్తారని తలుస్తాను.

మీ విధేయుడు,
కె. యమ్. అష్రాఫ్
కమ్యూనిష్టు ఏ. ఐ. సి. సి. సభ్యుల తరపున.

కాంగ్రెస్ వర్కింగుకమిటీ అభియోగానికి
— ఏ. ఐ. సి. సి. కమ్యూనిస్టు సభ్యుల సమాధానం

I
ఉపోద్ఘాతము

ఆలస్యంగా జవాబిస్తున్నందుకు క్షమించండి. దైనందిన కార్యక్రమంలో మునిగిపోయి ఉండడంవల్ల త్వరగా జవాబు పంపలేకపోయాం.

మీరు మీ అభియోగాలను మాకు పంపకముందే దినపత్రికలద్వారా మీ అభిప్రాయాలను తెలుసుకోగలిగాం. మా పార్టీ పాలసీపట్ల మీ వ్యతిరేకతను పత్రికల్లో అనేవరకే వెల్లడిచేశారు. కాని నిజంచెప్పాలంటే, యీ అభియోగాలు ఇంత అస్పష్టంగా ఉంటాయని మే మనుకోలేదు. "ప్రజాయుద్ధం" అనేమాట ఎంత అస్పష్టమైనదో. మీ అభియోగంకూడా అంత అస్పష్టంగా ఉంది. మనసులో ఉన్నమాట చెబుతున్నాం — మీ సబ్‌కమిటీ రిపోర్టు చదవడం మాకు చాల బాధ అనిపించింది. దానిని వ్రాసినవారు మా పార్టీపట్ల తమకున్న హేళనాదృష్టిని దాచుకోలేకపోయారు. మనందరి సంస్థయైన కాంగ్రెసు నాయకులలో యింతకన్నా సవ్యమైన, గంభీరమైన వైఖరి కనబడుతుందని యెదురుచూశాం. సోదరభావం కనబడకపోయినా, చులకనదృష్టి ఉండదని ఆశించాం.

మీ రిపోర్టును, ఆ యా పత్రాల్లోనుంచి మీరు ఉదహరించిన భాగాలను, బట్టి చూస్తే, మా పాలసీని సహృదయంతో, జాగ్రత్తగా పరిశీలించడానికి మీరెవ్వరూకూడా ప్రయత్నించనేలేదన్నది స్పష్టమవుతుంది. మా వ్యతిరేకులు కొందరు (వీరివిషయం తరువాతచెబుతాం) కొన్ని ఉదాహరణలను సిద్ధంగా ఉంచారు; మీరు వాటిని పూసగ్రుచ్చి రిపోర్టు తయారుచేశారు.

మాపై మీ ఆరోపణలు

ఈ రిపోర్టు మీ రాజకీయ దృక్పథాన్ని బయటపెడుతూంది; మాపై మీ అభియోగానికి ఆధారంకూడా యీ రిపోర్టే. అది యీ దిగువ విషయాలను నివేదిస్తూంది; లేదా సూచిస్తూంది :

1. ఒకప్పుడు మేమీ యుద్ధాన్ని "సామ్రాజ్యవాద యుద్ధమ"ని పేర్కొన్నాము.
2. ఉన్నట్టుండి దానిని "ప్రజాయుద్ధమ"ని పిలువ నారంభించాము.
3. సోవియటుపై యుద్ధం ప్రారంభమయిందేగాని, మన దేశంలో ఇలాంటిమార్పు చేసుకోడానికి తగిన ఘటనలేవీ జరగలేదు. అందువల్ల మేము మన స్వాతంత్ర్య సమరాన్ని విరమించుకొని, సోవియట్‌ని రక్షించడానికి పూనుకున్నాము.
4. బ్రిటన్ - సోవియట్‌కు మిత్రరాజ్యం అయిందికనుక చివరకు మేము "శత్రుపక్షం"తో చేరిపోయి, కాంగ్రెసును వ్యతిరేకించ నారంభించాము.

అంటే, సోవియట్ యూనియన్‌కోసం మాతృదేశానికి ద్రోహం చేశామన్నమాట.

కమ్యూనిస్టులు తమ దేశక్షేమాన్నిబట్టికాక, సోవియట్‌యూనియన్ శ్రేయస్సును దృష్టిలోపెట్టుకొనే తమ పాలసీని నిర్ణయించుకుంటారన్న విమర్శ కొత్తదికాదు. అది పాతది - చాలా పాతది. ప్రపంచమంతటా అభివృద్ధినిరోధకులూ, వాళ్ళ తొత్తులూ ఆలాపిస్తూన్నరాగమే అది. మన దేశంలోనే, మా పార్టీ శైశవదశలో వున్నపుడు ఆంగ్లో - ఇండియన్ పత్రికలు యీ ధోరణిలోనే మమ్మల్ని విమర్శించేవి. మీరు ఉదహరించిన మీరట్ కుట్రకేసులోకూడా ఇంగ్లీషు ప్రాసిక్యూటరు మాపైని ప్రయోగించిన రాజకీయాస్త్రం యిదే. ఆ కేసులో మీరు మాకు సహాయంచేశారు; మా కృతజ్ఞతనుపొందారు. పెద్దలయిన మీవద్దనుండి సహజంగా రావలసిన సహాయంగానే మేము దానిని తీసుకున్నాం.

అదిజరిగి 17 సంవత్సరాలు గడచిపోయాయి. ఆనాడు వారుపాడిన పాటనే ఈనాడు మీరు పాడుతున్నారు, "ఇది మీకుతగునా?" అని అడక్కుండా ఉండలేకుంటున్నాం!

మాతృదేశంపట్ల మాకుగలభక్తిని, తెలిసో తెలియకో మీరు శంకించడం కాదా ఇది!

ప్రపంచంలో అన్నిదేశాల్లోను కమ్యూనిస్టుపార్టీలున్నాయి. ఆదేశాల్లో మా వ్యతిరేకులుచేసే కారుచవుక విమర్శన ఇదే. ఆ దేశాల్లోని మాసోదర పార్టీలు తమ ప్రజాసేవద్వారానే ఈవిషప్రచారాన్ని పటాపంచలుచేశాయి. మాసోదరప్రజలే మాకు ప్రియతములనీ, వారి సౌఖ్యాభివృద్ధులకోసం అహోరాత్రులు కృషిచేయడమే మా ప్రప్రథమ కార్యక్రమమనీ, మాతృదేశ స్వాతంత్ర్యమూ, ప్రతిఇంటా ఆనందాన్ని తాండవింపజేయడమూ, మా ప్రధాన లక్ష్యాలనీ, మేమూ, ఇతరదేశాల్లోని మా సోదరపార్టీలూ ఆచరణలో రుజువుచేశాం. ఈనాడు ప్రపంచంలో కమ్యూనిస్టు ఉద్యమమే ఎన్నోరెట్లు అభివృద్ధి పొందింది. దివాలాకోరు గుడ్డికమ్యూనిస్టు వ్యతిరేక ఉద్యమమే పతనమయింది.

మన ప్రజాఉద్యమంలో అగ్రగణ్యమైన కాంగ్రెసుసంస్థకు నాయకులయిన మీరు మమ్మల్ని కొన్ని ప్రశ్నలడిగారు. కాని, మాపార్టీపట్ల అభివృద్ధినిరోధక సామ్రాజ్యవాదులకు సంప్రదాయసిద్ధంగాగల వక్రదృష్టే ఈ ప్రశ్నలవెనుక కనబడుతూంది. ఇందుకు మాకు దిగులు పుడుతూంది. మనందరికీ సోదరులయిన ప్రజాసామాన్యంయొక్క భావిగతిని తలచుకొని కంపిస్తున్నాం. "ఇంతదూరం పోవలసిన అవసరం ఉన్నదా?" అని మిమ్మల్ని అడుగుతున్నాం.

విమర్శనేగాని వైరంకాదు

మీరు నిర్ణయించిన పాలసీలపై (వాటి బాగోగులను ఇక్కడ తడవ దలచుకోలేదు.) మేముచేసిన తీవ్ర విమర్శనలను కాంగ్రెసు వ్యతిరేకతకు నిదర్శనాలుగ మీరు తీసుకున్నారు. తన పాలసీని విమర్శించడము వైరంగాను, జాతీయోద్యమంపట్ల, తన సంస్థపట్ల వ్యతిరేకతగాను ఒక నాయకవర్గం లెక్కకట్టడం రాజకీయ వాదోపవాదాల్లో సవ్యమైన మార్గం కాదు. వివిధ రాజకీయదృక్పథాలను, పాలసీలను సరిగా అర్థంచేసుకోడానిక్కూడా ఇది మార్గంకాదు. ఇలాంటి వైఖరి జాతీయోద్యమానికి ప్రమాదం కలిగిస్తుంది. విమర్శనాదృష్టిని అణచివేయడంవల్ల నాయకవర్గంలో నిరంకుశత్వం ప్రబలుతుంది; అనుచరవర్గంలో బానిసబుద్ధి పెరుగుతుంది; ఉద్యమంలో కక్షలు పెరుగుతాయి.

కాంగ్రెసు ఉద్యమం ఒక నూతనదశకు వచ్చినప్పుడల్లా ఇలాంటి ప్రమాదాన్నెదుర్కొంటూనే వచ్చింది. ఉద్యమం బలంవల్ల ఇంతవరకు వాటిని దాటుకొంటూ రాగలిగింది. ఈనాడు మనజాతీయ చరిత్రలో అతిప్రధానమైన ఈ యుద్ధదశను కాంగ్రెసు పర్యాలోకించవలసి ఉంది. ఈ దశలో తానవలంబించిన పాలసీ ఫలితాలను, తనలోని వివిధగ్రూపులు నిర్వహించిన పాత్రలను, వాటి విమర్శలను, సూచనలను కాంగ్రెసు చిత్తశుద్ధితో అంచనావేయవలసి ఉంది. ఇందువల్లనే కాంగ్రెసు తిరిగి అలాంటి ప్రమాదాన్ని ఈ నాడెదుర్కొంటూంది.

ఈదశలో మీ పాలసీపై ప్రధానమైన విమర్శనలను మేమే చేశాం; ముఖ్యంగా విమర్శింపబడిందికూడా మేమే. యుద్ధదశకు భరతవాక్యంగాను, యుద్ధానంతర దశకు నాందీపలుకుగాను, మీరు మాపై ఈ అభియోగం తెచ్చారు.

మా పాలసీని తప్పుగా చిత్రించి, మమ్మల్ని సంజాయిషీ అడుగుతున్నారు మీరు. "ఏదైన ఒక విధానం నిర్ణయం అయేముందు దానిని అన్ని దృక్పథాలనుండి చర్చించగల స్వాతంత్ర్యం ఉంది. నిర్ణయం అయిన తరువాత మాత్రం సాధ్యమైనంతవరకు దానిని అంటిపెట్టుకొని ఉండాలి; ఏపరిస్థితుల్లోను వ్యతిరేకించకూడదు. క్రియారంగంలో ఏకముఖంగా ఉండాలనే ఈ నిబంధనే లేకపోయినట్లయితే కాంగ్రెసు తనపోరాట స్వభావాన్ని కోల్పోయి, తలొక తీరుగాపోయే ఒక మూకగా తయారయేది; ఏమీచేతగాని స్థితికి దిగజారేది"— కాంగ్రెసుపట్ల విధేయతకు మీరుపెట్టిన గీటురాయి ఇది. కాని ఈ విధేయతకు ఇంతకన్నా సూటయిన పరీక్షను మేము సూచిస్తున్నాం. ఈ దిగువ గీటురాయినిబట్టి మా పాలసీని చిత్తశుద్ధితో పరీక్షించవలసిందని కోరుతున్నాం:

మా పాలసీయొక్క ఆశయం దేశస్వాతంత్ర్య సాధనయా, లేక ఆ ఆశయాన్నుంచి దేశాన్ని దూరంచేసిందా?

మన ప్రజాబలంతోనే స్వాతంత్ర్యాన్ని సాధించగలమనే ఆశను మేము ప్రదర్శించామా? లేక ఇతర ప్రజానీక వ్యతిరేక శక్తులపై ఆశలు పెట్టుకొన్నామా?

మా పాలసీని అనుసరిస్తూ ప్రజలకు దైనందిన సమస్యలపై సేవ చేశామా? లేక ద్రోహం చేశామా?

ఈ పైసూత్రాలనే మేము మా నిత్య కార్యక్రమంలో మార్గదర్శకాలుగ పెట్టుకొన్నాం. ఇందులో అంతరాత్మకు వ్యతిరేకంగా పోయిందేమీ లేదని అనుకుంటున్నాం; చింతపడవలసిన పని మేమేమీచేయలేదు. మాచింత అంతా ఒక్కందుకే— చేయగల దంతా చేయలేక పోయినందుకే.

స్వాతంత్ర్యానికి దగ్గరదారి

స్వాతంత్ర్యంకోసం, ప్రజల క్షేమంకోసం సాగేపోరాటం కాంగ్రెస్ తీర్మానాల్లోను, కాంగ్రెసు నిర్మించిన మహత్తర సాంప్రదాయాల్లోను ప్రతిబింబిస్తూంది. మమ్మల్ని కాంగ్రెసుకు బద్ధుల్ని చేసింది. ఇవి మాత్రమే కాదు. సామ్రాజ్యవాదయుద్ధ దశలోను, ప్రజాయుద్ధదశలోను మేమవలంబించిన విధానంపట్ల న్యాయంగా కాంగ్రెసు ఆక్షేపణ చెప్పకూడదని మా అభిప్రాయము. కాని మీరావిధానాన్ని అపహాస్యంచేశారు. మావాదన ఏమంటే — ఈ రెండుదశల్లోను యుద్ధంపట్ల ఏ దృక్పథాలను వర్కింగు కమిటీ, ఏ. ఐ. సి. సి. లో నిరాకరించాయో ఆ దృక్పథాలనే, దేశక్షేమానికి భంగకరములని మేముకూడా ఖండించాము. ఉదాహరణకు: యుద్ధం మొదటిదశలో బేషరతుగా సహకారం చేయాలని గాంధీజీ తీసుకున్న దృక్పథం. యం. యన్. రాయ్‌కూడా ఇలాంటి వైఖరే అవలంబించాడు. రెండవదశలో కాంగ్రెసు సోషలిస్టులు, ఫార్వర్డుబ్లాకువారు అవలంబించిన సంపూర్ణవ్యతిరేకత.

యుద్ధాన్ని గురించి కాంగ్రెసు తీర్మానాల్లో చేసిన నిర్వచనానికీ, మేమనుకున్నదానికీ సామ్యమే ఎక్కువగా ఉందిగాని- తేడా అంతగా లేదు. మా నిర్వచనం కాంగ్రెసు అధికార ప్రకటనకు అనుగుణ్యంగానే ఉందని చెప్పగలము. కాబట్టే చిత్తశుద్ధితో కాంగ్రెసులో ఇన్నాళ్ళూ ఉన్నాము. భేదాభిప్రాయం వచ్చినచోటల్లా మా దృక్పథమే ఎక్కువ సహేతుకంగాను, సక్రమంగాను, వాస్తవికంగాను ఉంటూఉంది. ఈ రెండు దశల్లోను కాంగ్రెసు పాలసీని మా పాలసీని సరిపోల్చేటప్పుడు ఈ విషయాన్ని రుజువు చేయడానికి ప్రయత్నిస్తాను.

ఆచరణలో మీకూ, మాకూగల విభేదాలను మేము తక్కువ అంచనా వేస్తున్నామని మీరు అనుకొనవద్దు. ఈ విభేదాలు ఎందువల్ల కలిగాయంటే— ప్రధాన విషయాలపట్ల మే మనుసరించిన దృక్పథాన్నే

కాంగ్రెసునాయకవర్గం మాటల్లో అవలంబించింది. కాని, దానికి విరుద్ధ మైన దృక్పథానికి ఆచరణలో తావిచ్చింది. అందువల్లనే ఈ విభేదాలు కలిగాయి.

నాయకత్వంలో ఏకీభావాన్ని నిలబెట్టడానికి మీ దృష్టిలో ఇది అవసర మయింది.

అప్పుడప్పుడు తర్జనభర్జనలు జరిగినప్పుడు, పాలసీలను నిర్ణయించవలసి వచ్చినప్పుడు, ఒక కార్యక్రమాన్ని అవలంబించవలసి వచ్చినప్పుడు గాని, మరొకదాన్ని విసర్జించవలసి వచ్చినప్పుడుగాని—ఈ విధమైన అనుభవంలో మాకొక విషయం సుస్పష్టమవుతూ వచ్చింది. కాంగ్రెసులో మనం విభిన్నపోకడల ననుసరించడం వల్లనే ఆచరణలో మనకు విభేదాలు సంభవించాయి.

భారతదేశంయొక్క సహకారం బ్రిటనుకు అవసరం కాబట్టి, మన జాతీయవాంఛను నెరవేరుస్తుందని మీరు ప్రధానంగా బ్రిటిష్‌ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

మనదేశ భవిష్యత్తును మన చేతుల్లోకే తీసుకోవడం అత్యవసరం కాబట్టి, బ్రిటిష్ ప్రభుత్వవైఖరి ఎలాంటిదయినాసరే, మన ప్రజాబలంతోనే జాతీయవాంఛను ఈడేర్చుకోవాలని మేము ప్రధానంగా ప్రజలపైనే ఆశలు పెట్టుకున్నాం.

రాబోయే ప్రకరణాల్లో మాభావం ఇంకా స్పష్టం అవుతుంది.

ఈ యుద్ధంతో ఒక నూతనదశ ప్రారంభ మయిందని తోటి కాంగ్రెసు వాదులతోబాటు మేము గ్రహించడమే కాకుండా, ఆ విధంగా నిర్వచించాము కూడా. దానితో భారతదేశ స్వాతంత్ర్యాన్ని సాధించడం తక్షణ కర్తవ్య మయిందని స్పష్టంచేశాం. ఈ యుద్ధదశలో, ఆయా మార్పుల్లో కూడా, మా విధానాలను నిర్ణయించుకొనేటప్పుడు ఈ దిగువ విషయాలను మనసులో పెట్టుకుంటూ వచ్చాం.

1. దేశస్వాతంత్ర్యానికి అన్నిటికన్నా దగ్గరదారి ఏది?
2. మనదేశానికి మిత్రులెవరు? శత్రువు లెవరు?
3. ఎటువెళితే అత్యధిక ఫలితాన్ని పొందగలం? దానికి మార్గమేది?

II

యుద్ధంలో మొదటిదశ : సామ్రాజ్యవాద యుద్ధం

క్రమశిక్షణతో వర్తించే ఒక విప్లవకర రాజకీయపక్ష సభ్యులం మేము. మాకుమార్గం చూపడానికి ఒక రాజకీయ సిద్ధాంతముంది. అందువల్లనే మేము, ఇతర కాంగ్రెసువాదుల్లాగ ప్రతి విషయంలోనూ దారి చూపడానికి మీవంక చూస్తూ కూర్చోము. స్వయంగా కొంత ఆలోచించడానికి ప్రయత్నిస్తాము. ఆ ఆలోచన ఫలితంగా మాకు కలిగిన అభిప్రాయాలను ప్రజలఎదుట, తోటి కాంగ్రెసువాదుల ఎదుట పెడతాము.

ప్రపంచ యుద్ధంవంటి చరిత్రాత్మక ఘటన సంభవించినప్పుడు తీవ్రంగా ఆలోచించవలసిన బాధ్యత ప్రతివారిపైనా పడింది. స్వాతంత్ర్య సమరానికీయుద్ధం సదవకాశమా, లేక పెద్ద ప్రతిబంధకమా అని మేమాలోచించాము. సదవకాశమే అన్న నిర్ణయానికి వచ్చాం. కొత్త పరిస్థితులకు అనుగుణ్యంగా మన పద్ధతులను మార్చుకోవాలేమో అని ఆలోచించాం; మార్చుకోవాలి అని నిర్ణయించుకొన్నాం.

మొదటిదశలో యుద్ధాన్ని మేము "సామ్రాజ్యవాద యుద్ధం" అని పేర్కొన్నాం. మనల్ని బానిసలుగా త్రొక్కిఉంచిన సామ్రాజ్యవాదులు పాల్గొంటున్నారనికాదు మేమలా అన్నది. ఈ దృష్టితో చూస్తే బ్రిటను పాల్గొనే ఏ యుద్ధంకూడా భారతదేశానికి సంబంధించిన యుద్ధంకాజాలదు. మనం తిరుగుబాటు లేవదీయడానికి అది చక్కని అవకాశం మాత్రమే కాగలదని తేల్చవలసివస్తుంది. పద్దెనిమిది, పంతొమ్మిదవ శతాబ్దాలనాటి సంకుచిత ప్రపంచంలోని జాతీయ విప్లవవాదుల ధోరణి అది. నేటి ప్రపంచంలోకూడా ఆ ధోరణినే అనుసరిస్తే మనం సంకుచిత జాతీయవాదుల మయిపోతాం; మంచీచెడ్డ లాలోచించకుండా ఎవరినిపడితేవాళ్లను చివరకు అభివృద్ధినిరోధక ఫాసిస్టులను కూడా మిత్రులుగా స్వీకరిస్తాం; బుద్ధిపూర్వకంగానో, కాకుండానో మనదేశాన్ని పోటీ సామ్రాజ్యవాదుల కోరలకు అప్పగించిన వారమౌతాము.

బానిస వలసదేశాల ప్రజాసంస్థల్లో 'భారత జాతీయ కాంగ్రెసు అన్నిటికన్నా మిన్న. స్వాతంత్ర్య ప్రియులయిన మన ప్రాచీన జాతికది

గర్వకారణం. ఈ మహాసంస్థయొక్క అంతర్జాతీయ విధాన మంతటికీ మూలసూత్రం ఈ దిగువ భావాలే. వీటినే అది ప్రజల్లో వ్యాపింపజేస్తూ వచ్చింది: వీటిని రేకెత్తించింది పండిత జవహర్లాల్ నెహ్రూ; అభివృద్ధిని కోరే యువకవర్గాలన్నీ వీటిని బలపరిచాయి.

సామ్రాజ్య వాదమంటే — దురాక్రమణదారులూ, ఇతర జాతులను బానిసలుగా తొక్కిపెట్టాలనుకొనే వారందరూ కూడిఉన్న ఒక ప్రపంచ దోపిడీ సంస్థ.

దీనికి ఎదిరిపక్షం ప్రపంచ ప్రజాపక్షం. శాంతి, స్వాతంత్ర్య, ప్రజాస్వామ్యాలకు కంచుకోట అది. కాంగ్రెసు ఎప్పుడూ ఈ పక్షంతోనే ఏకీభవిస్తూ వచ్చింది. సోవియటు యూనియన్, చైనాలుకూడా అందులో ఉన్నందుకు సంతోషం వెలిబుచ్చింది.

కాంగ్రెసులో ఒక భాగంగాను, ఒక స్వతంత్ర రాజకీయపార్టీ హోదాలోనూ, యుద్ధంపట్ల మా వైఖరిని స్పష్టం చేయవలసిన బాధ్యతను గుర్తించాం. యుద్ధాన్ని సామ్రాజ్యవాద యుద్ధంగా నిర్వచించాము.

ఎందువల్ల?

ఇలా నిర్వచించటానికి మూలకారణాలు రెండు.

1—యుద్ధంలో పాల్గొంటున్న రెండుపక్షాల స్వభావాన్నీ పరిశీలించాం. అవి, పోటీ పడుతూన్న రెండు సామ్రాజ్యవాద శక్తులని గుర్తించాం—బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్యవాదు లొకవైపు, హిట్లరు ఫాసిస్టులు మరోవైపు.

2—లాంఛనప్రాయంగా చేసిన ప్రకటనలను విడిచిపెట్టి, రెండు పక్షాల నిజ ఆశయాలను పరిశోధించాం. అవి స్వార్థంతో కూడుకున్న సామ్రాజ్యవాద ఆశయాలని గ్రహించాం.

ఫాసిస్టు శక్తులతో యావత్తు ప్రపంచాన్నీ స్వాధీనం చేసుకోవాలని బయలుదేరింది హిట్లరుపక్షం. రాక్షసులు, క్రూరమృగాలు అవలంబించే పద్ధతే వీరిది కూడాను.

కుతంత్రాలతో సంపాదించిన సామ్రాజ్యాన్ని జాగ్రత్త పరచుకుంటూ, యుద్ధాన్నంతటినీ సోవియట్‌పైకి మళ్ళించాలని ఛేంబర్లేను

(అప్పటి బ్రిటిష్ ప్రధాని) ముఠా ఆశయం. స్వార్థపరుల పిరికితనమూ, హంతకుల గూడుపుఠాణీ వీరి పద్ధతులు.

ఎవరినైతే మనం ఏవగించుకుంటూ వచ్చామో ఆ సామ్రాజ్యవాదులే రెండుపక్షాల వారున్నూ. దేనిని ప్రతిఘటించడానికి మన జీవితాలను అంకితం చేశామో ఆసామ్రాజ్యవాదాన్ని నిర్దాక్షిణ్యంగా కొనసాగించడమే ఆ రెండుపక్షాల యుద్ధాశయం. అందువల్లనే ఆయుద్ధాన్ని సామ్రాజ్యవాద యుద్ధమన్నాం; దానిని వ్యతిరేకించాలని నిర్ణయించుకున్నాం.

"యుద్ధాన్ని మళ్లించడం" గురించి మా అభిప్రాయాలను యూరప్‌లోని మధ్యతరగతి ప్రజాస్వామ్యవాదులు కొందరు హేళన చేశారు. సోవియట్ పాల్గొనడంలేదు కాబట్టే, తమదేశాల కమ్యూనిస్టులు యుద్ధానికి తోడ్పడడంలేదని వారు వ్యాఖ్యానించారు. ఈనాడు వారి హేళన పటాపంచలయింది: యుద్ధపరిస్థితుల పరిణామమే మా వాదన సరియైనదని రుజువు చేసింది. అంతేకాదు. ఆయా ప్రభుత్వాల అధికార పత్రాలెన్నో ఇప్పుడు బయటపడ్డాయి. మేము చెప్పినదే సరియయినదని ఇవికూడా నిరూపిస్తున్నాయి.

బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్యవాదుల సోవియట్‌వ్యతిరేక పన్నాగాలకు ఒక ఉదాహరణ ఫిన్లండు యుద్ధం. 'చిన్ని' ప్రజాస్వామిక ఫిన్లండు రక్షణ కోసం అంటూ ఛేంబర్లేను ఆనాడు కార్చిన మొసలికన్నీళ్ల అసలు ఉద్దేశం సోవియటుపై దెబ్బతీయడమే అంటే ఈనాడు కాదనగల వారెవరు? యుద్ధాన్ని సోవియటుపైకి 'మళ్ళించ' డానికి సామ్రాజ్యవాదులు ఎంత తీవ్రంగా ప్రయత్నించారో ఆనాటి బ్రిటిష్ టోరీ పత్రికలను పరిశీలిస్తే స్పష్టం కాగలదు.

ప్రజాస్వామిక వాదులమనుకునేవారు ఆ రోజుల్లో వేటినైతే వట్టి కల్పనలకింద లెక్కకట్టారో, వాటినే ఆనాటి వాస్తవిక విషయాలుగ చిత్తశుద్ధిగల ప్రతివ్యక్తీ ఈనాడు గుర్తిస్తున్నాడు.

బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్యవాదుల పన్నాగాలు భగ్నమవుతాయనీ, చివరకవి తమమీదికే తిరిగి కొడతాయనీ స్టాలిన్ ముందుగానే చెప్పాడు. ఏగాలికా చాపనెత్తే స్వార్థపరుడని అతన్ని ఆడిపోశారానాడు. అనిందను పలికగల సాహసం ఈనాడెవరికీ లేదు

కాంగ్రెసులో భిన్న దృక్పథాలు

కాంగ్రెసులోని పరస్పర వ్యతిరేక దృక్పథాలకు సామరస్యం కుదర్చవలసిన పని నాయకవర్గంపై పడింది. ప్రధానంగా ఈ దృక్పథాలు—

1—వాస్తవిక పరిస్థితులకు దూరమైన నైతిక సిద్ధాంతాలను అనుసరిస్తూ, గాంధీజీ బేషరతుగా యుద్ధానికి సహకారం ప్రకటించారు.

సెప్టెంబరు 5 వ తేదీన వారు వైస్రాయితో మాట్లాడి ఈ విధంగా ప్రకటించారు: "బ్రిటిన్ చేస్తున్నది ధర్మయుద్ధం. ధర్మపక్షాన్ని బలపర్చడం సత్యాగ్రహి విధి. ఆ పక్షంలో శత్రువుచేరి ఉన్నాసరే వెనుకాడకూడదు"

ఈ 'బేషరతు సహకార' ధోరణిని తృణీకరిస్తూ, వర్కింగుకమిటీ 1939 సెప్టెంబరు 14 వ తేదీని తీర్మానం చేసింది. దానిని గురించి గాంధీజీ ఈ విధంగా అన్నారు:

> "బ్రిటనుకు ఇవ్వదలచిన సహాయమంతా బేషరతుగా ఇవ్వాలని అనుకునేవాడిని నేనొక్కడినే అయిపోయాను. అందుకు విచారించాను. ఈబేషరతు సహకారం నిష్కల్మషమైన అహింసా తత్వంతోనే సాధ్యం కాగలదు. కాని. వర్కింగుకమిటీపై మహత్తర బాధ్యతలున్నాయి. సంపూర్ణమైన అహింసావైఖరి నవలంబించడం దానికి సాధ్యం కాలేదు. శత్రువుయొక్క ఇబ్బందులను స్వప్రయోజనాలకు ఉపయోగించు కోకుండా ఉండాలంటే గొప్ప నైతికబలం కావాలి. అంతబలాన్ని కలిగించేటంతగా మనజాతి అహింసా తత్వాన్ని అలవరుచుకోలేదని వర్కింగుకమిటీభావించింది. తమ నిర్ణయానికి గల కారణాలను ప్రకటిస్తూ వర్కింగు కమిటీ ఇంగ్లీషువారిపట్ల అత్యంత సానుభూతిన్నివ్యక్తపరిచింది."
> (23—9—1939 'హరిజన్')

2—బ్రిటిష్ ప్రభుత్వానికి వారొక అవకాశం ఇవ్వాలనే ధోరణి మంత్రిపదవీ స్వీకారవాదులది. శాసనసభ ప్రవేశప్రియుల అభిప్రాయాలే వీరివికూడాను. ఎలాంటి ప్రజాపోరాటానికికూడా వీరు వ్యతిరేకులు. కాంగ్రెసు నాయకవర్గంలో వీరికే పలుకుబడి ఎక్కువ.

ఇందుకొక నిదర్శనం చూడండి: సామ్రాజ్యవాదులు మన జాతీయ వాంఛను కాలదన్నుతున్నారన్న విషయం స్పష్టమయింది.

ఎంతవత్తిడి తెచ్చినా, యుద్ధకాలంలో ఒక సలహాసంఘాన్ని పెట్టడానికి, ముందుగా కాంగ్రెసు—లీగులు ఒడంబడిక కుదుర్చుకుంటే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్లో కొద్ది స్థానాల నివ్వడానికి మాత్రమే వొప్పుకుంటున్నారు.; అంతకు మించిదిగిరావడంలేదు ఇంత జరిగిన తరువాతకూడా 1939 నవంబరు 5 వ తేదీని అహమదాబాదులో ఉపన్యసిస్తూ సర్దార్ పటేల్ ఈ విధంగా అన్నారు:

> "ఇక కాంగ్రెసు వైఖరి ప్రభుత్వం తీసుకునే చర్యనుబట్టి ఉంటుంది. తన నిత్య కార్యక్రమానికి అడ్డుతగిలినట్లయితే కాంగ్రెసు ప్రతిఘటిస్తుంది. ప్రస్తుత క్లిష్టపరిస్థితుల్లో బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం కాంగ్రెసుకు లేదు."
> ('బొంబాయి క్రానికల్'—6-11-39)

ప్రజాపోరాటం కూడదని శాసనసభ ప్రవేశప్రియులు వెలిబుచ్చిన భావాలను, ఆధ్యాత్మికభాషలో గాంధీజీ ప్రకటించిన వైఖరిని, సర్దార్ పటేల్ ఈ విధంగా రాజకీయభాషలో పెట్టాడు.

పై విషయాలనుచూస్తే ఒకవిషయం స్పష్టమవుతుంది. బేషరతుగా సహకారం చేయాలనే వైఖరి గాంధీజీ అవలంబించారు; వర్కింగు కమిటీ ఆ వైఖరిని తృణీకరించినా, బ్రిటనుపట్ల సహకారభావాన్ని కనబరిచింది. అంటే, ఇబ్బందిలోఉన్న బ్రిటనుపట్ల సానుభూతిఅంటూ, భారత స్వాతంత్ర్యోద్యమాన్ని ముందుకు నడప నిరాకరించారన్నమాట.

3—కార్యదీక్షాపరులైన జాతీయ శక్తులన్నీ తక్షణ పోరాటానికి తహతహ కనబరిచాయి.

ఈవిధంగా యుద్ధంపట్ల కాంగ్రెసువిధానం పరస్పర వైరుధ్యాలతో కూడుకొంది. తీర్మానాల్లో అది సామ్రాజ్యవాద యుద్ధమనే దృక్పథం ప్రధానంగా కనబడుతున్నప్పటికీ, సహకారానికి కావలసినంత అవకాశం ఇవ్వబడింది.

"సామ్రాజ్యవాదపద్ధతుల్లో సాగింపబడుతూ, భారతదేశంలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ సామ్రాజ్యవాదపెత్తనాన్ని చిరస్థాయి చేయడానికి ఉద్దేశింప

బడిన యుద్ధంతో వర్కింగ్‌కమిటీ ఏలాంటి సంబంధం పెట్టుకోజాలదు: ఏలాంటి సహకారం చేయజాలదు." (14 సెప్టెంబరు 1939—వర్కింగు కమిటీ తీర్మానం)

ఇదే మాకు కొండంత అనిపించింది. ఈయుద్ధం నిజంగా సామ్రాజ్య వాదయుద్ధమని కాంగ్రెసువాదులకు, ప్రజలకు నచ్చజెప్పడానికి అడ్డు లేకుండా పోయింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదం విషయంలో మీకున్న భ్రమల నన్నిటినీ వాస్తవిక ఘటనలే తొలగిస్తాయని నమ్మాము. అదేసమయంలో మీవైఖరి. దురదృష్టవశాత్తు బ్రిటిష్‌ప్రభుత్వానికికూడా అనుకూలపడింది. మీరు ప్రజాపోరాటాన్ని ప్రారంభించ బోవటంలేదని వారు గ్రహించారు. "సెబాస్" అనుకున్నారు.

మీరనుసరించిన వంకరటింకర మార్గాన్ని గుర్తుకు తెస్తాము.

మీ వంకరటింకర పంథా

మీరు సామ్రాజ్యవాదుల ధర్మబుద్ధిమీద ఆశలు పెట్టుకున్నారు. ప్రజా ఉద్యమం అంటే భయపడ్డారు. ఈ వైఖరివల్లనే మీరు వంకరటింకర మార్గాలను అనుసరించవలసి వచ్చింది.

1939 సెప్టెంబరు 5వ తేదీని గాంధీజీ వైస్రాయిని కలుసుకున్నారు. బ్రిటన్‌చేస్తున్నది "ధర్మయుద్ధ"మని ప్రకటించారు; బేషరతుగా సహకారం చేయాలన్నారు.

"ఈక్షణంలో నేను ఆలోచిస్తున్నది భారతదేశ స్వాతంత్ర్యాన్ని గురించికాదు. ఆ స్వాతంత్ర్యము ఎలాగూ వస్తుంది. కాని ఇంగ్లండు, ఫ్రాన్సులు పతనమయిపోయినా, లేక ఈదేశాలు జయించి జర్మనీశిధిలమయిపోయినా, మన స్వాతంత్ర్యంయొక్క విలువ ఏమిఉంటుంది"? (9—9—1939—'హరిజన్') అని గాంధీజీ అన్నారు.

ఈవిధంగా బ్రిటనుకు బేషరతుగా నైతిక సహకారాన్ని అందజేయాలన్నారు గాంధీజీ.

కాని, వర్కింగుకమిటీ ఈపంథాను నిరాకరించింది. 1939 సెప్టెంబరు 14వ తేదీని వర్కింగుకమిటీ చేసిన తీర్మానం ఫాసిజాన్ని ఈవిధంగా ఖండించింది. "ఫాసిస్టు, నాజీ సిద్ధాంతాలను, వాటి కార్యాచరణను, అవి

అవలంబించే యుద్ధారాధనను, మానవత్వాన్ని అవి అణగద్రొక్కడాన్ని వర్కింగుకమిటీ తీవ్రంగా ఖండిస్తుంది.... ఎన్నోఏండ్లుగ భారతప్రజలు ఎదుర్కొంటున్న సామ్రాజ్యవాదమే ఫాసిజం, నాజీజాల్లో తీవ్రరూపం దాల్చిందని ఈకమిటీవారు గ్రహించారు." పోలెండుపై నాజీదురాక్రమణను ఖండిస్తూ ఆతీర్మానం ఇలాతెలిపింది :

" సామ్రాజ్యవాద పద్ధతుల్లో సాగింపబడుతూ, భారతదేశంలోను, ఇతర ప్రాంతాల్లోను సామ్రాజ్యవాద పెత్తనాన్ని చిరస్థాయి చేయడానికి ఉద్దేశంపబడిన యుద్ధంతో వర్కింగు కమిటీ ఏలాంటి సంబంధం పెట్టుకోజాలదు. ఏలాంటి సహకారం చేయజాలదు. " ఇలా అన్న తరువాత వర్కింగుకమిటీ అవలంబించిన వైఖరి ఏమిటి? ప్రజాస్వామ్య స్థాపన విషయంలోను, 'ఇకముందు నిర్మించాలనుకుంటున్న నూతన ప్రపంచ వ్యవస్థ' విషయంలోను తమ యుద్ధ ఆశయాలను ప్రకటించ వలసిందని ఛేంబర్లేను ప్రభుత్వాన్ని కోరారు. సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభిస్తామని బెదరిస్తూ, కొన్ని సంస్కరణలకోసం బేరాలు ప్రారంభించారు. కేంద్రశాసన సభలోని కాంగ్రెసు సభ్యుల్ని సభా వ్యవహారాల్లో పాల్గొనవద్దని అప్పటికప్పుడే ఆజ్ఞాపించారు.

కాని, చేంబర్లేను ప్రభుత్వానికి అభివృద్ధికర ఆశయాలు ఏకోశానా లేవు. అభివృద్ధి నిరోధక పాతవ్యవస్థనే ప్రపంచంలో సుస్థిరం చేయడానికీ, సోవియట్ దేశంలో కూడా తిరిగి స్థాపించడానికీ హిట్లరును ఉపయోగించాలని ఆ ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నించింది. భారత ప్రజా నాయకులతో సంప్రదింపులు జరపమని ఈ ప్రభుత్వం వైస్రాయిని ఆజ్ఞాపించింది. ఆ వైస్రాయికి యాభై ఇద్దరు నాయకులు దొరికారు. వారితో సంభాషణలు జరిపాడు. చివరకు బ్రిటిష్ ప్రభుత్వం చేయగలదంతా ఒక "సలహా సంఘాన్ని" స్థాపించడమే అని మొండిచేయి చూపించాడు. ఈసలహా సంఘాన్ని సమావేశపరిచే అధికారితానే; దానికి అధ్యక్షుడుకూడా తానే. దాని సభ్యులను కూడా భారత రాజకీయపక్షాలు తయారుచేసిన జాబితాల్లోనుంచి తానే ఎన్నుకుంటాడు.

ఈ వైఖరి "అన్నివిధాల దురదృష్టమ"ని వార్ధాలో జరిగిన వర్కింగుకమిటీ సమావేశంలో విచారించింది. "ఈపరిస్థితుల్లో వర్కింగు

కమిటీ బ్రిటనుకు ఏలాంటి సహకారం చేయజాలద"ని ప్రకటించింది. అలా సహకారం చేయడం సామ్రాజ్యవాద విధానాన్ని ఆమోదించడమే అవుతుందని తెలియజేసింది. ఇక తన సహాయనిరాకరణ కార్యక్రమంలో మొదటిమెట్టుగా కాంగ్రెసుమంత్రులను రాజీనామా ఇవ్వమని ఆదేశించింది.

తోడేలుని శాకాహారి కమ్మనడం ఎంత సబబో, ఛేంబర్లేను ప్రభుత్వాన్ని యుద్ధాశయాలు ప్రకటించమనడం అంత సబబయిన పని.

కార్యశూన్యత

ప్రభుత్వాధికారాన్ని భారతప్రజలకు అప్పగించమని బ్రిటిష్ ప్రభుత్వానికి విజ్ఞాపనలు చేయడంతోనే 1939 అక్టోబరు మొదలుకొని 1940 మార్చి వరకు వర్కింగుకమిటీ వెళ్ళబుచ్చింది. ప్రజల్నిమాత్రం చేతులుముడుచుకు కూర్చోమంది. "మాటల్లోను చేతల్లోను నిగ్రహం చూపవలసింద"ని ఆదేశించింది (ఏ. ఐ. సి. తీర్మానం.) యుద్ధానికి వ్యతిరేకంగా, తమ హక్కులను రక్షించుకోడానికి ఎక్కడయినా ప్రజలు చొరవతీసుకొని పోరాటాలు జరిపితే మందలిస్తూ వచ్చింది. ఉదాహరణకు; 1939 అక్టోబరు 2 వతేదీని బొంబాయిలో, యుద్ధానికివ్యతిరేకంగా మేమొక బ్రహ్మాండమైన సమ్మెను నడిపాం. 90.000 మంది కార్మికులందులో పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంపట్ల కార్మికులు ప్రదర్శించిన ఈ ఉత్సాహాన్ని వర్కింగుకమిటీ హర్షించలేదు. పైగా, "తొందరపడి శాసనోల్లంఘనానికిగాని, రాజకీయసమ్మెలు మొదలైన చర్యలకుగాని పూనుకోవద్ద"ని కాంగ్రెసువాదులను హెచ్చరించింది. (22—10—39 వర్కింగు కమిటీ తీర్మానం.)

1939 నవంబరు మాసంలో వైస్రాయి బ్రిటిష్ ప్రభుత్వ వైఖరిని తేటతెల్లంచేశాడు. వైస్రాయికార్యనిర్వాహకవర్గాన్ని పెద్దదిచేసి, కాంగ్రెసు లీగు ప్రతినిధుల్ని అందులోకి తీసుకోవడం మినహా బ్రిటిషుప్రభుత్వం ఏమీ చేయదనీ, దానికైనా కాంగ్రెసులీగులు ముందుగా తమలోతాము ఒడంబడిక కుదుర్చుకోవాలనీ స్పష్టంచేశాడు.

దానిపై వర్కింగుకమిటీ అలహాబాదులో సమావేశమయింది. పోరాటం తప్పేటట్లు లేదు. కాని తప్పించాలని దానిఉద్దేశం. అందుచే ఒక

తీర్మానంచేసింది. శాసనోల్లంఘనోద్యమానికి ప్రజలు చూపుతున్న తహతహను ప్రశంసించింది. కాని, ఆఉద్యమం ప్రారంభించడానికి అంతా సిద్ధంగా ఉన్నారని రుజువుచేయాలనుకుంటే తీవ్రంగా నూలు వడకాలనీ, ఖద్దరును ఎక్కువగా ప్రోత్సహించాలనీ, మత సామరస్యాన్ని పెంపొందించాలనీ, వ్యక్తిగత ప్రజాసేవ చేయాలనీ, భ్రాతృభావం వ్యాప్తి చేయాలనీ-ఇదే సంసిద్ధతకు "నిజమైన గీటురాయి" అనీ హెచ్చరించింది.

(23—11—1939—వర్కింగుకమిటీ తీర్మానం.)

ఈకార్యశూన్యతపట్ల ఏ. ఐ. సి. సి. లోనే అసంతృప్తి పెరుగ సాగింది. వర్ధా ఏ. ఐ. సి. సి. సమావేశంలో "ఏ. ఐ. సి. సి. తొందరపడి ఏలాంటి నిర్ణయం చేయదలచుకోలేదు" అని తీర్మానంపెట్టినప్పుడు 58 మంది సభ్యులు వ్యతిరేకంగా వోటుచేశారు, పెరిగిపోతూన్న ఈఅసంతృప్తికి ప్రతిక్రియగా నాయకవర్గం కాంగ్రెసుమహాసభను వాయిదావేసింది. సర్వాధికారాలు తనచేతిలోకే తీసుకొంది. చేతులు ముడుచుక్కూర్చుంది. ఈ సమావేశాన్ని గురించి 'బొంబాయిక్రానికల్' పత్రిక 1939 అక్టోబరు 11వ తేదీ సంచికలో ఈవిధంగా శీర్షికలు పెట్టింది:

"వర్కింగు కమిటీకి నియంతృత్వ అధికారాలు,
నాయకవర్గం చర్యను ఏ. ఐ. సి. సి. ఆమోదించింది.
మన పాత్రఏమిటో మరో 15 రోజుల్లో తేలిపోతుం దన్నాడు
నెహ్రూపండితుడు."

కాని దీనివల్లకూడా ఫలితం ఏమీలేకపోయింది.

1940 ఫిబ్రవరిలో గాంధీజీ వైస్రాయిని మళ్ళీ కలుసుకున్నారు. "శాంతియుతంగా గౌరవ ప్రదంగా పరిష్కారం కుదిరే అవకాశం ఏమీ లేద" ని తెలుసుకున్నారు. పోరాటం ఎంతతప్పనిసరి అవుతూవచ్చిందో, దానిపట్ల నాయకవర్గపు విముఖత అంత పెరుగుతూ వచ్చింది.

బెదరింపు

నాయకవర్గంయొక్క ఈ ధోరణి రాంఘర్ కాంగ్రెసు (1940 మార్చి) లో తుదిమెట్టు చేరింది. సంపూర్ణ స్వాతంత్ర్యము, సర్వజనీన

వయోజన వోటింగు పద్ధతిపై ప్రజాపరిషత్తు (కాన్‌స్టిట్యూయెంట్ అసెంబ్లీ) ను స్థాపించడం తప్ప మరిదేనికీ భారతదేశం అంగీకరింప జాలదని నాయకవర్గం ఎలుగెత్తి చాటింది. "ఉద్యమానికి కాంగ్రెసు మహాసంస్థ సంసిద్ధంగా ఉందని గ్రహించిన వెంటనే, లేదా ఏకారణముచేత నయినా తీవ్ర పరిస్థితి ఏర్పడిన తక్షణం, తప్పకుండా శాసనోల్లంఘనోద్యమం ప్రారంభిస్తామ" ని ఉద్ఘాటించారు. ఒకవైపు ఇలా అంటూనే, మరోవైపు కాంగ్రెసువాదుల కిలా హెచ్చరించారు. "క్రమశిక్షణకు పూర్తిగా కట్టుబడి ఉన్నారనీ, నిర్మాణ కార్యక్రమాన్ని తూచ తప్పకుండా కొనసాగిస్తున్నారనీ, తనకు పూర్తినమ్మకం కలిగినప్పుడే తాను శాసనోల్లంఘ నోద్యమాన్ని ప్రారంభిస్తాన" ని గాంధీగారు చేసినప్రకటనను గుర్తుకుతెచ్చారు. ఆ కాంగ్రెసుమహాసభలో గాంధీజీ ఉపన్యసిస్తూ తనదృష్టిలో కాంగ్రెసువాదులు పోరాటానికి సిద్ధంగాలేరని ఖచ్చితంగా చెప్పారు. వారి ఉపన్యాసం గమనించ తగ్గది. వారిలా అన్నారు :

"మీరు సంసిద్ధంగాలేరని నా అభిప్రాయం. మన దేశంలోనే మనం బానిసలుగా పడివున్నామని అందరం గుర్తిస్తున్నామన్న విషయం నిజమే. మనకు స్వాతంత్ర్యం అత్యవసరమన్న విషయాన్ని కూడా అందరం గుర్తిస్తున్నాం. అంతేకాదు. ఈ స్వాతంత్ర్యంకోసం మనం పోరాడవలసి ఉంటుందని కూడా గుర్తించాం. తక్షణం శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభించవలసిందని ఉపన్యసించిన వారిని మీరు హర్షించారు. ఆహర్షధ్వానాల్లో నాగొంతుకూడా కలుపుతాను. నా ఇంటిలో ఒక దొంగ జొరబడి నన్ను బయటికి నెట్టివేశాడు. వాడితోపోరాడి నాఇంటిని నేను తిరిగి స్వాధీనం చేసుకోవాలి. కాని, అందుకు ముందుగా సిద్ధంకావాలి. (హర్షధ్వనులు) మీహర్షధ్వనులను బట్టి చూస్తే ఈ సంసిద్ధత అంటే ఏమిటో మీరు అర్థంచేసుకోలేదని స్పష్టమవుతూంది. మీరు సిద్ధంగాలేరనీ, మీరు నిజమైన సైనికులు కారనీ, మీరు సూచించిన పద్ధతులనుబట్టి పోతే అపజయం తప్పదనీ, మీ సేనాధిపతినైన నేను గ్రహించాను,

ప్రారంభంలో ఈ నిరాశా బీజాలనునాటి, చివరకాయన తన ఉపన్యాసాన్ని ఇలా ముగించారు:

"సత్య, అహింసా, చర్ఖాలలో పూర్తి విశ్వాసం లేకపోతే మీరు నా సైనికులుగా ఉండతగరు. మరోమారు నొక్కిచెబుతున్నాను—మీకి విశ్వాసంలేకపోతే నన్ను విడిచిపెట్టండి; మీపద్ధతులను మీరనుసరించండి" (ఇండియన్ ఏన్యుయల్ రిజిస్టర్: 230 వ పేజీ: 1940 మార్చి)

ఈ వైఖరితో ఏకీభవించనివారిని సాధ్యమైనంతవరకు కాంగ్రెసులో నుంచి తొలగించవలసిందని ఆజ్ఞాపిస్తూ సర్క్యులర్లు పంపారు. సత్యాగ్రహులను రెండుతరగతులుగ విభజించారు—సత్యాగ్రహ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేవారూ; అలా పాల్గొనకుండా ఉంటూ సానుభూతి చూపేవారూ. మొదటితరగతివారు రోజూ నూలువడకాలి, ఎప్పుడూ ఖద్దరు కట్టాలి...."విజయీభవ" అని ఉద్యమాన్ని ఆశీర్వదించే వారంతా రెండో తరగతి. ఈ రెండుతరగతులవారు కూడా శాసనోల్లంఘనంచేసి జైలుకు వెళ్ళకూడదు; కార్మికులు, విద్యార్థులు మొదలయిన వారిచేత సమ్మెలు చేయించకూడదు; ఒకవేళ సమ్మెలు జరిగితే వాటికి తోడ్పడగూడదు.... ఇంకా ఏవేవో నిబంధనలు పెట్టారీసర్క్యులర్లలో. ఏ. ఐ. సి. సి. ప్రధాన కార్యదర్శి కాంగ్రెసువాదుల కందరికీ మార్చి 29 వ తేదీన నాలుగోనెంబరు సర్క్యులర్ పంపాడు. ఉద్యమంపట్ల ఉత్సాహంగల వారందరినీ ఈ మొదటితరగతి సత్యాగ్రహులుగానో, లేక "నిస్తబ్దంగా ఉండడం ద్వారా ఉద్యమానికి సహాయం చేసే" రెండోతరగతిలోనో చేరవలసిందని ఇది ఆదేశించింది. ఈ ఆదేశాన్ని కాంగ్రెసువాదులు లెక్కచేయక పోవచ్చునని ఊహించి, "ఏమీ చేయకుండా కాచుక్కూర్చునే వారుకూడా ఉద్యమానికి సేవచేసినవారే అవుతార"ని ఈ సర్క్యులర్లో తెలియజేశారు. ('ఇండియన్ ఏన్యువల్ రిజిష్టరు'—239 వ పేజీ—1940 మార్చి)

నాయకవర్గం భాషకు మెరుగు పెట్టిందేగాని, కార్యాచరణలో ఏలాంటి మార్పూలేదు.

ఈ విధంగా, స్వాతంత్ర్య పోరాటం ప్రారంభించడానికి దేశం సంసిద్ధంగా లేదని కాంగ్రెసునాయకవర్గం ఒకవైపు ప్రకటనలు కురిపిస్తూ వచ్చింది. మరోవైపు సామ్రాజ్యవాద ప్రభుత్వం ఇండియా రక్షణచట్టం అనే

అస్త్రాన్ని ప్రయోగించి కాంగ్రెసు సేనలో అగ్రదళంపై దెబ్బతీయ నారంభించింది. ప్రభుత్వ నిర్బంధచర్యల జాబితాను పంపించవలసిందని ఏ. ఐ. సి. సి. రాష్ట్రకమిటీలను కోరింది. ఈ అరెస్టులు, సోదాలు, శిక్షల జాబితాలతో 'ఇండియన్ ఏన్యువల్ రిజిస్టరు'లో 24 పేజీలు నిండిపోయాయి; అప్పటికీ అది అసంపూర్ణమే. ప్రజాపోరాటం కావాలనే వారినందరినీ ప్రభుత్వం అరెస్టు చేయసాగింది.

కొన్ని షరతులపై సహకారం

ఈ పోరాటాన్ని వ్యతిరేకించే మంత్రిపదవీ స్వీకారవాదులు పోరాటాన్ని రాకుండాచేసి, కొన్ని సంస్కరణలను సంపాదించగల అవకాశం కోసం వెతకనారంభించారు. ఆరోజుల్లోనే ఫ్రాన్సు పతనమయింది. ఇదే వీరికి మంచి అవకాశ మనిపించింది. సామ్రాజ్యవాదులతో మంచిబేరం సాగించగలమనే ఆశలు తిరిగి తలచూపాయి; బ్రిటన్ చాల విషమ పరిస్థితిల్లో చిక్కుకొంది; యుద్ధం ప్రారంభమయిన తరువాత ఇంత విషమస్థితి ఎప్పుడూ సంభవించలేదు. ఈపరిస్థితుల్లోగాని కాంగ్రెసుమిలిటరీ సహకారం చేస్తానంటే పాచికలన్నీ పారగలవనుకున్నారు. ఈ అంచనాల ఫలితమే 'పూనా సూచనలు'. కాని, మిలిటరీ సహకారం చేయడమంటే అహింసా సిద్ధాంతాలకు తిలోదకాలివ్వడ మన్నమాట. ఏ. ఐ. సి. సి. పూనా సమావేశం జరుగపోయేముందు వర్కింగుకమిటీ ఈపనికూడా చేసేసింది.

పూనా సమావేశంలో అధ్యక్షోపన్యాసంచేస్తూ మౌలానాఅజాద్ ఇలా అన్నారు:

“దేశంలో అల్లరులను ఎదుర్కొనవలసి వచ్చినప్పుడూ, బయటినుండి జరిగేదురాక్రమణను ప్రతిఘటించవలసి వచ్చినప్పుడూ కూడా హింసాపద్ధతులను ఉపయోగించము అని నిర్ణయించే బాధ్యతను తీసుకోగల శక్తిమాకులేదని మాలో చాలామందిఅభిప్రాయం. కాని, ఒక్కవిషయాన్ని మేమందరం స్పష్టంగా గుర్తించాము. ఈ ఇరవైఏళ్ళ కాంగ్రెసు ఉద్యమచరిత్రలో అహింసా సిద్ధాంతం ఏ పాత్రనైతే నిర్వహిస్తూ వచ్చిందో అదే పాత్రను ఈనాడుకూడా స్వాతంత్ర్య సమరంలో కొనసాగించాలని మేమందరం గుర్తించాం. ఈ విషయంలో ఏమాత్రం దారితప్పినా అది కాంగ్రెసుకే రాజకీయ ఆత్మహత్య అవుతుందని గుర్తించాం.”

ఇది చాల చిత్రమయిన ప్రకటన. ఆరోజుల్లో బయటనుండివచ్చే ప్రమాదం ఏదీలేదు. దేశంలోనా, కాంగ్రెసు మంత్రివర్గాలు ఎదుర్కోవలసిన అల్లరులుకూడా ఏమీలేవు. అసలు కాంగ్రెసు మంత్రివర్గాలు అప్పటికింకా ఏర్పడనేలేదు. అయినా అధ్యక్షులు ఇలాంటి ప్రకటనచేశారంటే దానిభావమేమిటి? స్వాతంత్ర్యంకోసం ప్రజాపోరాటం కలలోనివార్త; సహాయ నిరాకరణ వైఖరినుండి కాంగ్రెసు నాయకవర్గం దిగజారుతూంది. సామ్రాజ్యవాద యుద్ధమని తామేనిర్వచించిన యుద్ధానికి కొన్ని షరతులపై మిలిటరీ సహకారం చేయడానికి సిద్ధపడుతూంది— ఇదీ దీనిభావం. కాని సామ్రాజ్యవాద ప్రభుత్వం ఈ సూచనలను వరప్రసాదంగా భావించలేదు. అహంకారంతో తృణీకరించింది. మరి కొంతమంది భారతీయుల్ని తన కార్యవర్గంలోకి తీసుకోవడం, యుద్ధసలహా సంఘాన్ని ఏర్పరచడం మినహా తానేమీ చేయనుపొమ్మని వైస్రాయి 1940 ఆగస్టు ప్రకటనలో అన్నాడు. ప్రధానరాజకీయపక్షాల ప్రతినిధులు, ప్రొద్దుపోవడానికి కావాలంటే రాజ్యాంగ నిర్మాణం సాగించవచ్చు నన్నాడు. నిస్సందేహంగా ఇదొక పెద్ద మొట్టికాయ. మరోసారి పోరాటం తప్పదనిపించింది.

1940 సెప్టెంబరు 15వ తేదీని బొంబాయిలో ఏ. ఐ. సి. సి. సమావేశమయింది. కాంగ్రెసుకు తిరిగి నాయకత్వం వహించి పోరాటం నడిపించవలసిందని గాంధీజీని కోరారు. వెంటనే ఆయనిలా ప్రకటించారు:

“ప్రజాపోరాటం కలలోనివార్త. ఉండే వ్యక్తిశాసనోల్లంఘనం ఉండవచ్చు; నేనింకా ఖచ్చితంగా చెప్పలేను. ఏదైనా ఒకపద్ధతికోసం నేనింకా వెదుకులాడుతున్నాను. ఇంతవరకు ఏమీదొరకలేదు.” ఇండియన్ ఏన్యువల్ రిజిష్టరు 26వ పేజీ 1940 సెప్టెంబరు)

ప్రజాపోరాటాన్ని తక్షణంప్రారంభించవలసి[illegible] సవరణ తీర్మానాలన్నీ ఓడిపోయాయి. అయిదుగురుక[illegible]టికి వోటు చేయలేదు. వాటి కనుకూలంగా వోటు చేయగల వారందరూ అదివరకే సామ్రాజ్యవాద ఖైదీ కొట్లలో మ్రగ్గుతున్నారు. ప్రజాపోరాటం ప్రారంభించడానికి తగిన సమయమేదో తన[illegible] తెలుసుననీ గాంధీగారు

ప్రకటించారు. "అలాంటి పోరాటానికి తగిన స్థితిలో దేశమిప్పుడు లేద" న్నారు.

స్వాంత్ర్య పోరాటాన్ని ప్రారంభించడాని కిలా వెనుకాడడం నిజాయితీ గల ప్రతి దేశభక్తుడికీ అసంతృప్తి కలిగించింది. ఈ మాత్రం పరిమితపోరాట మయినా కూడదన్నది. ఒక్క యం. యన్ రాయ్. సామ్రాజ్యవాదం ఒక అభివృద్ధికరశక్తిగా పరిణామం పొందిందనీ, కాబట్టి బేషరతుగా దానికి సహకారం చేయాలనీ. అతనప్పటికే ఒక సిద్ధాతం లేవదీశాడు. గాంధీజీ సూచించిన పరిమిత పోరాటం "జర్మనీ, యిటలీ ప్రభుత్వాలకు మాత్రమే సంతోషం కలిగిస్తుంది. అది మానవ మాత్రులకు ఊహింపరానిది." అని ఖండించాడు.

1940 సెప్టెంబరులో గాంధీగారు వైస్రాయిని మరొకసారి కలుసుకున్నారు. అప్పుడు వైస్రాయితో చెప్పదలచిన విషయాలను బొంబాయి ఏ. ఐ. సి. సి. సమావేశంలోనే బయటపెట్టారు.

"నన్ను చూడవలసిందని వైస్రాయిగారిని కోరుతాను. వారందుకంగీకరిస్తారనడానికి నాకు సందేహంలేదు. మీతరపున వారిని కలుసుకుంటాను. నాచిక్కులను వారికి తెలుపుకుంటాను. ఈస్థితికి మమ్మల్ని తెచ్చారని చెబుతాను. వారిని ఇబ్బందిపెట్టడంగాని. యుద్ధకృషినుండి వారిదృష్టిని మరలించడంగాని మన ఉద్దేశంకాదని చెబుతాను."

పోరాటంవైపు మందగమనం

యుద్ధ వ్యతిరేక ప్రచారం సాగించగల పౌర స్వాతంత్ర్యం కాంగ్రెసుకు యిప్పించవలసిందని గాంధీజీ వైస్రాయిని కోరదలచుకున్నారు. ప్రభుత్వంవారు తమయుద్ధ ప్రచారాన్ని సాగించుకోవచ్చును; యుద్ధానికి తోడ్పడాలో కూడదో అన్ననిర్ణయాన్ని ప్రజలకే విడిచిపెట్టాలట. గాంధీజీ వైస్రాయికి ఈవిధంగా విజ్ఞప్తి చేశారు.

"జీవన్మరణసమరంలో చిక్కుకొని వుండికూడా. మీరు మాకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చారంటే మీరెంతో గౌరవపాత్రులు అవుతారు. మాగొంతు పెగలకుండా చేయగలశక్తి మీకు అపారంగా ఉంది. అయినప్పటికీ గొప్ప ఔదార్యాన్నిచూపి అహింసా సిద్ధాంతాలకు బద్ధులమై మాప్రజల్లో యుద్ధంవ్యతిరేక ప్రచారాన్ని సాగించడానికి పూర్తి స్వాతంత్ర్యం మాకిచ్చారంటే మీరెంతో గౌరవ పాత్రులవుతారు"

('ఇండియన్ ఏన్యువల్‌రిజిష్టరు' : 218 వ పేజీ: 1940 సెప్టెంబరు)

భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్య వాంఛను మూలబెట్టి, నోటిమాటలతోనయినా యుద్ధాన్ని వ్యతిరేకించగల స్వాతంత్ర్యాన్ని ఇస్తే చాలన్న స్థితికి కాంగ్రెసువర్గం దిగజారింది. "వాక్స్వాతంత్ర్యము, రచనా స్వాతంత్ర్యాలే స్వరాజ్యానికి పునాది. ఈ పునాదిరాయికే ప్రమాదం వచ్చేస్థితుల్లో, ఆ ఒక్కరాయిని కాపాడ్డానికి మీ సర్వశక్తులను వినియోగించాలి. భగవంతుడు మీకు తోడ్పడుగాక!" అన్న ప్రకటనతో ఈ దిగజారుడును సమర్ధించుకో జూశారు.

1940 సెప్టెంబరులో గాంధీజీ వైస్రాయిని కలుసుకున్నారు. అనుకున్నంతా అయింది, గాంధీజీ కోరికను వైస్రాయి నిరాకరించాడు. ఆశ్చర్యంతోను, బాధతోను గాంధీజీ 1940 అక్టోబరు 5 వ తేదీని వైస్రాయిని గురించి ఇలా ప్రకటించారు:

"ఆయన అవలంబించిన వైఖరినుంచి అంతసులభంగా కదలదలుచుకోలేదు. చర్చించదలచుకొన్న విషయంపై అదివరకే ఒకస్థిర నిర్ణయానికి వచ్చాడు. అయినా ఆసంగతిని మసుగుపరచడానికి ప్రయత్నిస్తాడు. ఆయన తననిర్ణయాన్ని మార్చుకోదలచుకోలేదన్న విషయం నిస్సందేహం. నీవాదన తను వినడు. తన నిర్ణయమే సరియయినదని అతనికున్న ధీమా ఆశ్చర్యకరము. పెద్దమనిషి తరహా ఒప్పందాల్లోగాని. మరేలాంటి ఒడంబడికల్లోగాని. ఆయనకు నమ్మకంలేదు."

ఈ ప్రకటనలో గాంధీజీ తెలిపిన విషయాలను ప్రజలు అంతకుముందే గ్రహించారు. ఇలాఅవుతుందని వారిదివరకే అనుకున్నారు. ఇంత జరిగిన తరువాతనయినా స్వాతంత్ర్య పోరాటం ప్రారంభించకపోతారా అని ప్రజలెక్కడ ఆశపడతారో అని గాంధీజీ వెంటనే హెచ్చరికచేశారు.

“స్వాతంత్ర్యం తక్షణ సమస్యకాదు. ఒకజాతిగా నిలబడగల హక్కును సాధించడమే తక్షణ సమస్య. అంటే నీభావాలను నువ్వు ప్రచారం చేసుకోగల హక్కును—అనగా వాక్స్వాతంత్ర్యాన్ని సాధించడం అన్నమాట.”

ఇక ఉద్యమ కార్యక్రమాన్ని నిర్ణయించవలసి వచ్చింది. గాంధీగారూ! వర్కింగుకమిటీ సమావేశమయూరు. శ్రీ వినోభాభావెగారు ఉద్యమం ప్రారంభించాలనీ, అది వారితోనే అగిపోవాలని ప్లాను, వారొకయుద్ధ వ్యతిరేక ఉపన్యాసం చేయాలి—అంతే. గాంధీగారు సూచించిన ఈ కార్యక్రమాన్ని వర్కింగుకమిటీలో ఇద్దరుమాత్రమే వ్యతిరేకించారు. కాని గాంధీగారన్నట్లు “క్రమశిక్షణకోసం వీరుకూడా సాధ్యమైనంతవరకు విధేయులై ఉండాలి.” ఈ ఉద్యమం దేశాన్ని స్వాతంత్ర్య గమ్యస్థానానికెలా చేరుస్తుందయ్యా అంటే గాంధీగారిచ్చే సమాధానమిది. “ఒక్కవ్యక్తి ఉద్యమేమిటని అహింసావ్రతంలో నమ్మకం లేనివాడు అపహాస్యంచేస్తారు. హింసాపూర్వకమైన చర్యయొక్క ఫలితాన్ని అంకెల్లో లెక్కగట్టగలం. కాని అహింసాయుతమైన చర్యయొక్క ఫలితాలకు విలువ కట్టలేము; విలువ కట్టడానికి జరిగిన ప్రయత్నాలు విఫలమయాయికూడా.”

పరిమిత శాసనోల్లంఘనం

ఎంతో తటపటాయింపులతో వ్యక్తిశాసనోల్లంఘనోద్యమం ఈ విధంగా ప్రారంభమయింది. ఆసరికే జాతీయ పోరాటంయొక్క పరిమితి బాగా సన్నగిలింది. వాక్స్వాతంత్ర్యం మాత్రమే దాని ఆశయమనీ, గాంధీజీ ఆమోదించిన వ్యక్తులు మాత్రమే దానిలో పాల్గొనాలనీ నిర్ణయించారు. ఈ పోరాటంలోకి ప్రజాసామాన్యం జొరబడి, అనుకున్న ప్లానంతా తలక్రిందులు చేయకుండా ఉండడంకోసం ఎన్నో కట్టుదిట్టాలు చేశారు. శాసనోల్లంఘనం చేయవలసిన వ్యక్తులు ఇండియా రక్షణచట్టాన్ని తాము ఎక్కడ, ఎప్పుడు, ఉల్లంఘిస్తారో ముందుగానే పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. అనేక సందర్భాల్లో ఈ వ్యక్తుల్ని పోలీసులు ఇళ్ళదగ్గరే అరెస్టుచేసి తీసుకుపోయారు. ఏ ప్రజల్లో నైతే యుద్ధంపట్ల నైతిక వ్యతిరేకతను ప్రచారంచేయాలో ఆ ప్రజల ముఖమైనా చూచే అవకాశం లేకుండా పోయింద వీరికి;

1940 నవంబరు 17వ తేదీన సర్దార్ వల్లభాయ్‌పటేల్ జిల్లామేజిస్ట్రేటుకు నోటీసు పంపారు. మరునాడు తాను యుద్ధవ్యతిరేక ప్రచారం చేస్తానని. ఆరాత్రే వారిని అరెస్టుచేసి డిటైన్ చేశారు. 1940వ సంవత్సరంలో క్రిస్టమస్ పండగరోజుల్లో అధికారులకు శ్రమ కలిగించకూడదని, పండగ వేడుకలకు అంతరాయం కలిగించకూడదని అనుకున్నారు, ఆవారం రోజులూ ఈ వ్యక్తిఉద్యమాన్నికూడా ఆపాలని నిర్ణయించుకున్నారు. కాని ఈ సద్భావం ఒకవైపే కనపడింది.; సామ్రాజ్యవాద ప్రభుత్వంలో ఇది మందుకయినా కనపడదు. 1940 డిసెంబరు 30వ తేదీన కాంగ్రెసు అధ్యక్షులు మౌలానా అజాద్‌ని అరెస్టుచేయడమే వారు కనబరచిన సద్భావం.

నానాటికి ఎక్కువమంది అరెస్టుకాడానికి ముందుకువచ్చారు. గాంధీగారు ఎన్నిహద్దులు పెట్టినా మొత్తం 25000 మంది జైలుకు వెళ్ళారు. స్వాతంత్ర్యసైనికుల అగ్రదళమైన కార్మికోద్యమనాయకత్వంపై సామ్రాజ్యవాదులు అదివరకే దెబ్బతీశారు. అరెస్టులు, నిర్బంధాలు, శిక్షలు 1939 సెప్టెంబరునుంచీ సాగుతూనే వచ్చాయి. మీరు ప్రారంభించిన వ్యక్తి శాసనోల్లంఘనం ఫలితంగా మిగిలిఉన్న స్వాతంత్ర్య యోధులను కాస్తా సామ్రాజ్యవాదులకు వప్పగించడమయింది. ఈ సందర్భములో ఒక విషయాన్ని మరిచిపోవద్దు. ఆరోజుల్లో బయటినుంచి యెట్టి ప్రమాదమూ సంభవించలేదు. సామ్రాజ్యవాదాన్ని సుస్థిరం చేయడానికే యుద్ధంసాగుతూ వచ్చింది; మీరు నాయకత్వం వహించి స్వాతంత్ర్యసాధనకు ముందుకు నడుపుతారని ప్రజలు ఆతురతతో యెదురుచూస్తూ వచ్చారు.

కాని మీరు ప్రజల్ని ముందుకునడపలేదు. మీ పంథాను నిర్ణయించిందికూడా మీరు కాదు. సామ్రాజ్యవాదులపై కొండంత ఆశపెట్టుకొని చొరవతీసుకొనే అవకాశాన్ని పూర్తిగా వారిచేతుల్లోనే విడిచిపెట్టారు.

స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రారంభించవలసిందని ప్రజలు మిమ్మల్ని కోరారు. దాసోహం కమ్మని సామ్రాజ్యవాదులు మిమ్మల్ని గద్దించారు. కాని ఈ సామ్రాజ్యవాదులనే మీరు నమ్మారు; వారితో పరిష్కారం కుదుర్చుకోగలమని కలలుగన్నారు. మీ సోదరప్రజల బలంపై ఆధారపడడానికి మీరు నిరాకరించారు. స్వాతంత్ర్య సాధనకు దానిని ఉపయోగించడానికే బెదరిపోయారు. కాంగ్రెసువంటి మహత్తర శక్తివంతమైన ప్రజాసంస్థ

యొక్క నాయకుడు వైస్రాయి దగ్గరకుపోయి "ఇదిగో మమ్మల్నీ స్థితికి తీసుకవచ్చార"ని బేలతనంగా విలపింపవలసి వచ్చింది. యావద్భారతజాతి కెంతటి తలవంపు! ఇదీ, మీ పంథా దేశానికి తెచ్చిపెట్టిన దీనావస్థ!

కమ్యూనిస్టు విధానం

మా పార్టీ పత్రాల్లోనుంచి ఇప్పుడు కొన్ని ఉదాహరణాల నిస్తాము. ఆ దశలో మేమవలంబించిన విధానాన్ని ఇవి విశదపరుస్తాయి.

1934 లో ప్రభుత్వం మా పార్టీని నిషేధించింది. కాంగ్రెసు మంత్రి వర్గాలక్రింద లభించిన పౌరసత్వ హక్కులను అవకాశంగా తీసుకొని 'నేషనల్ ఫ్రంటు' అనే వారపత్రికను నడిపేవాళ్ళం. యుద్ధం ప్రారంభమవడంతో దాన్నికూడా నిషేధించారు.

వెంటనే మేము 'కమ్యూనిస్టు' అనే రహస్య పత్రికను ప్రారంభించాం. 1939 నవంబరులో మొదటి సంచిక వెలువడింది. ఆ దశ అంతటనీ పరిశీలించి మాఅభిప్రాయాలను ఆ సంచిక ద్వారా ప్రజలయెదుట పెట్టాము, సామ్రాజ్యవాదుల ఎత్తుగడలను వివరించాము. దేశానికినిజంగా శ్రేయస్సును గూర్చే మార్గమేదో సూచించాము. మా 'పొలిట్ బీరో' చేసిన తీర్మానాన్ని 'కమ్యూనిస్టు' లో ప్రచురించాము. దానినుండీ దిగువ భాగాలను ఉదహరిస్తున్నాం.

యుద్ధ స్వభావం

"యూరప్‌లో ఈ నాడు సాగుతూన్న యుద్ధం ప్రజా స్వామ్యానికి ఫాసిజానికి మధ్య సాగుతూన్న యుద్ధంకాదు. ఇది సామ్రాజ్యవాద యుద్ధం 1914-18 లో జరిగిన ప్రపంచయుద్ధం యొక్క బిడ్డే యిది—రెండవ సామ్రాజ్యవాద యుద్ధం" జర్మను ఫాసిస్టులను "యుద్ధానికి ప్రధాన కారకులు" గా పేర్కొన్నాము. కాని "సోవియటుపైకి ఉసి కొల్పాలనే దురుద్దేశంతో బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఫాసిజాన్ని పోషిస్తూ రావడమే ఈ యుద్ధాన్ని త్వరపరచింద" ని స్పష్టంచేశాం.

యుద్ధాశయాలు :

"స్వాతంత్ర్య, ప్రజాస్వామ్యాల సంరక్షణకోసంకాదు బ్రిటన్ ఫ్రాన్సులు యుద్ధంచేస్తూంది. ఈ దేశాల విజయంతో ఫాసిజం పతనం కాదు సరికదా- బలహీనమయినా కాదు.... ....

.... ఆ దేశాల ప్రజల్లో పొంగులుతీస్తున్న ఫాసిస్టు వ్యతిరేకతను తమ సామ్రాజ్యవాద ఆశయాలను సాధించడానికి, తమ దేశాల్లోనే ఫాసిజాన్ని నెలకొల్పడానికి ఉపయోగించుకోవాలని ఛేంబర్లేను, దలాడియర్లు ఎత్తులువేస్తున్నారు.... విజయానంతరం వీరు యూరపులోని అన్ని దేశాల్లోను అభివృద్ధి నిరోధకత్వాన్ని సుస్థిరం చేయజూస్తారు. తమ దేశాల్లోనే ప్రజాస్వామ్యాన్ని మచ్చుకైనా లేకుండాచేస్తారు. రాజకీయంగాను. అర్థికంగాను వలసదేశాలను మరింత నిర్దాక్షిణ్యంగా దోచుకుంటారు."

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం విషమ పరిస్థితుల్లో ఉందనీ; విప్లవకర శాంతి, ప్రజాస్వామ్య, సామ్యవాద శక్తులు యెన్నోరెట్లు బలవత్తరంగా ఉన్నాయనీ; సామ్రాజ్యవాద, ఫాసిస్టు శక్తుల పరాజయం తప్పదనీ మేము నొక్కిచెప్పాము.

మన కర్తవ్యం

"ఈ యుద్ధపరిస్థితులను దేశ స్వాతంత్ర్యసాధనకు విప్లవకర పద్ధతుల్లో ఉపయోగించుకోవాలి - ఈ నూతనదశలో జాతీయశక్తుల ప్రధాన కర్తవ్యం యిదే.... బ్రిటిష్ ప్రభుత్వానికి - భారత ప్రజలకు మధ్యనున్న ఘర్షణ ఈ యుద్ధపరిస్థితులలో తీవ్రమవుతుంది. అంతేకాదు, యీ ఘర్షణ వేయిరెట్లు తీవ్రతరమవుతుంది.... యుద్ధ వ్యతిరేకత పెరుగుతుంది. స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమవుతుంది."

"ఈవిధంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇదివరకెన్నడూలేని ప్రజా సమీకరణను త్వరలోనే సాధించగల అవకాశాలు హెచ్చవుతాయి. ఎంతో వెనుకబడిన ప్రజల్నికూడా పోరాటంలోకి తీసుకురావడానికి, ప్రభుత్వాన్ని పూర్తిగా ఏకాకిని చేయడానికి అవకాశాలు కలుగుతాయి. తత్ఫలితంగా యీ సామ్రాజ్యవాద యుద్ధాన్ని జాతీయ స్వాతంత్ర్య సమరంగా మార్చగల పరిస్థితులేర్పడుతాయి. మన జాతీయోద్యమానికంతటికీ యీ దృక్పథం

అలవడేటట్లు చేయాలి. ఈ నూతనదశలో ప్రతి కాంగ్రెసువాది వైఖరి కూడా ఈ దృష్టినిబట్టే ఉండాలి. అధికారాన్ని స్వాధీనంచేసుకోవడం తక్షణమే సాధ్యమైన పని; అందుకు తగిన సన్నాహాలు వెంటనే ప్రారంభం కావాలి."

సామ్రాజ్యవాదుల పన్నాగాలు

"భారతదేశ ఐశ్వర్యాన్ని, మనుష్య సంపదను తన యుద్ధకృషికి వినియోగించుకోవాలని చూస్తుంది సామ్రాజ్యవాద ప్రభుత్వం. కాని, అన్నిటికన్నా ముఖ్యంగా "దేశం శాంతంగా ఉండాలని" దాని తహతహ. జాతీయోద్యమంలోని విప్లవశక్తులయిన సోషలిస్టులు, కమ్యూనిస్టులు, రాడికల్ కాంగ్రెస్‌వాదులపై కఠోరనిర్బంధ విధానం అమలుజరిపి, ప్రతి ప్రజాఉద్యమాన్ని ఆదిలో అణగగొట్టి దేశాన్ని 'శాంతంగా' ఉంచాలని దీని ఉద్దేశం. ఇందుకోసం అది విచ్ఛిన్నకర శక్తుల్ని ప్రోత్సహిస్తుంది. వాటిద్వారా మతకలహాలను రెచ్చకొట్టి జాతీయోద్యమాన్ని అల్లకల్లోలం చేయాలనుకొంటుంది."

ఆ తరువాత కొద్దినెలల్లోనే జరిగిన ఘటనలు మా వివరణ ఎంత సరియైనదో ఋజువుచేశాయి. ఒకవైపు జాతీయశక్తుల్లో అగ్రదళంపై ప్రభుత్వం విరుచుకుపడటం. మరోవైపు మతకలహాలు చెలరేగడం యదార్థఘటనలయాయి.

మేము స్పష్టంగా చెప్పాము. "నిర్బంధవిధానం సామ్రాజ్య ప్రభుత్వం యొక్క ఏకైకసాధనం కాదు; అదివారి ముఖ్య ఆయుధం కూడా కాదు. మరోమార్గం ఉంటే దానిని ఉపయోగించదుకూడా. జాతీయ నాయకుల్ని, అంటే కాంగ్రెసు నాయకవర్గాన్ని 'మంచి' చేసుకొని, జాతీయోద్యమం పోరాటానికి దిగకుండా చేయాలనే సామ్రాజ్యవాదులు ముఖ్యంగా ప్రయత్నిస్తారు.

కాని, అంతమాత్రంచేత దేశంలోని ధనిక వర్గాల కోసమైనాసరే, రాజకీయంగాగాని, ఆర్థికంగాగాని; పెద్ద సంస్కరణలను చేయడానికి సామ్రాజ్యవాద ప్రభుత్వం యెన్నటికీ ఒప్పుకోదు.

సామ్రాజ్యవాదుల ఆర్థిక అవసరాలకు మధ్య వైరుధ్యముంది. సంస్కరణల అవసరం లేకుండానే ఎదిరి పక్షనాయకులను మంచి

చేసుకొని ఈ సమస్యను పరిష్కరించు కోవాలని సామ్రాజ్య వాదులు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తారు......

మనజాతీయ నాయకవర్గంలో ఉన్న బలహీనతను, ప్రజాపోరాటం అంటే వారికున్న బెదురును సామ్రాజ్యవాద ప్రభుత్వం అవకాశంగా తీసుకొంటుంది. అందువల్లనే జాతీయ కాంగ్రెసు ప్రకటించిన వాంఛలను అది తృణీకరించ గలిగింది.

జాతీయ నాయకుల పంథా

"ప్రజా పోరాటాన్ని ప్రారంభించడం కాంగ్రెసు నాయకవర్గంలోని ముఖ్యులకు ఇష్టంలేదు. పోరాటం అవసరం లేకుండానే, యుద్ధ పరిస్థితులను అవకాశంగా తీసుకొని సామ్రాజ్యవాద ప్రభుత్వంతో మంచి బేరం కుదుర్చుకోవాలని వీరి ఉద్దేశం.

(సామ్రాజ్యవాదం ఎలాంటి సంస్కరణలు చేయ నిరాకరిస్తున్నప్పటికి వీరీ ఉద్దేశ్యం వదలుకోవడంలేదు) పోరాటాన్ని విసర్జించి రాజీ ధోరణినే వీ రనుసరిస్తున్నారు. ఒకవేళ ప్రజా వత్తిడికి తట్టుకోలేక పోరాటం ప్రారంభించవలసి వచ్చినప్పటికీ దాని కెక్కడ లేని హద్దులుపెట్టి, చివరకు దానినికూడా రాజీ కుదుర్చుకోడానికి ఒక సాధనంగా ఉపయోగిస్తారు.

దూరదృష్టితో పరిస్థితులను స్పష్టంగా అవగాహన చేసుకోగలిగామని చెప్పుకునే అర్హత మాకు లేదంటారా ? గాంధీగారు వ్యక్తి శాసనోల్లంఘ నోద్యమాన్ని ప్రారంభించడానికి ఒక సంవత్సరం ముందుగానే అది ఎలావుంటుందో ప్రజలకు చెప్పగలిగాము.

"ప్రస్తుత ప్రతిష్టంభన వేరేరూపంలో కొనసాగుతూనే వుంటుంది. చొరవ తీసుకొనే అవకాశం సామ్రాజ్యవాదుల చేతుల్లోనే వుంటుంది. లండన్, సిమ్లాలవైపు చూస్తూ కూర్చుంటారు. ఈ విధాన ఫలితంగా జాతీయశక్తుల్లో అధికభాగం నిస్తబ్ధ మయిపోతుంది. అగ్రదళం ఏకాకి అయిపోతుంది. ప్రభుత్వం దానిని అణచివేయ గల్గుతుంది.

చివరకు బ్రిటిషు ప్రభుత్వమే జయించి తనకు తోచిన షరతులను ప్రకటించ గల్గుతుంది."

కర్తవ్యమేమిటి ?

దేశాన్ని స్వాతంత్ర్యమార్గాన నడిపించడం మా ఒక్కరివల్లనే సాధ్యమవుతుందని మేము దంభాలు పలుకలేదు. మే మేమన్నామంటే—

"యుద్ధానికి వ్యతిరేకంగానూ స్వాతంత్ర్యసాధనకొరకూ జరిగే ఉద్యమం కాంగ్రెసు నాయకత్వం వహించి నడిపినప్పుడే దేశవ్యాపిత మయి, ఫలితాన్ని చేకూర్చగలదు. ఈ విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. అందువల్ల ప్రస్తుతప్రతిష్టంభనను కొనసాగించాలనో, లేక వుద్యమమే వస్తే దానికి హద్దులుపెట్టాలనో చూచే రాజీవాదుల ప్రతి ప్రయత్నాన్నీ తీవ్రంగాఖండించాలి. వారి నిజతత్వాన్ని నిర్దాక్షిణ్యంగా బట్టబయలుచేయాలి. యుద్ధవ్యతిరేకపోరాటానికి మనం 'పిలుపు' నిచ్చినంతమాత్రాన ప్రతిష్టంభన భగ్నం కాదు; ప్రజాసామాన్యంలో ముఖ్యంగా కాంగ్రెసువాదుల్లో యుద్ధ వ్యతిరేక ఆందోళనను అత్యంత తీవ్రస్థాయికి తెచ్చి, దాని ఒత్తిడివల్ల కాంగ్రెసుపోరాటాన్ని ప్రారంభించేలా చేయాలి. ఇదే మన యుద్ధవ్యతిరేక కార్యక్రమం - సమ్మెలు, సారస్వతం, ప్రచారములయొక్క ప్రధానలక్ష్యంగా వుండాలి."

వ్యక్తిసత్యాగ్రహం కావాలని వాదించిన ఫార్వర్డుబ్లాకు, కాంగ్రెసు సోషలిష్టు పార్టీల వారిని ప్రజల్లో విశ్వాసం లేని నిరాశావాదులని తీవ్రంగా విమర్శించాం. బ్రిటిషు సామ్రాజ్యవాదంతో సహకారంచేస్తూ యుద్ధంపూర్తి అయేవరకు వూరుకుందాం అనే యం. యన్. రాయ్ పై ఖరిని ఖండించాం.

సామ్రాజ్యవాద యుద్ధదశలో మా విధానాన్ని స్పష్టపరుస్తూ మాపార్టీ పొలిట్‌బ్యూరోచేసిన ప్రధానతీర్మానం భాగాలే పైన వుదహరించినవన్నీ. ఈ తీర్మానం 1939 అక్టోబరులోనే జరిగింది.

యుద్ధవ్యతిరేకసమ్మెలను సాగించాం. 1940 లో బొంబాయిలో 1,50,000 మంది కార్మికులు 40 రోజులపాటు సమ్మెచేశారు. జమీందారీ దోపిడీని ఎదుర్కొంటూ రైతు పోరాటాలను నడిపాం. ఈపోరాటాన్ని నడిపినందుకె మా కయ్యూరుకామ్రేడ్సు నలుగురు తరువాత ఉరితీయబడ్డారు.

వీటిని పరిశీలిస్తే మా విధానం మొదటినుంచీ ఒక్కతీరుగానే వుందన్న విషయం ఎవరికయినా స్పష్టంకాగలదు. అంతేకాదు, మాదృక్ప థమే ఎక్కువ వాస్తవికమైనదిగా ఆతరువాత జరిగిన ఘటనలే నిరూపించాయని మా అభిప్రాయం.

మీరు దేశవ్యాపితపోరాటాన్ని ప్రారంభించి నడపడం అతిత్వరలో స్వాతంత్ర్యాన్ని సాధించగల మార్గమనీ; అంతేకాకుండా బ్రిటనులో సామ్రాజ్యవాదుల పెత్తనాన్ని కూలదోయడానికి భారతదేశం చేయగల సహాయంకూడా అదేననీ మేం భావించాం.

అదేసమయంలో బ్రిటనులో ఛేంబర్లేను ప్రభుత్వాన్ని ప్రతిఘటించి బ్రిటిషు లేబరుపార్టీ స్వతంత్ర విధానాన్ని నిర్ణయించుకొనేలా చేయటానికి బ్రిటిష్‌కమ్యూనిస్టులు తీవ్రకృషి సాగించారు. యుద్ధాన్ని ఇంకా విస్తరించకుండా చేసి, సోవియట్‌తో సంధికుదుర్చుకొని, హిట్లరు దురాక్రమణను అరికట్టి, ప్రజాశ్రేయస్కరమైన శాంతిని నెలకొల్పగల ప్రజా ప్రభుత్వాన్ని బ్రిటనులో స్థాపించాలని అక్కడ మాసోదరపార్టీ ఆందోళన సాగించింది.

మా కార్యాచరణ

మా విధానాన్ని మేం ఆచరణలో పెట్టాం.

1. దేశంలో ఎన్నిప్రాంతాల్లో వీలుంటే అన్ని ప్రాంతాల్లో యుద్ధ వ్యతిరేక ప్రచారంసాగించాం. యూరపులో ఒకదేశం తరువాత ఒకదేశంగా హిట్లరు ఎలా ఆక్రమించు కొన్నాడో, ఆదేశాల అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలు ఎలా కూలిపోయాయో ప్రజలకు వివరించాం. సోవియట్ యూనియన్ని ఏకాకినిచేసి దెబ్బతీయాలనే, మనకు స్వాతంత్ర్యం లంభించకుండా చేయాలనే, బ్రిటిషువిధానమే యావత్తు ప్రపంచాన్ని హిట్లరుకి ఎలా బలి చేస్తూందో విశదపరిచాం.

2. "ఒక్కదమ్మిడీ అయినా యివ్వకూడదనీ—ఒక మనిషినైనా పంపకూడ" దనే నినాదంతో గ్రామప్రజల్లో తీవ్ర ప్రచారం సాగించాం.

3. పారిశ్రామిక ప్రాంతాల్లో భారతదేశం అదివరకు కనివిని ఎరుగని సమ్మెవెల్లువను లేవదీశాం. రాజకీయ సమస్యలపైనకూడా సమ్మెలు జరిగాయి.

4. మా నాయకుల్లో చాలమంది అరెస్టయిపోయారు, అయినా మా దీక్షను విడువలేదు. నాయకులు లేకపోయినా మా సంస్థను చెదరిపోకుండా వుంచాం. దానిబలంతో, పట్టి చిహ్నప్రాయంగా కాకుండా, అత్యంతముమ్మరంగా మా కార్యక్రమాన్ని కొనసాగించాం. తద్వారా, జాతీయోద్యమంలో అదివరకు ఎరుగని ఒక నూతనఅంశాన్ని ప్రదర్శించాం. మాపార్టీ ఒక కొత్తరకంపార్టీ అని నిరూపించాం. సామ్రాజ్యవాద విధానం దీనిని అణచలేదని రుజువుచేశాం. రహస్యపార్టీ నిర్మాణంతో బహిరంగంగా ప్రజాపోరాటాలు సాగిస్తూ ప్రజలతో సన్నిహిత సంబంధం పెట్టుకునిఉండే పార్టీ మాదని ప్రదర్శించాం.

సూత్రప్రాయంగా చూస్తే మాకార్యక్రమం కాంగ్రెసు నాయకవర్గం నిర్ణయించిన పాలసీని మించిపోవడమే అవుతుంది- ఇందుకు మాపై అభియోగం తేవాలనే ఉద్దేశం ఆనాడెవ్వరికీ లేదు.

మా కార్యక్రమాన్ని చాలామంది కాంగ్రెసునాయకులు నిరశిస్తున్నారని మేము తెలుసుకున్నాం. కాని మా ప్రజాపోరాట కార్యక్రమంకన్న, తమ వ్యక్తిగత సత్యాగ్రహమే మెరుగని చెప్పగల ధైర్యం వారికి లేకపోయింది. ఆదశలో ఏది సరియైన పోరాటపద్ధతి అనే విషయంలో మీతో మాకు తీవ్రమైన భేదాభిప్రాయాలు కలిగాయి. దురదృష్టవశాత్తు రెండవ దశలోకూడా అంతే అయింది.

కాంగ్రెసు నిర్ణయించిన పద్ధతులను మించిపోయే మార్గాలను అవలంబించినప్పుడల్లా మేము కాంగ్రెసుపేరుతో కాకుండా మా పార్టీపేరుతోనే వ్యవహరించాం. ఈవిషయంలో ఈనాడు మీ అనుచరులలో కొంతమంది ప్రవర్తనకునూ మాకూగల తేడా స్పష్టమే. కాంగ్రెసు కార్యవర్గాల్లో ఉండిన మాపార్టీ సభ్యులందరూ మీకన్నా ముందుగానే అరెస్టుకావడమయినా జరిగింది. లేదా వ్యక్తిసత్యాగ్రహులుగా జైళ్ళకైనా వెళ్ళారు. లేదా పార్టీ ఆదేశానుసారం; కాంగ్రెసులోని తమ సహచరులతో ఆలోచించి రహస్యజీవితములోకయినా వెళ్ళారు.

జాతీయ పోరాటం ప్రారంభించడం మాపార్టీఒక్కదానివల్ల సాధ్యమవుతుందని మేము కలలుగనలేదు. కాంగ్రెసు నాయకత్వం వహించి పోరాటం నడిపేలా చేయడమే మాలక్ష్యం. దేశంలో అందుకు తగిన

వాతావరణాన్ని మా నాయకత్వంక్రిందనున్న ప్రజల్లో అందుకు తోడ్పడగల పరిస్థితులను నెలకొల్పడానికే కృషి చేశాం. కాంగ్రెసు నాయకవర్గంతో భేదించి పోటీ కాంగ్రెసును నిర్మించడానికి సుభాస్‌బోస్ చేసిన ప్రయత్నాలను ఎదుర్కొన్నాం. పోరాటంపట్ల ప్రజల్లో ఉన్న తహతహను మీపట్ల అతనికి న్యాయంగాఉన్న అసంతృప్తిని, ఇందుకు వినియోగించుకుంటుంటే ఖండించాం. బెంగాలులో బోసును ఎదుర్కోవాలంటే గుండె నిబ్బరం చాలాకావాలి. అతని వాగాడంబరాన్ని బట్టబయలు చేయడానికి మా బెంగాల్ కామ్రేడ్స్ వెనుకంజవేయలేదు. బెంగాల్లో "అధికార" కాంగ్రెసు వర్గంకన్నా కాంగ్రెసుపట్ల మాకే ఎక్కువ అభిమానం వుందని కాంగ్రెసు వాదులే ఒప్పుకున్నారు,

కాంగ్రెసుయొక్క ప్రాధాన్యతను మాపార్టీ చులకన చేస్తుందనీ; నిజానికి మాది కాంగ్రెసు వ్యతిరేకపార్టీ అనేభావాలను మీలో కనబడుతున్నాయి కాబట్టే ఈవిషయాలను మీకు జ్ఞాపకం చేయవలసివచ్చింది.

గొప్పఅవకాశం చేయి జారిపోయింది

మీలాగ మీవిధానాలు ఏకతీరుగా లేకపోయాయి. ఎందువల్ల? ఆదశలో యుద్ధంయొక్క స్వభావాన్ని మాఅంత స్పష్టంగా మీరు గ్రహించలేకపోయారు. బ్రిటనుయొక్క యిబ్బంది మనకు మంచిఅవకాశం అని మీరు మీ అనుచరవర్గమంతా భావించారు. తగినచర్య తీసుకుంటారని మీవంక చూచారు. దీనికి పూర్తిగా వ్యతిరేకమయిన దృక్పథం వర్కింగుకమిటీలో ఎక్కువమంది అవలంబించారు. కాంగ్రెసుకు ప్రజల్లో ఉన్న పలుకుబడినంతా చేతిలోపెట్టుకొని ఎంతకాలం సహకారం చేయకుండా కూర్చుంటే అంతత్వరగా బ్రిటిష్‌పాలకులు తమఅవసరాలను తీర్చుకోవడంకోసం దిగివస్తారని ఈ నాయకులు అంచనావేశారు.

అనుచరవర్గానికి, నాయకులకు ఉన్న ఈ విభిన్న దృక్పథాలకు సామరస్యం కుదర్చడం నెహ్రూపండితుని వంతయినది. ఉద్వేగం తొణికిసలాడే మాటల్లో ఆయన తీర్మానాలు రాశాడు. ప్రపంచ ప్రసిద్ధిపొందాడు. వినడానికి బాగుండవచ్చునుగాని వట్టిమాటలవల్ల జరిగేదేమీ వుండదు.

ఏమీ చేయకుండా చేతులు ముడుచుక్కూర్చోమని మీరు మీ అనుచరుల్ని అజ్ఞాపించారు, అందువల్లనే దేశంలో పెద్ద ఘోరమేమీ జరుగలేదు.

కాని అదేసమయంలో హిట్లరు యూరప్ ఖండాన్నే మార్చివేస్తున్నాడు. బ్రిటన్‌పైని, దాని మిత్రదేశాలపైని పరాజయ పరంపరలను కురిపిస్తున్నాడు. ఆలోచనా శూన్యులుగానూ, కార్యశూన్యులుగానూ చేయబడిన మన ప్రజలు బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై దెబ్బతీస్తున్న హిట్లరు విజయాలను చూచి పొంగిపోసాగారు. స్వాతంత్ర్యపిపాస వికృతరూపాలు ధరించింది. వీరోచితంగాకాక బానిసలకు తగిన రూపాల్లోను, ప్రజాస్వామిక స్వరూపంలో కాక ఫాసిస్టు అనుకూలరూపాల్లోను వెల్లడికాసాగింది.

ఈ దశలో వీరవలంబించిన విధానంయొక్క ఫలితం ఏమంటే - స్వాతంత్ర్యాన్ని సాధించి ప్రపంచ శాంతిని చేకూర్చగల మహదవకాశాన్ని ఇండియా పోగొట్టుకుంది. అంతా శూన్యంచేసి మీరు కల్పించిన అయోమయావస్థలో ఫాసిస్టు అనుకూల. బానిస, భావాలు మొలకెత్తి పెరుగసాగాయి. ఈ పాలసీ నిజంచెప్పాలంటే ఏలాంటి పాలసీ లేకపోవడం వల్లనే దేశానికా దుర్గతి దాపురించింది.

III

రెండవదశ : ప్రజాయుద్ధం

1941 లో రెండు చరిత్రాత్మక ఘటనలు జరిగాయి. జూన్‌లో హిట్లరు సోవియటుపై విరుచుకుపడ్డాడు; డిసెంబరులో జపాను యుద్ధం ప్రారంభించింది.

సోవియటుపై విరుచుకపడటంతో హిట్లరు తనగొయ్యిని తానే తవ్వుకున్నాడు. దానితో అదివరకు మిత్రమండలిలో పెద్ద మార్పులు జరిగాయి. సోవియటును ఒంటరిదానిని చెయ్యాలనే తత్వం మాయమైంది. సోవియట్ బ్రిటన్, సోవియట్ అమెరికా ఒడంబడికలు జరిగాయి.

జపాను విజృంభించటంతో తూర్పుదేశా లన్నిటిలోను సామ్రాజ్యవాద పెత్తనం అంతరించి దాని స్థానంలో ఫాసిస్టు బానిసత్వం దాపురించే ప్రమాదం సంభవించింది.

ఈ రెండు ఘటనలూ కలసి భారతదేశానికి తూర్పు పడమరల నుండి దురాక్రమణ ప్రమాదం తెచ్చిపెట్టాయి. యుద్ధం మన గుమ్మం

దగ్గరకే వచ్చేసింది. మన మిత్రులైన యూరప్ ప్రజలను, చైనా ప్రజలను కబళించడమేకాదు ఫాసిస్టు సామ్రాజ్యవాదులు తలపెట్టినది.

మనల్నికూడా మింగాలని ఎన్నాళ్ళనుంచో అణుచుకొన్న కోరికను నెరవేర్చుకోడాని కిప్పుడు ఎగబడ్డారు. "హిట్లరు ఆత్మకథ" లోను జపాను 'టనకా ప్రణాళిక' లోను మనదేశాన్ని వశపర్చుకోడానికి వేసిన ప్లానులు వెర్రివాని వూహలు ఎంతమాత్రం కావు. ప్రపంచ ప్రజలరక్తంతో తడిసిన తమ చేతులను మనదేశంలో కలపటానికి ప్రపంచ ఫాసిస్టుశక్తులు అచ్చంగా వ్యూహం వేసుకున్నాయి. ఈ వ్యూహంతో తూర్పు పడమరల నుండి దండెత్తుక రాసాగారు.

ఈ రెండు ఘటనలతో యుద్ధ స్వభావంలో పెద్దమార్పు వచ్చిందనుట స్పష్టమయింది. యుద్ధఫలితం ఏమవుతుందో అనే ఆందోళనను పెంచింది. అది మిమ్మల్ని ఆలోచింప జేసింది.

ఈ పరిస్థితుల్లో యుద్ధంపట్ల తమ వైఖరి ఏమిటో అని ప్రతివారి చేత ఆలోచింప జేసింది.

బ్రిటన్‌లోని అభివృద్ధికర వర్గాలు ముఖ్యంగా లేబరుపార్టీ సభ్యులు రెండు ప్రధానమైన కోరికలను ప్రకటించారు — సోవియట్‌తో మైత్రి కుదుర్చుకోవడం ఒకటి. రెండవది భారతదేశంలో పరిష్కారం కుదుర్చుకోవడం. మిమ్మల్ని తక్షణం విడుదల చెయ్యాలని, కొత్త పరిస్థితులనుబట్టి తిరిగి ఆలోచించు పాలసీలను నిర్ణయించుకోవాలని, జాతీయ పత్రికలన్నీ ఆందోళన చేశాయి. 1941 డిశెంబరులో మీరు విడుదలయారు. 1942 మార్చిలో క్రిప్సు వచ్చాడు.

యుద్ధంలోని రెండు పక్షాలు

యుద్ధంలో పాల్గొంటున్న పక్షాలలో మార్పులు జరిగాయని గుర్తిస్తూ మీరు ప్రకటనలు చేశారు. భారత దేశాన్నెదుర్కొన్న పరిస్థితులుగూడా మారాయనీ, అవి "ప్రమాదకరా" లనీ ఆ ప్రకటనల్లో అంగీకరించారు.

జైలునుంచి బయటికి రాగానే నెహ్రూ పండితుడు 1941 డిసెంబరు 8 వ తేదీ లక్నో పత్రికా ప్రతినిధుల సమావేశం జరిపి ఇలాఅన్నారు

"ప్రపంచాధిపత్యం కోసం జరుగుతూన్న యీ పెనుగులాటలో, రెండుపక్షాల్లోను ఆ యాదేశాల ప్రభుత్వాలు ప్రపంచంపై పెత్తనంకోసం గుటకలు వేస్తున్నట్లు కనబడుతూంది. హిట్లరు విషయంలో ఇది నిస్సందేహం. తమ కలాంటి ఉద్దేశాలేవీలేవని రెండవ పక్షంవారు అంటున్నారు....ఏది ఎలాగున్నా ఈనాడు రష్యా, చైనా, అమెరికా, ఇంగ్లండులున్న పక్షంలోనే ప్రపంచంలోని అభివృద్ధికర శక్తులన్నీ కూడా చేరి ఉన్నాయనడానికి సందేహం లేదనుకుంటాను."

1941 డిసెంబరు 30 వ తేదీన బార్డోలీలో జరిగిన వర్కింగు కమిటీ సమావేశం ఈ దిగువ ప్రకటన చేసింది.

> "ఇండియాపట్ల బ్రిటను వైఖరి మారలేదు. అయినప్పటికీ ప్రపంచంలో నూతన పరిస్థితులు ఏర్పడ్డాయి. యుద్ధం ప్రపంచ యుద్ధంగా మారింది. మనదేశపు పొలిమేరలదగ్గరకే వచ్చింది. వర్కింగుకమిటీ వీటిని గుర్తించవలసివుంది. దురాక్రమణకు గురిఅయి తమ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోడానికి పోరాడుతూన్న ప్రజలకే కాంగ్రెసు తన సానుభూతిని అందజేస్తుంది."

వివేకముండి బాధ్యతనెరిగిన ప్రతివారూ పరిస్థితులలోని మార్పును గుర్తించారు. కాని ఆందరిదీ ఒకదారి అయితే కాంగ్రెసు సోషలిస్టులది, ఫార్వర్డుబ్లాకువారిది వేరొక దారయింది.

యుద్ధంపట్ల కాంగ్రెసు సోషలిస్టుల వైఖరిని విశదపరుస్తూ ఆపార్టీ ప్రధానకార్యదర్శి పురుషోత్తమదాసు. త్రికందాసు 1941 డిసెంబరు 6 వ తేదీని ఒకప్రకటన చేశారు. అందులో ఇలా అన్నారు.

"భారతదేశానికీ, ఇతర వలసదేశాలకు స్వాతంత్ర్యం యివ్వనంత కాలం ఈ యుద్ధం సామ్రాజ్యవాద యుద్ధంగానే వుంటుంది. దానితో మనమేలాంటిసంబంధం పెట్టుకొనలేము" (1941 డిసెంబరు 12 'హిందూ'

బీహారురాష్ట్ర ఫార్వర్డుబ్లాకు మహాసభకు సందేశంపంపుతూ, ఫార్వర్డుబ్లాకు నాయకుడైన శరత్‌బోసు ఇలా అన్నాడు.

"పరస్పర విభిన్నతత్వాలు సందర్భవశాత్తు ఒకకూటమిగా ఏర్పడడం గత కొద్ది మాసాలనుంచి చూస్తున్నాం దీని ఫలితాన్ని 'అట్లాంటిక్ ప్రణాళిక' అన్నారు—ఫార్వర్డుబ్లాకు ఈ కూటమితోగాని, దీనిలోని ఏ ఒక్క

భాగంతోగాని ఏలాంటి సహకారం చేయజాలదు" (హిందూస్తాన్ స్టాండర్డు—1941 నవంబరు 1.)

మేముగాని దేశంలోని మరెవ్వరుగాని వీరిమాటలను లెక్కచేయలేదు. ఎందువల్లనంటే, యుద్ధంయొక్క మొదటిదశలో 'అతివాద' భావాలంటూ ఏమేమో అనడమేగాని వీరుచేసిందేమీ లేదు. ఇకవీరి "విప్లవకరచర్య"లను గురించి వేరే చెప్పనక్కరలేదు. వట్టివాగాడంబరము, బెదరింపులు తప్ప వీరికి చేతనయింది మరేమీ లేదని అందరూ గుర్తించారు.

మా ఆశయాలను, భారతస్వాతంత్ర్యోద్యమాన్ని మే మెంతో ప్రధానంగా గణిస్తాము. వాస్తవికదృష్టితో పరిస్థితులను అర్థంచేసుకోవడం ద్వారానే ముందుకు సాగిపోడానికి కృషిచేస్తాం. ప్రపంచములో ఏర్పడిన నూతనపరిస్థితులను చర్చించడానికి మాకు కొంతకాలం పట్టింది. మా నాయకుల్లో ఎక్కువమంది జైళ్లల్లో వున్నారు; రహస్యంగా బయటవున్న కొద్దిమంది కూడా తలొకవైపు చెదిరి ఉన్నారు. ప్రభుత్వం వెన్నంటి తరుముతూన్న ఒకరహస్యసంస్థపడేపాట్లేవీ మాకు తప్పలేదు. మా చర్చల ఫలితాన్ని మా అందరి సమిష్టిభావాలను మా పొలిట్‌బ్యూరో తీర్మానంలోను, జోషీ వ్రాసిన "ఫాసిజాన్ని ప్రతిఘటించి స్వాతంత్ర్యానికి ముందుకు సాగుదాం" మనే పుస్తకములోను విశదపరిచాం. అప్పుడు ఆరెంటిని రహస్యంగా ప్రచురించాము. యుద్ధాన్నిగురించీ, మా విధానాన్ని గురించి ఈ నాడు మేము చెబుతున్న విషయాలు కొత్తవికావనీ, మీతో వాగ్వాదం పెట్టుకొని గెలవాడానికంటున్న మాటలు కావనీ, అతిరహస్యజీవితాన్ని గడుపుతున్నప్పుడే వెల్లడిచేసిన విషయాలనీ, మీకు నచ్చజెప్పడానికి ఆ రెండింటినుంచీ ఉదాహరణలు ఎత్తిచూపుతాము. మీరు మాపట్ల ఎంత అన్యాయంచేస్తున్నారో వీటినిబట్టి ఋజువు కాగలదని ఆసిస్తున్నాం.

యుద్ధదశలో కమ్యూనిస్టుల విధానం

ఒకవైపు సోవియట్, మరోవైపు జపాను ప్రవేశించడంవల్ల యుద్ధంలో కలిగిన మార్పును అర్థంచేసుకొని, దీనితో ఒకనూతన దశ ప్రారంభమయిందనీ: ఈ దశలో నూతనవిధానము, నూతన కార్యక్రమము స్వాతంత్ర్యసాధనకు నూతనపద్ధతులు అవసరమనీ నిర్ణయించుకున్నాం. మేమిలా అన్నాం;—

"మన పార్టీ కార్యదీక్షతగల పార్టీ. ఒక నూతనదశలో నూతన పోరాటపద్ధతిని నిర్ణయించడమే కాదు మనకర్తవ్యం. ఆదశకు అప్పటి జాతీయపోరాట స్వరూపానికి అనుగుణ్యమైన నినాదాలను సూచించడం కూడా మనవి. "భారతప్రజలు ఈప్రజాయుద్ధములో ప్రజాస్వామిక పాత్రను నిర్వహించేలా చేయాలి. అనే నినాదమే ఇక మనరాజకీయ కార్యక్రమాని కంతకూ మూలసూత్రంగా వుంటుంది." (పొలట్‌బీరో తీర్మానం–1941 డిసెంబరు 15)

మా అంచనాలు సరియైనవని, మీవి తప్పనీ ఆపైని జరిగిన ఘటన లెలా రుజువు చేశాయో చూదాం.

"జూన్ 22 వ తేదీన హిట్లరు ఫాసిజం తన గొయ్యిని తానే తవ్వుకొంది. ఇదివరకు కనివిని ఎరుగనట్లుగా ప్రపంచ సామ్రాజ్య వాదానికికూడా అదే మృత్యుద్వారమవుతుంది. దురాక్రమణచేస్తున్న నాజీహంతకులపై రెడ్‌అర్మీ కాల్చిన మొదటి తుపాకీగుండ్లు నూతన శకానికి, ప్రపంచ ప్రజా పోరాటశకానికి నాంది ప్రస్తావన అవుతున్నాయి. జూన్ 22 వ తేదీన జరిగిన మార్పు అర్థంయిదే." ఫాసిజాన్ని ప్రతిఘ టించి స్వాతంత్ర్యానికి ముందుకు సాగుదాం. (6 వ పేజీ)

మిత్రమండలి తప్పకుండా జయిస్తుందని మీలో చాలామంది నమ్మలేదు.

ఇక నూతనదశయొక్క రెండవ లక్షణం యేమంటే - మరో రాజ్యం యుద్ధరంగంలో ప్రవేశించింది; అది ఒక కొత్తరకపు రాజ్యం, ప్రజారాజ్యం, సోవియట్ యూనియన్ !

కాని మీరు ఊహిస్తున్నట్లు "సోవియట్ యూనియన్‌కోసం" మేము మా వైఖరిని మార్చుకోలేదు. సోవియట్ ప్రవేశంవల్ల విశ్వ మానవ జాతికి కలుగగల సత్ఫలితాలను ముందుగానే గ్రహించగలిగాము కాబట్టే మా వైఖరిని మార్చుకున్నాం.

వీటిలో మొదటి ఫలితం — సోవియట్ బలంతో నాజీ హిట్లరును విధ్వంసం చేయడం.

రెండవది—మిత్రమండలిలోవున్న అభివృద్ధినిరోధకుల సామ్రాజ్య తృష్ణను ప్రతిఘటించి పోరాడుతూన్న ప్రపంచ ప్రజలకిప్పుడు సోవియట్

వంటి పెద్దరాజ్యం అండగా దొరికింది. ప్రపంచ ప్రజలందరికీ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాలు లభించే అవకాశం కలిగింది. ప్రపంచ ప్రజలకు విముక్తిచేకూర్చడం; ప్రపంచాధిపత్యంకోసం హిట్లరు కంటున్న కల లను, వెనుకటి పరిస్థితులనే తిరిగి నెలకొల్పడానికి బ్రిటన్, అమెరికా సామ్రాజ్యవాదులు వేస్తున్న పన్నాగాలను భగ్నంచేయడం, ప్రజారాజ్య మయిన సోవియట్‌కి అత్యవసరం. మిత్రరాజ్యాల ప్రజలు తమవంతు నెరవేర్చినట్లయితే సోవియట్ ఈ కర్తవ్యాలను జయప్రదంగా కొనసా గించగలదని మాకు తెలుసు....

సోవియట్ శక్తిసామర్థ్యాలపట్ల మాకు పూర్తి విశ్వాసం ఉంది, స్వలాభాపేక్ష దానికి యేమాత్రంలేదని మాకు తెలుసు.

సోవియట్ ఏమయిపోతుందో అని నెహ్రూ పండితుడు ముచ్చ టయిన మాటల్లో సంతాపాన్ని వెలిబుచ్చారు. ఎర్రసేన సైబీరియాలోకి పారిపోతూందని కొందరూ, సోవియట్ తీవ్రంగా ప్రతిఘటిస్తూందని వస్తున్న వార్తలన్నీ బ్రిటిష్‌వారు చేస్తున్న బూటకపు ప్రచారమే అని మరికొందరూ, వర్కింగుకమిటీసభ్యులు కాంగ్రెసువర్కర్ల సమావేశాల్లో చెప్పారు. ఈ సమావేశాల్లో మేముకూడా పాల్గొన్నాం.

సోవియట్‌శక్తిపై మీలో ఒక్కరికికూడా విశ్వాసంలేకపోయింది. ఇందుకు కారణం సోవియట్ ఒక కొత్తరకపు ప్రజారాజ్యమని మీలో ఎవ్వరూ నిజంగా గుర్తించకపోవడమే. సోవియట్–బ్రిటను ఒడం బడిక యొక్క ప్రాధాన్యతను మీలో ఒక్కరుగూడా గుర్తించలేదు. తన దేశం ప్రమాదంలో చిక్కుకొందికాబట్టి స్టాలిన్–చర్చిలుకి ఆరూపంగా లొంగిపోయినట్లుగా మీలో చాలామంది దాన్ని అర్థం చేసుకొన్నారు. స్టాలిన్ ఈనాడు అలంకరిస్తున్న స్థానమేమిటి? చర్చిల్ ఎక్కడున్నాడు? ఈపరిస్థితి హటాత్తుగా సంభవించినదికాదు. సోవియట్ భూమిలో నెల కొనిన సామ్యవాదంలోనే ఈపరిణామంయొక్క అంకుర మేర్పడినది. ఈ అంకురాన్ని మీరు స్పష్టంగా గుర్తించి వుండవలసింది. ఎందువల్ల నంటే—ఏపవిత్ర స్వాతంత్ర్య వృక్షంయొక్క నీడను మీరు నిల్చున్నారో ఆవృక్షంయొక్క అంకురమే అది.

ప్రజాయూరప్ జననం

సోవియట్ యుద్ధరంగంలో ప్రవేశించడంతో ఫాసిస్టు ప్రతికూల పక్షంయొక్క బలం ఎంతో పెరిగింది.

అమెరికా బ్రిటను సామ్రాజ్యవాదుల పన్నాగాలకు సమ్మెటపెట్టు తగిలింది. మాదృష్టిలో దానిప్రాధాన్యత ఇంతేకాదు; ఆ ప్రవేశంతో ప్రపంచ ప్రజాసంఘటన, నిర్మాణం ప్రారంభమయింది. యుద్ధం మొదటి దశలో యూరప్‌లోని అభివృద్ధినిరోధక ప్రభుత్వ వర్గాలు లండన్‌కో, కైరోకో పారిపోవడం, లేదా హిట్లరుకు దాసోహం అనడం జరిగింది ఈ కొత్తదశలో ఆక్రమిత యూరప్ ప్రజలు ఫాసిష్టు హంతకులపై తిరుగుబాటు లేవదీయడం ఖాయమని మేము ముందుగానే గ్రహించాం. ఈ తిరుగుబాటులో సోవియట్ పోరాటం వీరిను తేజపరుస్తుందనీ; అంతే కాకుండా వీరికి సోవియట్‌సహకారంకూడా లభిస్తుందనీ మేముచెప్పాం.

ప్రపంచ ప్రజాశక్తులలో ఏర్పడిన నూతన సంఘటనను విశద పర్చినప్పుడూ, అన్నిదేశాల ప్రజలకు కొత్తగాకలిగిన మహదవకాశాలను వివరించినప్పుడూ, వివిధదేశాల్లో నెలకొంటున్న నూతన ప్రజాఐక్యతను ప్రపంచ ప్రజాపక్షం రూపొందడాన్ని చిత్రించినప్పుడూ, మీలో చాలా మంది ఏమనుకున్నారు? ఇక బ్రిటిష్‌ప్రభుత్వంతో పోరాడడం యిష్టంలేక మేము పెద్దపెద్దకబుర్లాడుతున్నామని లెక్కగట్టారు. ఒకవైపు సోవియట్ పట్ల మీరేదో దయారసం కురిపిస్తున్నట్లు కనుపించారు; కాని అది నిర్వహిస్తున్న పాత్రను హర్షించడం ఏకోశానా కనబడలేదు. మరోవైపు యూరపు ప్రజలవిషయంలో వారికిక ఫాసిష్టు బానిసత్వమో, లేక అమెరికా బ్రిటనుల పెత్తనమో తప్ప వేరేగతిలేదన్నట్లు ప్రవర్తించారు. ఒక్కసారి వెనక్కుతిరిగి, అప్పుడు మీరనుకున్నవాటికి, మేమన్నదానికి తేడా గ్రహించవలసిందని మిమ్మల్ని కోరుతున్నాం.

"నాజీ ఆక్రమిత దేశాలయొక్క పూర్వప్రభుత్వాల రూపంలో చాల వరకు మార్పురాలేదన్నమాట నిజమే. కాని అవి సోవియటుతో మైత్రిచేసుకోవడంవల్ల, ఆదేశాలలో బలోపేతమయిన జాతీయైక్యత నెలకొనడం వల్ల ఈప్రభుత్వాలుగాని, లేక వీటిస్థానంలో ఆదేశాలకి ప్రాతినిధ్యం వహించగల కొత్త ప్రభుత్వాలుగాని, తిరిగి అమెరికా, బ్రిటన్ సామ్రాజ్య

వాదుల చేతుల్లో కీలుబొమ్మలు కాజాలవు. ప్రజాశాంతికోసం అవి పోరాడ గలవు" (ప్రపంచ ప్రజాయుద్ధమే భారత స్వాతంత్ర్య యుద్ధం-31వ పేజి)

ఈసూత్రానికి వ్యతిరేకంగా పోదలచిన లండన్‌లోని పోలిష్‌ప్రభుత్వం యుగోస్లేవియా రాజు పీటర్ మిహైలోవిచ్, ఇటలీలోని బడోగ్లియా, ఫ్రాన్సుడార్లనూ అంతరించిపోవలసి వచ్చింది. బ్రిటన్ అమెరికా సామ్రాజ్యవాదులు వారిని కాపాడలేకపోయారు.

ప్రపంచ ప్రజాస్వామికా లెలాసంఘటితమవుతున్నాయో మేము సరిగా అంచనా వేశాము. 1945లో రూపొందుతున్న ఉజ్వల యూరప్ ఖండమే అందుకు నిదర్శనం. భారతజాతీయ నాయకులలో అగ్రగణ్యులుగా వుంటూకూడా మీరు, మన ప్రజాస్వాతంత్ర్య శక్తులను సరిగా అంచనా వేసి వాటిని సక్రమముగా వినియోగించలేకపోయారు. ఇతరదేశాలలోని ప్రజాశక్తులపైగూడా మీకు విశ్వాసం లేకపోయింది. 1945 లో దీనావస్థలో కుములుతూవున్న భారతదేశమే యిందుకు నిదర్శనం.

> అక్కడ దృశ్యానికి ఇక్కడ దృశ్యానికి ఎంత విషాదకరమైన వ్యత్యాసం! తమతమ దేశాల్లో తిరిగి అడుగుపెట్టడానికిగూడా నూతన ప్రజాప్రభుత్వాల దయాభిక్షకోసం ఎదురుచూడవలసిన గతి నిరంకుశ చక్రవర్తులకు పట్టడం—అక్కడ. నాయకులైన మీరు బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రతినిధి అయిన వైస్రాయిని 'మీనాయకునిగ' సిమ్లా సమావేశంలో తలదాల్చడం—ఇక్కడ.

ఇంతకుముందు చెప్పినట్లు, నూతన పరిస్థితుల్లో భారతజాతి నెదుర్కొన్న తీవ్రప్రమాదాన్ని గుర్తించడంలో మీతో మేమేకీభవించాం. కాని మీకూ, మాకూ భేదం ఎక్కడ వచ్చిందంటే—నూతనదశలో మన దేశానికి ఇదివరకెన్నడూ లేని మహావదకాశం లభించిందని మేము గుర్తించాం. కాని మీరు గుర్తించలేదు.

1941 లోనే దీనిని గురించి మేమిలా ప్రకటించాం:

"భారతదేశ చరిత్రలో ఇది మహా విషమఘట్టం."

"ప్రపంచ స్వాతంత్ర్య సంగ్రామంలో మన జాతీయ స్వాతంత్ర్య పోరాటాన్ని సాగించే మహావదవకాశం కూడా నేడుంది." (ప్రపంచప్రజా యుద్ధమే భారతస్వాతంత్ర్య యుద్ధం—71 వ పేజీ)

మేము స్పష్టంగా యిలా చెప్పాం:

"భారతదేశ రక్షణపోరాట నిర్వహణను భారతప్రజల చేతిలోకే తీసుకోవాలి—ఈనాడు స్వాతంత్ర్య సాధనకిదే మార్గం....ఈ యుద్ధంలో విజయంకోసం కృషిచేయడం మనదేశాన్ని కాపాడుకొని, స్వాతంత్ర్యాన్ని సాధించడంకోసం కృషిచేయడమన్న మాట." ('ఫార్వర్డు టుఫ్రీడం'—ఇంగ్లీషు పత్రిక—62 వ పేజీ)

మహాబల సంపన్నులైన సోవియట్ యూనియనూ, చైనా, బ్రిటన్ అమెరికా ఇతర మిత్రరాజ్యాల ప్రజలు మనకు మిత్రులుగా వున్నారని తెలియజేశాం.

"ఈనాడు ప్రపంచ ప్రజలు మున్నెన్నడూ లేనంత బలసంపన్నులై ఉన్నారు. వీరితో చేతులు కలపడంవల్ల భారతప్రజలకుకూడా మునుపెన్నడూ లేని శక్తి చేకూరగలదు. నేడు ప్రపంచ ప్రజావిజయం ఎంతో సమీపంలో వున్నది." ('ఫార్వర్డు టు ఫ్రీడం'—ఇంగ్లీషుప్రతి—45వ పేజీ)

బ్రిటిషు సామ్రాజ్యవాదం చాల విషమ పరిస్థితిలో ఉందని మేము నొక్కిచెప్పాం. ఎందువల్లనంటే —

"అది భారతప్రజలందరినుండి దూరమైపోయింది. దాని అభివృద్ధినిరోధక తాబేదార్లు కూడా దూరమైపోతున్నారు. మితవాద వర్గాలకుకూడా దానిమీద ఉన్న భ్రమలు తొలగిపోతున్నాయి. ఈనాడున్న పరిస్థితులలో బ్రిటిష్ సామ్రాజ్యవాదం మునుపెన్నడూ లేనంతగా ఏకాకి అయిపోయింది." ('ఫార్వర్డు టు ఫ్రీడం' - ఇంగ్లీషుప్రతి - 52 వ పేజీ)

నూతనదశలో మా కర్తవ్యాలను నిర్ణయించుకోడానికి మా యీ పరిశీలనే తోడ్పడింది.

"మన రాజకీయ పార్టీలన్నిటినీ, దేశభక్తుల నందరినీ నే డెదుర్కొంటున్న ప్రధాన కర్తవ్యం ఒక్కటే — మన జాతియొక్క స్థితిగతులను సామ్రాజ్యవాదుల చేతుల్లోనుండి ఎలా మన చేతుల్లోనికి తీసుకోవడం; నేడు సంభవించిన ఘోరవిపత్తునుండి దేశాన్నెలా కాపాడడం; స్వాతంత్ర్యాన్నెలా సాధించడం? ప్రజలందరూ పొందుతూన్న ఆందోళనను కమ్యూనిస్టుపార్టీకూడా పంచుకుంటుంది; జాతీయశక్తులన్నిటితో పాటు కర్తవ్య నిర్వహణకు పూనుకుంటుంది. ఐక్యసంఘటనతో

సామ్రాజ్యవాద నిరంకుశత్వాన్ని ఎదుర్కోవడం ఒక్కటే భారత ప్రజలకు విముక్తిమార్గం అని కమ్యూనిస్టుల మంటున్నామంటే దాని అర్థం ఇదే." ('ఫార్వర్డు టు ఫ్రీడం')—ఇంగ్లీషు ప్రతి 53 వ పేజీ)

నిరాడంబరమైన మూడు నినాదాల్లో మన ప్రజల కర్తవ్యాలను క్రోడీకరించాం :

ప్రతిష్టంభనను భగ్నంచేయండి
జాతీయైక్యతను స్థాపించండి
దేశరక్షణకోసం ప్రజల్ని సమీకరించండి

మేముచేసింది ఒప్పో తప్పో ఎవరిబుద్ధినిబట్టి వారు నిర్ణయించుకోవచ్చు. కాని నూతనదశలో మేము మాతృదేశ స్వాతంత్ర్యాన్ని దృష్టిలో పెట్టుకోలేదని యెవ్వరూ అనజాలరు. "సోవియటు యూనియన్ శ్రేయస్సును" దృష్టిలో పెట్టుకొనే మేము మా విధానాన్ని నిర్ణయించామని యెవరయినా అంటే అది వట్టి అజ్ఞానమని, లేక విషప్రచారమని మేమనడం సబబుకాదా చెప్పండి !

"ప్రజాయుద్ధం" దాని భావము

యుద్ధ పరిస్థితుల్లో వచ్చింది పరిణామంలో మార్పుకాదనీ; దాని స్వభావమే పూర్తిగా పరిణామం పొందిందనీ మేము నిర్వచించాం. అంతవరకు 'సామ్రాజ్యవాద యుద్ధం'గా ఉన్నది. అప్పటితో 'ప్రజాయుద్ధ'మయిందన్నాము. ప్రజా వ్యతిరేకశక్తుల నెదుర్కొని ప్రపంచ ప్రజాస్వామిక శక్తులన్నీ సంఘటితం కావడంవల్లా, తత్ఫలితంగా ప్రపంచంలో ప్రజాస్వామిక వ్యవస్థను స్థాపించగల మహదవకాశం లభించడంవల్లా అది ప్రజాయుద్ధ' మయిందన్నాము.

సామ్రాజ్యవాద యుద్ధం ఫలితంగా ప్రజలకు ఫాసిస్టు బానిసత్వం దాపురిస్తుందని కమ్యూనిస్టులం స్పష్టంగా చెప్పాం. అంతే అయింది. ఆ దశలో యూరపు ఖండమంతా ఫాసిస్టుల పాదాక్రాంతమయింది.

ప్రజాయుద్ధ పలితంగా ప్రజలకు విముక్తి చేకూరుతుందన్నాం. జరిగిందికూడా అదే. యూరప్ ప్రజలు తిరిగి స్వేచ్ఛావాయువులను పీలుస్తున్నారు; చైనా ప్రజలకు ఫాసిస్టు ఆక్రమణ తొలగింది. ప్రపంచ

ప్రజాశక్తులు, స్వాతంత్ర్యశక్తులు మునుపెన్నడూలేనంత శక్తివంతంగా ఉన్నాయి. 1941 లో ఆక్రమితదేశాల ప్రజలు తమ స్వాతంత్ర్యంకోసం తిరుగుబాటు ప్రారంభించారు. అది ఫలించింది. 1945 లో ఈనాడు వారు స్వతంత్ర ప్రజారాజ్యాలను స్థాపించుకొని అభ్యుదయమార్గాన సాగిపోతున్నారు.

ప్రజాయుద్ధం ఫలితంగా స్వాతంత్ర్యం తనంతటదే వస్తుందని మేమెన్నడూ అనలేదు. ఆ యా ప్రజలకు చేకూరే స్వాతంత్ర్య పరిమాణం వారు చేసే స్వయంకృషినిబట్టి, ప్రజాపక్షం (ఇదే తరువాత 'సంయుక్తరాజ్యాల'ని పిలువబడుతూంది) బాగా సంఘటితమయి, బలపడడంబట్టీ ఉంటుంది.

ఈ యుద్ధాన్ని ప్రజాయుద్ధమని నిర్వచించడంలో మేము ప్రజల నుండి వారి పాలకులను వేరుచేశాం.

"సామ్రాజ్యవాద ప్రభుత్వాలు తమ సామ్రాజ్యవాద ఉద్దేశాలతోనే సోవియటు యూనియన్‌తోనే మైత్రి కుదుర్చుకున్నాయి; ఫాసిస్టు వ్యతిరేక సంఘటనలో చేరాయి. హిట్లరు పాదాక్రాంతం కావలసిన దుర్గతి నుండి తప్పించుకొని సాధ్యమైనంతవరకు తమ తమ సామ్రాజ్యాలను దక్కించుకోవాలనే వీటి ఉద్దేశం.

"ఈనాడు ప్రపంచ చరిత్ర ఈ సామ్రాజ్యవాద ప్రభుత్వాల చెప్పు చేతల్లో లేదు. చరిత్రే వారిని ముందుకు తోలుతుంది. ఈనాడు చరిత్ర సాగుతున్న మార్గం కొత్తది — ప్రజాయుద్ధ మార్గం. ఈనాడు చరిత్రను నడుపుతున్నది; కొత్తశక్తులు — ప్రజాశక్తులు. ప్రజలే నేడు చరిత్ర కధినాధులౌతున్నారు. ఈ మహత్తర ప్రజాశక్తులే యిక నూతన ప్రపంచాన్ని నిర్మిస్తాయి" ('ఫార్వర్డు టు ఫ్రీడం' ఇంగ్లీషుప్రతి 24 వ పేజీ.)

మేము చూపిన ఈ వ్యత్యాసంయొక్క ప్రాధాన్యతను మీరు గుర్తించలేదు. ఎందువల్లనంటే, మేము సోవియట్ ఏజంట్లమనీ, సోవియటుకు లాభం చేకూర్చడంతప్ప మరో ఆశయం మాకు లేదనేదృష్టితోనే మీరు మమ్మల్ని చూశారు.

ఈ యుద్ధం ప్రజాయుద్ధమని మేము నిర్వచించడానికి ఆధారామేమిటి ? క్రొత్తగా ఏర్పడిన పరిస్థితుల్లో ప్రజాశక్తులదే పైచేయి అవు

తుందని, సామ్రాజ్యవాద శక్తులు పతనమవుతాయని, తన తొత్తులను కాపాడుకోగలశక్తి చర్చిలుకి ఉండదనీ మేము స్పష్టంగా గ్రహించాము. ఇదే మా నిర్వచనానికి ఆధారం. ఇది సరియయనదనీ రుజువయింది. ఫ్రాన్సులో డార్లను, ఇటలీలో బడోగ్లియో, యుగోస్లావియాలో పీటర్, ఏరీ ? వీరంతా యెక్కడున్నారు వీరిప్పుడు ? తూర్పు యూరపులోను, బాల్కన్ దేశాలలోను ప్రజలు అభివృద్ధినిరోధక శక్తులను కూలదోసి, ప్రజారాజ్యాలను స్థాపించుకొనేసరికి సహించలేక ప్రపంచ సామ్రాజ్యవాదులు పెట్టిన పెడబొబ్బను మీరంతా విన్నారుకదా !

ఇలాంటి యుద్ధం మన దేశానికికూడా ప్రజాయుద్ధమని మేమన్నామంటే, అది బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో చేతులు కలపడంకాదు;

"యుద్ధానికి భారత ప్రజల సహకారం సామ్రాజ్యవాద ప్రభుత్వానికి లొంగిపోవడానికి దారితీయదు. ప్రజాస్వామిక హక్కులకోసం, జాతీయ ప్రభుత్వ స్థాపనకోసం, పోరాటానికే దారితీస్తుంది. ఈవిధంగానే యుద్ధానికి సామ్రాజ్యవాదంపెట్టే ఆటంకాలను భారత ప్రజలు తొలగించగలుగుతారు; జాతీయ ప్రయోజనాలను సాధించగలుగుతారు...... పరాయి ప్రభుత్వంతో వాదోపవాదాలు పెట్టుకోవడంద్వారా మనకు సామ్రాజ్యవాదంపై విజయం చేకూరదు. జాతీయైక్య సంఘటనద్వారానే యీ విజయాన్ని సాధించగల్గుతాము." (ఫార్వర్డు టు ఫ్రీడం - ఇంగ్లీషు ప్రతి - 58 వ పేజీ.)

మీరు మా కంటగడుతూన్న అభిప్రాయాలకు పూర్తిగా వ్యతిరేకమయినవాటినే ఆనాడు వెలిబుచ్చామని దీనివల్ల స్పష్టంకాగలదు.

బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రభుత్వంతో మేము చేతులు కలపలేదు సరిగదా, దాని విధానాలను వాస్తవికదృష్టితో పరిశీలించి అది నిర్వహిస్తున్న అభివృద్ధినిరోధక పాత్రను మీలాగానే తూర్పారబట్టాం

మలయా పతనం నేర్పిన పాఠాలను చాటి చెప్పాం.

"వలసదేశాల్లో సామ్రాజ్యవాదుల పరిపాలన యెంత దివాలాకోరుదో బట్టబయలు చేయడానికి మలయా పతనమే చాలు — సామ్రాజ్యవాద నిరంకుశ పరిపాలనాయంత్రం యీవిధంగానే ముక్కచెక్కలవుతుంది. వలసరాజ్య విధానంయొక్క లక్షణమే ఇది. దయాదాక్షిణ్యాలు

లేని నిరంకుశత్వం, ప్రజలతో సంబంధంలేని మిలిటరీవర్గాన్ని నిర్మించడం, పరాయి ప్రభుత్వం కొనసాగించడంయొక్క ఫలితమే యిది."
('ఫార్వర్డు టు ఫ్రీడం' ఇంగ్లీషు ప్రతి - 36 వ పేజీ.)

ఆగస్టు 9 వ తేదీన మిమ్మల్ని అరెస్టుచేయడాన్ని, ఆ తరువాత అవలంబించిన నిర్బంధవిధానాన్ని ఖండిస్తూ యిలా అన్నాం :

"అహంకారంతో సామ్రాజ్యవాదులు పిచ్చెత్తిపోతున్నారు. మన మాతృదేశాన్ని తమ గుప్పెట్లోనే పెట్టుకోవాలనే దురాశను వారు వదులుకోలేకుంటున్నారు. అందువల్ల మన జాతీయ శక్తుల్ని హతమార్చడానికే వారు తెగిస్తున్నారు. భారత దేశాన్ని వారు రక్షించడంలేదు - చిత్రవధ చేస్తున్నారు. మిత్రమండలి యుద్ధకృషికి తోడ్పడడంలేదు - దెబ్బతీస్తున్నారు,

(1942 ఆగస్టు 16 - 'పీపుల్సువార్' సంపాదకీయం.)

యుద్ధ కృషిపట్ల వైఖరి

"ప్రజా యుద్ధ' నినాదాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో కలిసిపోవడంగా మీరు వ్యాఖ్యానించారు. ఇక యుద్ధకృషి విషయంలో భారత ప్రజల్ని మేము తప్పనిసరిగా సామ్రాజ్యవాద రథచక్రాలకు కట్టిపెట్టేస్తామని మీరు నిశ్చయించుకున్నారంటే ఆశ్చర్యంలేదు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చేతుల్లో యుద్ధకృషి యెలావుంటుందో మేమిలా వివరించాము :

"ప్రస్తుతం యుద్ధకృషి అంతా సామ్రాజ్యవాద ప్రభుత్వంచేతుల్లో ఉంది. తత్ఫలితంగా అవి సక్రమంగానూ, జయప్రదంగానూ సాగడంలేదు. ప్రజలను నిర్బంధపెట్టి వీరు కృషిని సాగిస్తున్నారు. వీటికి తల వొగ్గి ఊరుకోవడం వీటిని ప్రజాపరంచేయడానికి కృషిచేయకుండా ఊరుకోవడమంటే మన బానిస సంకెళ్ళను మనమే బలపర్చుకోవడమన్నమాట. విజయసాధనకు మన ప్రజల్ని సమీకరించడానికి బదులు ప్రజాకంటకులైన పోలీసు రివెన్యూ అధికారుల తోకపుచ్చుకొని నడవడమన్నమాట. ప్రజల్ని, మన దేశసంపదలను దోచుకపోవడంద్వారా నిరంకుశాధికారులు యుద్ధకృషిని సాగింపజూస్తున్నారు.... భారతదేశం

యొక్క యుద్ధకృషి జయప్రదంకావాలంటే, ప్రజలందరూ తమంతట తాము ముందుకువచ్చి కొనసాగించినప్పుడే అది జయప్రదమవుతుంది. ఇందుకు పౌరస్వాతంత్ర్యము, ప్రజాస్వామిక హక్కులను నెలకొల్పడం అత్యవసరం. యుద్ధకృషి భారత జాతి సాంప్రదాయాలకు తగివుండాలంటే జాతీయ ప్రభుత్వ నాయకత్వంక్రిందే సాగాలి." ('ఫార్వర్డు టు ఫ్రీడం' ఇంగ్లీషుప్రతి - 58 వ పేజీ.)

యుద్ధ కృషినిగురించి మా వైఖరిని తెలుపనివ్వండి :

"ఈ యుద్ధానికి సహాయముచేయాలని మేమంటున్నాం. దాని అర్థం యిప్పుడున్న పద్ధతుల్లో యుద్ధకృషికి సహాయంచేయమనికాదు, అది దేశద్రోహియైన రాయి వైఖరి. ప్రపంచ యుద్ధ స్వభావంమారింది. కాని మన దేశంలో యుద్ధకృషిగాని, దానిని సాగిస్తున్న ప్రభుత్వంగాని స్వభావంలో ఏమీ మారలేదు.

ప్రస్తుత మనదేశంలో ఒకపరాయి, నిరంకుశ ప్రభుత్వం యుద్ధ కృషిని సాగిస్తూంది. ఆకృషికి ప్రజల్ని సమీకరించడానికిబదు లీ ప్రభుత్వం ప్రజలంటే హడలిపోతూంది....యుద్ధకృషి విషయంలో మేము నిర్మాణాత్మకమైన వైఖరి నవలంబిస్తాము. వీలున్నప్పుడు తోడ్పడుతాము—అవసరమైనప్పుడు ప్రతిఘటిస్తాము. ఈ రెండు పరిస్థితుల్లోను ప్రజాశ్రేయస్సునే దృష్టిలో పెట్టుకొంటాం. ఈవిధంగా ప్రజలు తమ శ్రేయస్సును కాపాడుకోడానికి తామే పూనుకునేలా చేస్తాము." (ఫార్వర్డు టు ఫ్రీడం - 65 వ పేజీ)

యుద్ధకృషినిగురించి మీరుప్రకటించిన వైఖరిని గుర్తుకు తేనివ్వండి.

1942 ఏప్రిల్ 27 నుంచి మే 1 వ తేదీ వరకు అలహాబాదులో వర్కింగు కమిటీ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో జరిగిన చర్చలను (మినిట్సు) ప్రభుత్వం "అల్లరులకు కాంగ్రెసు బాధ్యత" అనే గ్రంథానికి ఒకటవ అనుబంధంగా ప్రకటించింది. దానిలోనుంచే ఈదిగువ ఉదాహరణలను తీస్తున్నాం.

ఆ చర్చలో నెహ్రూ పండితుడు ఇలా అన్నారు.

"బ్రిటిష్‌వారి యుద్ధకృషికి ఆటంకం కలిగించటం శత్రువుకే తోడ్పడుతుంది కాబట్టి, మనమాపని చేయము."

పంతు, పండితుడు ఇలా అన్నారు.

" దేశాన్ని కాపాడుకోడానికి మనం సర్వశక్తులను వినియోగించాలి ఆ సందర్భంలో అనేక చేదుమాత్రలను మింగవలసి ఉంటుంది కూడా. బ్రిటిష్‌వారితో నేను సహకారం చేయలేకుంటున్నానంటే, అది నా ప్రతిష్టకే భంగకరం కాబట్టే "

సహాయ నిరాకరణ జపాను వారిపట్ల - బ్రిటిష్‌వారితో కాదు

క్రిప్సు రాయబారం భగ్నమయిన తరువాత 1942 ఏప్రిల్ 12 న నెహ్రూగారు ఒక పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఇలా అన్నారు.

" బ్రిటిష్ ప్రభుత్వం మనల్నేమిచేస్తుంది, మనం దాన్నేమి చేయాలి అన్నదికాదిప్పుడు ప్రధాన సమస్య, భారతదేశాన్ని నేడెదుర్కొంటున్న ఘోరప్రమాదమూ, దాన్నుండి ఎలా బయటపడడమనేదే నేటి ముఖ్య సమస్య. అందువల్ల, అయిందేదో అయినప్పటికీ; మనదేశంలో బ్రిటిష్‌వారి యుద్ధ కృషికిగాని, మన అమెరికా మిత్రులు చేయబోయే సన్నాహాలకుగాని మేము భంగంకలిగించము. ఇవి మూమ్మాటికి నిశ్చయము. పారిశ్రామిక వుత్పత్తిసంపూర్ణంగా సాగాలనే కోరుతున్నాం. (గాంధీఫాసిస్టు ప్రతికూలుడు (ఇంగ్లీషు) 89 వ పేజీ)

ఈ వైఖరికీ మా వైఖరికీగల తారతమ్యాన్ని మీరు గుర్తిస్తారనే ఆశిస్తున్నాం. దీనితో పోల్చిచూస్తే మాది ఆక్షేపనీయమని అనలేరనుకుంటాము.

ఏ పరిస్థితుల్లోనూ యుద్ధకృషికి తోడ్పడకూడదని ఏ తీర్మానంలో, ఏ అధికారపత్రంలో అన్నారో కొంచెం ఉదహరించ వలసిందని ప్రార్థిస్తున్నాం.

అలా ఎందులోనూ అనలేదు సరిగదా, క్రియారూపకంగా బ్రిటిష్‌వారికి తోడ్పడకూడదని గాంధీజీ అలహాబాదు వర్కింగుకమిటీ సమావేశంలో (1942 ఏప్రిల్—మే) చేసిన సూచనలను వర్కింగు కమిటీ ఏకగ్రీవంగా నిరాకరించింది.

' అల్లరులకు కాంగ్రెసుబాధ్యత ' అనే ప్రభుత్వ ప్రచురణలోనుంచి మళ్ళీ ఉదహరిస్తున్నాం :

గాంధీజీ తన చిత్తు తీర్మానాన్ని మీరాబాయి ద్వారా మీకు పంపించారు. అందులోనిదే ఈ దిగువ భాగం. దీనిలో గమనించ వలసిన మాటలను గుర్తు పెట్టాం—

" బ్రిటిష్ సేనలూ జపాను సేనలూ తలపడిన ప్రదేశాల్లో మన సహాయ నిరాకరణ వ్యర్థ మవుతుంది; కాబట్టి అనవసరము. ప్రస్తుతం బ్రిటిష్ వారిపట్ల మనసహాయం నిరాకరణ పరిమితమే. వారు యుద్ధం చేస్తున్న పరిస్థితుల్లో పూర్తిగా సహాయ నిరాకరణ చేశామంటే మనదేశాన్ని జపానువారికి వప్పగించిన వారమవుతాము. అందువల్ల, జపానువారిపట్ల మన సహాయ నిరాకరణను ప్రదర్శించడానికి. బ్రిటిష్ సేనలకు ఏలాంటి ఆటంకాలు కలిగించకుండా ఉండడం ఒక్కటే మార్గం అవుతుంది. తరచుగా అలా అని, మనం బ్రిటిష్‌వారికి క్రియా రూపంగా ఏలాంటి సహాయం చేయడానికి వీల్లేదు. ఇటీవల బ్రిటిష్‌వారి వైఖరిని బట్టిచూస్తే, మనం ఏలాంటి జోక్యం కలిగించుకోకుండా ఉంటే అంతేచాలు. వేరే సహాయం ఏమీ అక్కరలేదన్నట్లు కనబడుతూంది. మనం వారికి బానిసలుగానే తోడ్పడాలని వారి అభిప్రాయం. అందుకుమనం ఎన్నటికీ అంగీకరించలేము" (" అల్లరులకు కాంగ్రెసు బాధ్యత " ఇంగ్లీషు ప్రతి 47 వ పేజీ)

ఏ. ఐ. సి. సి. సమావేశంకోసం చివరకు వర్కింగు కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించిన, చిత్తు తీర్మానంలో ఈ సమస్యను గురించి ఇలా ఉంది.

" బ్రిటిష్ సేనలూ, దాడి వచ్చిన శత్రుసేనలూ తలపడిన ప్రదేశాల్లో మన సహాయ నిరాకరణ వ్యర్థ మవుతుంది; కాబట్టి అనవసరము. దాడి వచ్చిన శత్రువుపట్ల మనసహాయ నిరాకరణను ప్రదర్శించడానికి బ్రిటిష్ సేనలకు ఏలాంటి ఆటంకాలు కలిగించకుండా ఉండడం ఒక్కటే మార్గం అవుతుంది, తరచుగా బ్రిటిష్‌వారి వైఖరినిబట్టి చూస్తే, మనం ఏలాంటి జోక్యం కలిగించుకోకుండా ఉంటే అంతేచాలు. వేరే సహాయమేమీ అక్కరలేదన్నట్లుంది. "

గాంధీగారి చిత్తు తీర్మానం

అటు బ్రిటిష్‌వారి పట్లా, ఇటు జపానువారిపట్లా సహాయ నిరాకరణను సూచించింది. కాని. వర్కింగుకమిటీ తీర్మానం జపానువారిపట్ల మాత్రమే సహాయ నిరాకరణను సూచించింది. ఈ తేడా చాల ప్రాముఖ్యత గలది. ఆగస్టు తీర్మానంలోకూడా, యుద్ధానికి ప్రజలు ఏ విధంగాను తోడ్పడకూడదన్న ఆదేశం ఏమీలేదు.

మరోవిషయం మీజ్ఞప్తికి తేనివ్వడి. 'పీపుల్సు వాలంటీర్ బ్రిగేడు' (ప్రజా వాలంటీరు దళం) ను నిర్మించ వలసిందని పిలుపునిస్తూ; మీలో చాలమంది అన్న మాటలను జ్ఞప్తికి తెచ్చుకోండి. ఈదళం పౌర రక్షణ (సివిల్ డిఫెన్సు) విషయంలో ప్రభుత్వానికి సహకారం చేస్తుందనీ, ప్రజా శాంతిని కాపాడుతుందనీ, ప్రజల్లో భీతావహం వ్యాపించకుండా కృషి చేస్తుందనీ, ఇంకా ఏమేమో చెప్పారు.

యుద్ధఋణాల పేరుతో నిర్బంధ వసూళ్ళను ఎదుర్కొన్నందుకు ఎవరు ఎక్కువగా అరెస్టయారో లెక్కలు తీసుకోండి. రైతుల ఇళ్ళు వాకిళ్ళనూ పొలాలనూ కమాండరు కాకుండా ఎవరు కాపాడారో; ఒకవేళ కమాండరు కాక తప్పినప్పుడు, వాటికి న్యాయమైన నష్ట పరిహారాలనూ, ఇతర సదుపాయాలనూ ఇప్పించడానికి ఎవరు ఎక్కువగా పాట్లుపడ్డారో రైతులవద్దకు వెళ్ళి విచారించండి. ఈ రెండు విషయాల్లో మీ కాంగ్రెసువాదులకన్న కమ్యూనిస్టుల సంఖ్యే ఎంతో ఎక్కువ అని మీరే తెలుసుకోగలరు.

కమ్యూనిస్టులు ప్రజారక్షకులు

జపానుసేనలు జొరబడగలవనే ప్రమాదం తీవ్రంగాఉన్న ప్రదేశాల్లో మేము చొరవతీసుకొని, అన్నిపార్టీలనుకలిపి' ప్రజారక్షణ కమిటీలను స్థాపించాం. స్థానిక కాంగ్రెసునాయకులు వీటిలోచేరారు; కొందరుమాత్రమే మా ప్రయత్నాన్ని వ్యతిరేకించారు. అస్సాం రాష్ట్రంపైకి జపానువారు ఉరకలు తీసినప్పుడు శ్రీయుత బర్దోలాయ్ (అస్సాం కాంగ్రెసు నాయకుడు) ఉద్వేగంతో చేసిన ప్రకటన మీకు గుర్తుందని నమ్ముతున్నాం. ఏ పవిత్ర కర్తవ్యాన్ని నెరవేర్చడానికి తనకూ, కాంగ్రెసుకూ అవకాశ మివ్వమని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశాడో, ఆ కర్తవ్యాన్ని కమ్యూనిస్టులం అది

వరకే శాయశక్తులా కొనసాగించ నారంభించాం; సోదర కాంగ్రెసు వాదులందరూ అందుకే పూనుకోవలసిందని ఆందోళనచేస్తూ వచ్చాం. అవకాశాలున్నచోట బహిరంగంగానే మేం పనిచేశాం. లేనిచోట కొంత రహస్యంగానే ఆ అవకాశంకూడా లేనప్పుడు పూర్తిగా రహస్యంగాను కర్తవ్య నిర్వహణ సాగిస్తూ వచ్చాం.

నేషనల్ వార్‌ఫ్రంటులో చేరడానికి మేము నిరాకరించాము. ప్రజారక్షణ కమిటీలద్వారా మాత్రమే ప్రభుత్వాధికారులతో సంబంధం పెట్టుకున్నాం.

ఆహారసమస్య తీవ్రమయినంతవరకు మేము ప్రభుత్వ కమిటీలలో వేటిలోనూ చేరలేదు. అంతవరకు ప్రజా ప్రతినిధులను కూడదీసి 'ప్రజా ఆహారకమిటీల'ను పెట్టి, వాటిద్వారానే ప్రభుత్వంతో వ్యవహరిస్తూ వచ్చాం, రానురాను పరిస్థితులు మరింత ప్రమాదకరమయినప్పుడు, ఆహార సమస్య. బట్టల సమస్య మొదలయినవాటిని గురించి ఏర్పడిన ప్రభుత్వ సలహా సంఘాల్లోకికూడా మాకామ్రేడ్సుని వంపాం. త్వరలోనే కాంగ్రెసు మంత్రివర్గాలు అధికారంలోకి వస్తాయి. ఈ కమిటీలలో జరిగిన చర్చల రికార్డును అప్పుడే మీరు చదువగలరు. మా కామ్రేడ్సు భారతప్రజల శ్రేయస్సుకోసం కృషిచేశారో, లేక బ్రిటిషు ప్రభుత్వానికి సేవజేశారో మీరే అప్పుడు తెలుసుకోగలరు,

పరాయిప్రభుత్వ సంపర్కంవల్ల, దానిపరిస్థితులవల్ల 'యుద్ధకృషి అనేమాటే సహింపరానిదయింది. మా ప్రచారంలో ఆమాట రాకుండా చేశాం. కాని, యుద్ధసమయంలో ప్రతి సామాజిక వ్యవహారంకూడా యుద్ధకృషే అవుతుంది: ఆవిధంగానే పిలువబడుతుందికూడా. ప్రతి విషయాన్ని మేము ప్రజలశ్రేయస్సును దృష్టిలో పెట్టుకొనే పరిశీలించాం. ప్రజలకు ఉపయోగపడేదాన్ని బలపరిచాం; హానికలిగించేదాన్ని ప్రతిఘటించాం.

ప్రభుత్వంతో సహకారము, కూడదా అనేవిషయం మాకు అప్రధానమయింది. ప్రజల ఇబ్బందులను తీర్చడానికి: ప్రజల వాంఛలను తెలియజేయడానికి అవసరమైనప్పుడే ప్రభుత్వాధికారులవ[illegible] 'యుద్ధకృషి' అనే కొత్తపేరుతో తమ అవకతవ[illegible] కప్పిపుచ్చుకో జూచే నిరంకుశాధికారులను [illegible] చేసినప్పుడే 'పీపుల్సు వార్'లో ఆమాటను ఉపయోగించామని మీరే తెలుసుకోగలరు.

జమీందారీ యుగాల ధోరణి.

ప్రజాయుద్ధ'మనేమాట ఈనాడు సాధారణ కాంగ్రెసువాదికి ఎద్దు ముందు ఎర్రగుడ్డలాగుందని మేమెరుగుదుము. కమ్యూనిస్టులు ప్రభుత్వ పక్షం చేరిపోయారు. అందువల్లనే దీనిని ప్రజాయుద్ధమంటున్నారని వీరు చెవినిల్లుకట్టుకొని ప్రచారం చేశారు.

ప్రజలు, బుద్ధికుశలత నుపయోగించి వేసే అంచనాలు వారి వారి చరిత్రనుబట్టి ఉంటాయి. బడిపుస్తకాల్లోను, పారంపర్యంగావస్తున్న కథల్లోనూ మనకు తెలిసిన చరిత్ర రాజులయుద్ధాలను గురించే వాటిలో ప్రజలకెలాంటి జోక్యంలేదు. రాజు మరీ చండశాసనుడయితే ప్రజలకు తిరుగుబాటుచేయడానికి ఈ యుద్ధాలు అవకాశంగా ఉపయోగపడేవి. అలాంటిది మన నెత్తిమీద కూర్చున్నరాజు పరాయివాడయినప్పుడు, అతని నిరంకుశ ప్రభుత్వం యుద్ధంలో చిక్కుకొని ఉన్నప్పుడు ఆయుద్ధాన్ని 'ప్రజాయుద్ధ' మనడం సాధారణమనిషికి తెలివితక్కువగా కనబడుతుంది. కాని అలా అనుకోవడం జమీందారీయుగాల [మధ్యయుగాలు] నాటి బూజుపట్టిన దృక్పథం అనిపించుకోదా? నేటి 20వ శతాబ్ద ప్రపంచాన్ని సరిగా అర్థం చేసుకోవడానికీ; నేటి చారిత్రక శక్తులను, చరిత్రపోకడను సరిగా అంచనా వేయడానికీ ఇలాంటి దృక్పథంఅడ్డుపడదు?

సాధారణవ్యక్తి తెలుసుకొన్న ఆధునిక యుద్ధాలన్నీ 19వ శతాబ్దం నాటివే. మనదేశంలో బడులలో నేర్పుతూన్న చరిత్ర వీటి మధ్యయుగాల నాటి జమీందారీ పోరాటాలుగానే చిత్రిస్తూంది - కాస్త మెరుగులుపెట్టి.

"ఒక దేశం తన పరిపాలకుల నాయకత్వం క్రింద మరోదేశంతో పోరాడుతుంది. ఎవరిస్వప్రయోజనాలకోసం వారు పోరాడుతారు.

"పెద్దరాజ్యాలు తమచుట్టూఉన్న చిన్నరాజ్యాలను గులాములుగా చేసుకోడానికి ప్రయత్నిస్తాయి. ఆ విధంగా ఎవరిపక్షాన్ని వారు బలపరుచుకో జూస్తారు.

"ప్రజలుజరిపే విప్లవపోరాటాలే న్యాయమైన పోరాటాలు."

మనకు నేర్పుతూన్న చరిత్రనుబట్టి సాధారణవ్యక్తి గ్రహిస్తూన్న సారం ఇది. తన నిత్యజీవితానికి, తనలో రగులుతూన్న స్వాతంత్ర్య తృష్ణకు ఇది అనుగుణ్యంగానే ఉంది.

కాని, ఈ విధమైన దృక్పథంతో నేటి వ్యక్తి ఆధునిక ప్రపంచంలో తన స్థానాన్ని తెలుసుకోలేడు. నేటి ప్రపంచంలో ప్రజలు రాజులచేతిలో కీలుబొమ్మలు కారు. తమ స్వార్థంకోసం బలిచేయవలసిన నోరులేని యజ్ఞ పశువులు కారు. ఈనాడు ప్రజలు ఒక స్వతంత్రశక్తి; ప్రపంచనిర్వహణలో ఉచితపాత్రను వహిస్తున్నశక్తి. దీనినిగుర్తించే కాంగ్రెసు తన తీర్మానాల్లో ప్రపంచసామ్రాజ్యవాదమంతా ఒక పక్షంగాను, ప్రపంచప్రజా స్వామ్యమంతా ఒకపక్షంగాను; అన్నిదేశాల స్వాతంత్ర్యంకోసం ప్రపంచ ప్రజలందరూ ఏకముఖంగా పోరాటం సాగిస్తున్నారని నిర్వచిస్తూవచ్చింది.

ఇలాంటి తీర్మానాలను నెహ్రూపండితుడు ప్రతిపాదించేవారు, మీలో కొందరు బలపరచేవారు. మొత్తంమీద అందరూ ఏకగ్రీవంగా ఆమోదించేవారు. వాటిని మళ్ళా మళ్ళా ప్రతిపాదించడానికి అంగీకరించేవారు. కాని ఇప్పుడుచూస్తే అవన్నీ వట్టి మాటలుగానే కనబడుతున్నాయి. నెహ్రూ వాటిని పలికారు. మీరు తలలూపారు. అందువల్లనే. ఇన్ని తీర్మానాలు జరిగినా, ప్రపంచయుద్ధాన్ని గురించి మీరాపాత జమీందారీ యుగ దృక్పథాన్నే అవలంబించారు. మీరు మాపైని అభియోగం తెచ్చిన పద్ధతిని చూస్తేనే ఈ విషయం స్పష్టమవుతుంది.

వ్యత్యాసం పద్ధతుల్లోనే ఆశయంలోకాదు

ఈ యుద్ధాన్ని 'ప్రజాయుద్ధ' మని నిర్వచించినందుకా మీ ఆక్షేపణ కమిటీ? ఆ మాటను ఆక్షేపించడం మినహా, ఇంకేమైనాఉందా?

మనదేశం విషయంలో ప్రజాప్రభుత్వం తక్షణమే అవుసరమని మేము గుర్తించాం. ప్రస్తుత ప్రమాదములో దేశం కాపాడడానికి, తుదకి స్వాతంత్ర్యాన్ని సాధించడానికి ఇప్పుడే జాతీయప్రభుత్వం అవుసరమని గుర్తించాం.

'పీపుల్సువార్' మొదటసంచిక సంపాదకీయంలోనే మా విధానాన్ని వివరించాం. అందులో 'జాతీయప్రభుత్వాన్ని' గురించి ఇలా రాశాం.

"దేశరక్షణను జయప్రదంగా నిర్వహించడానికి, స్వాతంత్ర్యాన్ని సంపాదించడానికి 'జాతీయ ప్రభుత్వం' అత్యవసరమని మేము తోటి దేశభక్తులతో ఏకీభవిస్తాం. ఈ నాడు మన ప్రధాన

వినాదం ఇదే" ('పీపుల్సువార్' సంపుటి 1 సంచిక 1 1942 జూలై 5.)

పరాయి ప్రభుత్వం చేతిలోనే పరిస్థితులను విడిచిపెడితే దేశానికీ, భవిష్యత్తుకూ కలుగగల అధికతర ప్రమాదాన్ని గురించి మీరేమను కొన్నారో మేమూ అలాగేభావించాం.

"వలసదేశాలన్నిటిలోను సామ్రాజ్య పాలకులకున్న బలంఒకటే. నిండుసున్న! విజయ సాధనకు ప్రజల్ని సమీకరించడానికి బదులు వారు ప్రజలనుండి పూర్తిగా దూరమయి పోతున్నారు. వీరి వలస ప్రభుత్వాలు ప్రజల్ని ముందుకు నడపడానికి బదులు, ప్రజలంటే బెదిరిపోతున్నారు. వీరి నిరంకుశ పరిపాలనాయంత్రం ఆధునిక యుద్ధాన్ని తట్టుకోడానికి బదులు, మొదటి తాకిడీకే నేలకూలుతూంది. ఎ ప్రజలనయితే యిన్నాళ్ళూ అనగద్రొక్కిందో ఆ ప్రజల నెత్తిమీదే కూలుతుంది, ఆ ప్రజల బానిసత్వాన్నయినా కాపాడగలశక్తి ఈ సామ్రాజ్యవాదులకు లేదు. ఈ వలసదేశాల రక్షణ సామ్రాజ్యవాదపాలకులకు చేతకాదు. దానిని వాళ్ళ చేతుల్లో విడిచిపెట్టకూడదు. వలసదేశాల జాతీయోద్యమాలు తమ సర్వశక్తులతో విజృంభించాలి. తమదేశాల స్థితిగతులకు తామే బాధ్యులుకారు. (ఫార్వర్డు టు ఫ్రీడం - ఇంగ్లీషుప్రతి - 35 పేజీ)

ఇక మీకూ మాకూ నిజమయిన వ్యత్యాసం జాతీయ ప్రభుత్వాన్ని ఎలా సాధించడం అనే సమస్యపైవచ్చింది. అది తరువాత ప్రస్తావిస్తాము.

తక్షణ జాతీయ కర్తవ్యంలో మీకూ మాకూ ఒకటే. పద్ధతుల విషయంలోనే భేదంవచ్చింది.

యుద్ధాన్ని "ప్రజాయుద్ధ" మని నిర్వచించినందుకే మాతో తప్పు పట్టడమంటే అది చరిత్రతో తప్పుపట్టడమవుతుంది. గాని, మాతోకాదు.

యుద్ధకృషినిగురించి మాపై నేరారోపణ చేయడమంటే - కళ్ళు గట్టిగా మూసుకొని, గాలిలోకి గురిచూడడమవుతుంది.

ప్రధాన కర్తవ్యం దేశరక్షణ

యుద్ధంయొక్క మొదటిదశను మేము 'సామ్రాజ్యవాద యుద్ధ' మని నిర్వచించాము. కాని. దురదృష్టవశాత్తు అది ప్రజాయుద్ధమా

అన్నట్టు కాంగ్రెసు నాయకులు ప్రవర్తించారు. కాంగ్రెసు మాత్రం దానిని ప్రజాయుద్ధ మనలేదు. అలాఅని అన్నట్లయితే అప్పుడు మీరు మాతో తప్పుపట్టి ఉండవచ్చును. అనాడు యుద్ధస్వభావాన్ని గురించి మీతోమేము పేచీ పెట్టుకోలేదు. అది సిద్ధాంత చర్చలకు, వట్టి ఊహాలకే దారితీసేది. కాంగ్రెసువంటి విశాల ప్రాతిపదిక గల సంస్థ మా పార్టీలాగా ఖచ్చితంగాను, ఏకముగాను, ఉండజాలదని మాకుతెలుసు. ఇరువురికీ సమానమైన స్వాతంత్ర్యాశయాన్ని సాధించే ఉత్తమ మార్గం ఏది అన్న విషయముపైనే మేము కేంద్రీకరించాం,

రెండవదశలో యుద్ధాన్ని మేము ప్రజాయుద్ధమని పేర్కొన్నాం. కాని, కాంగ్రెసు నాయకులు కొందరు అది సామ్రాజ్యవాద యుద్ధమేఅన్నట్లు వ్యవహరించ సాగారు. కాంగ్రెసు మాత్రం దానిని 'సామ్రాజ్యవాద యుద్ధ' మని నిర్వచించలేదు. అలా నిర్వచించిఉంటే మీరు మాపై నేరంమోపియుండవచ్చును. మా నిర్వచనంయొక్క భావమేమిటో తెలుసుకోడానికి మీరు ప్రయత్నించి ఉన్నట్లయితే, మీ ఆశయమూ మాఆశయమూ ఒక్కటే అన్న సత్యాన్ని మీరు గ్రహించేవారు. అంతర్జాతీయ పరిస్థితులనే కాకుండా జాతీయ పరిస్థితులనుకూడా మేమర్థం చేసుకోవడం మీకన్నా ఏకతీరుగాను, వాస్తవికంగానూ ఉన్నదని గత నాలుగేళ్ళ చరిత్రే రుజువుచేస్తూంది.

మనకు స్వాతంత్ర్యం చేకూరనంతవరకు ఈయుద్ధం మన దృష్టిలో ప్రజాయుద్ధం కాజాలదని మీలో కొందరి వాదన.

మనకుకూడా ఇది ప్రజాయుద్ధమే అని మేము వాదించాం, మన స్వాతంత్రానికి మార్గం ఈ యుద్ధాన్ని ప్రతిఘటించడం కాదన్నాం. అందులో పాల్గొనడంద్వారానే మనం స్వాతంత్ర్య గమ్యస్థానం చేరగలమన్నాం. ఈ యుద్ధంలో పాల్గొనాలనే మీరూ అభిలషిస్తున్నట్లు, తద్వారానే స్వాతంత్ర్యాన్ని సాధించదలచినట్లు మీ ప్రకటన లన్నిటిలోను స్పష్టపరిచారు.

'ప్రజాయుద్ధ' దృక్పథాన్న వలంబించడంవల్ల దేశానికి మే మివ్వగలిగిన కార్యక్రమ మేమిటి? అది జాతీయాశయానిగ్గాని, కాంగ్రెసు విధానానిగ్గాని భిన్నమైనదా?

మాతృదేశ రక్షణే ప్రప్రధాన కర్తవ్యమని మేము నొక్కిచెప్పాము. దీనిని బట్టే మా నిర్ణయాలన్నీ చేసుకున్నాం, మీ ఉపన్యాసాలనే గాని మీరిప్పుడు తిరిగి చదివేటట్లయితే, దేశానికి కలిగిన ప్రమాదము, దానినుండి

దేశాన్ని కాపాడవలసిన మహత్తర బాధ్యత వాటిల్లో ప్రధానంగా కనబడగలదు.

"ఇండియా బ్రిటిష్‌వారి వలస దేశమే" అనే వాదనతో కొంతమంది మా నోటికి తాళం వేయజూచేవారు,

"బ్రిటిష్‌వారికి ఇండియా ఒక వలసదేశమే. కాని. అంతేలే అని చెప్పి మనంకూడా అనుకుంటే బ్రిటిష్‌వారి బానిసలకన్నా మనం ఏవిధంగా మెరుగు ? భారతదేశం మనకు పవిత్ర మాత్రుభూమి. అదిమన సర్వస్వం" —అని మేము బదులుచెప్పి వారివి నోరు కట్టించేవాళ్ళము.

కాబట్టి. దేశరక్షణకోసం, జాతీయ ప్రభుత్వ స్థాపనే భారత ప్రజల ప్రధానకర్తవ్యం అని మీరు గుర్తించారు. అత్యుత్సాహంతో, హృదయపూర్వకంగా మేము మీతో ఏకీభవించాము. ఈవిషయాన్ని మీరుపూర్తిగా మరుగు పరిచారు. అందువల్లనే అది మీ రిపోర్టులో ఎక్కడా కనబడడం లేదు.

ఇదేనా మమ్మల్ని విచారించవలసిన పద్దతి ? కాంగ్రెసుకూ మాకూ గల విభేదాలను అర్థం చేసుకోవలసిన మార్గమిదేనా ? కాంగ్రెసు ప్రధానంగా కోరినదానినే మేము బలపరిచామన్న సత్యాన్ని మరుగు పరచడమేనా ఇందుకు మార్గం ?

జాతీయ ప్రభుత్వాన్నే కోరడం దాసోహమనడం కాదు

కాంగ్రెసు సోషలిస్టులూ, ఫార్వర్డు బ్లాకువారూ, ఈ యుద్ధం సామ్రాజ్యవాద యుద్ధమనే ధోరణితో వాదించి, జాతీయ ప్రభుత్వాన్ని కోరడం బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి దాసోహం అనడమే అని తేల్చేవారు. ఈ వాదన నెదుర్కొన్నది మా పార్టీ ఒక్కటే. సాధారణ కాంగ్రెసువాది మీ రిచ్చిన 'జాతీయ ప్రభుత్వం' నినాదాన్నే సమర్థించుకోలేక పోయాడు అందుకు కావలసిన విషయ పరిజ్ఞానాన్ని మీరు చేసిన తీర్మానాలూ, ఉపన్యాసాలూ అతనికివ్వలేదు. యుద్ధ స్వభావాన్ని మీరు విస్పష్టంగా నిర్వచించలేదు. అందువల్ల అతనికి అసందిగ్ధమైన దృక్పథం అలవడలేదు. సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని తక్షణమే గుర్తించాలంటూ, కాంగ్రెసు తాత్కాలిక జాతీయ ప్రభుత్వానికి ఏ విధంగా అంగీకరించ గలదని అతను తికమకలో పడ్డాడు జాతీయ ప్రభుత్వాన్ని కోరడం, మితవాద ధోరణిలో

సామ్రాజ్యవాదులతో రాజీ కుదుర్చుకోవడం ఎంతమాత్రం కాదన్న విషయాన్ని అతను గుర్తించలేకపోయాడు.

జాతీయప్రభుత్వం కావాలనడం మంచిదే అని సాధారణకాంగ్రెసువాది బుద్ధికి స్ఫురిస్తుంది. కాని, సంపూర్ణస్వాతంత్ర్యవాంఛనుండి ఇది దిగజారిపోవడమేమో అని అతని భయం. ఈ భయాన్ని పారదోలి, తన బుద్ధికి స్ఫురించినదానికి సిద్ధాంతసౌష్టవాన్ని చేకూర్చి, అదెలా ముందడుగో అతనిచే గుర్తింపజేసింది మా ప్రచారం.

భారతదేశ రక్షణను జయప్రదంగా నిర్వహించడానికే జాతీయ ప్రభుత్వం కావాలని మీరు మీ తీర్మానాల్లో తెలియజేశారు. భాతరదేశాన్ని రక్షించడం బ్రిటిష్‌ప్రభుత్వానికి చేతకాదని వాదించారు. మేము మీతో హృదయపూర్వకంగా ఏకీభవించాం.

కాని, జాతీయప్రభుత్వం రానంతవరకూ కాంగ్రెసువాదు లేమి చేయాలి అన్న విషయాన్ని మీరు స్పష్టంచేయలేదు. ఎంతకాలం సహకారం చేయకుండాకూర్చుంటే, బ్రిటిష్‌వారు అంతత్వరగా దిగివచ్చి జాతీయ. ప్రభుత్వాన్ని ఇచ్చేస్తారని మీరు ఊహించినట్లు యిప్పుడు స్పష్టమవుతూం రాజకీయంగా మీరు తప్పుఅంచనాలు వేయడం, భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదు లనుసరిస్తున్న విధానాన్ని సరిగా అర్థంచేసుకోకపోవడమే మీ భ్రిమకు కారణమయింది.

ఆరోజుల్లో, ఒకవైపు పరిస్థితులు నానాటికీఅధ్వాన్న మవుతూ వచ్చాయి. మీరు, జాతీయప్రభుత్వం కావాలన్నారు; కాని దానిని ఎలా సాధించాలో చెప్పలేదు. ఇక కాంగ్రెసువాదులు తమకుతోచినట్లు ఆలోచించసాగారు. జాతీయప్రభుత్వం లేనంతకాలం ఏమీ చేయలేమని వాదించారు. ఈ వైఖరి ఫలితంగా నిస్పృహ, నిరాశలు బాగా అలముకోసాగాయి. దీని నరికట్టడానికి మేము కృషిచేశాము. జాతీయప్రభుత్వంలేనిదే దేశాన్ని జయప్రదంగా రక్షించడం సాధ్యంకాదని అనుకోవడం బాగుందన్నాము. కాని, దానిని స్థాపించనందుకు బ్రిటిష్‌వారిమీద ద్వేషంకొద్దీ జపాను విజయాలను చూచి ఉబ్బిపోయేస్థితికి ప్రజలు దిగకూడదని వాదించాము. అది వారి ఆత్మలకేద్రోహం చేసుకోవడ మవుతుందన్నాము. ఏమీచేయకుండా చేతులు ముడుచుకొని జాతీయప్రభుత్వంకోసమో, లేకపోతే జపానువారికోసమో ఎదురుచూడడం తగదని నొక్కి చెప్పాము.

జపానును ప్రతిఘటించవలసిన ఆవశ్యకతను మేము ప్రజల్లో తీవ్రంగా ప్రచారం చేశాం. ప్రజల్లో భీతావహాన్ని వ్యాపింపజేయ జూచిన వారిని ఎదుర్కొన్నాం. 1942 లో బొంబాయి ఏ. ఐ. సి. సి. సమావేశం నాటివరకు మా ఈ కృషి సాగుతూనే వచ్చింది. ఇది కాంగ్రెసు తీర్మానాలకు భిన్నమని మీరనగలరా? ముమ్మాటికీ అనలేరు. ఆనాడు అనలేదు కూడాను.

జాతీయ ప్రభుత్వం రానంతవరకు ఏమిచేయాలో మేమీవిధంగా స్పష్ట పరిచాం. దేశరక్షణకు శక్తికొలది తోడ్పడాలి; దానికి భంగం కలిగించే ఏ పనీ చేయకూడదు, ప్రతివిషయాన్నికూడా, అది దేశరక్షణకు తోడ్పడుతుందా, లేక బ్రిటిష్ నిరంకుశ పరిపాలనను బలపరుస్తుందా అన్న గీటురాయిని బట్టే పరిశీలిద్దామని సోదర కాంగ్రెసువాదులతో వాదించాం.

ఏదయినా కార్యక్రమం తీసుకోవలసి వచ్చినప్పుడుగాని, లేక ప్రత్యేకచర్య ఏదయినా తీసుకోవలసి వచ్చినప్పుడుగాని ఎలాంటి విభేధాలు తటస్థించేవి కావు. కాని, జాతీయప్రభుత్వం ఇంకా రానిదశలో దేశరక్షణపట్ల మనవైఖరిని నిర్ణయించుకోవా లనుకొనేటప్పటికి అభిప్రాయభేదాలు ముసురుకొని వచ్చేవి.

ఛాంధస కాంగ్రెసువాదులు ప్రభుత్వంతో సహకారము, సహాయ నిరాకరణమూ అనేపదాల్లోనే మాట్లాడేవారు.

దేశరక్షణ కార్యకలాపమంతా ప్రభుత్వంచేతిలోనే ఉందికదా, అలాంటప్పుడు వాటికి తోడ్పడితే, జాతీయ ప్రభుత్వంకోసం మన ఆందోళనకు బ్రిటిషువారు ఎలా లొంగివస్తారు అన్నదే వారి చిక్కుసమస్య.

వీరి వాదనలకు మేం జవాబుచెప్పేవాళ్ళం. ఈ పరాయిప్రభుత్వం మన దేశాన్ని కాపాడజాలదని ఒకవైపు అంటూనే మరొకవైపు దేశరక్షణ కార్యక్రమాన్నంతా వారిచేతుల్లో విడిచిపెట్టడం ఏమిసబబని చెప్పేవాళ్ళం. ఇలాంటి ఆలోచనల్లో ఎక్కడో తప్పుంది. పాతప్రపంచం నశిస్తూండడం మీరు కళ్ళారా చూస్తున్నారు కాని, మీ పాతభావాలను మాత్రం విసర్జించలేకుంటున్నారు. నూతన పరిస్థితులకు తగిన కొత్తపంథాను నిర్ణయించుకోలేకపోతున్నారు.

బ్రిటిష్‌వారు రెచ్చగొట్టడం

ప్రస్తుతపరిస్థితుల్లో చేతులు ముడుచుకు కూర్చోవడం బ్రిటిష్‌వారిపై ఎంతమాత్రం ఒత్తిడితేదనీ పైగా అది వారిపన్నాగాలను కొనసాగించడమే అవుతుందనీ మేము విశదపరచేవారము.

ఏవిధంగా అంటే—

ఆనాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పంథా ఇదీ:

1. కాంగ్రెసు నాయకులలో ఉన్న పరస్పర విభిన్న దృక్పథాలను (వీటివిషయం తరువాత ప్రస్తావిస్తాము) ఉదహరిస్తూ కాంగ్రెసుసంస్థ అంతా ఓటమితత్వంతో నిండిఉందనీ, ఫాసిస్టు అనుకూలసంస్థ అనీ ఇతర దేశాల్లో విషప్రచారంచేసి, ప్రజాస్వామిక వర్గాల్లో దానిని అవమానపరచడం భారతదేశరక్షణను ఇలాంటిసంస్థ చేతిలో విడిచిపెట్టడం ప్రమాదకరమని తమనుతాము సమర్థించుకోవడం.

2. ఇక దేశంలో జాతీయప్రభుత్వ వాంఛను తృణీకరిస్తూ. అత్యవసర రక్షణ సన్నాహాల కోసంకూడా అనవసరంగా క్రూరనిర్బంధ పద్ధతులను అవలంబిస్తూ కాంగ్రెసువాదులనూ, ప్రజలనూ రెచ్చగొట్టడం. దీని ఫలితంగా సంభవించే ఘటనలను ఇతర దేశాల్లో తమ విషప్రచారానికి విదర్శనాలుగ ఉపయోగించుకోవడం.

మా ఈవ్యాఖ్యానం ఎంతసరియయినదో కాంగ్రెసువాదులు చదువుతూ వచ్చిన పత్రికలే ఋజువుచేశాయి. పాతపద్ధతుల్లోనే పోరాటం సాగించాలనుకోవడం ఈనాడు బ్రిటిష్‌వారి పన్నాగాలకే తోడ్పడుతుందని, రాజకీయాలను గురించి శ్రద్ధగా ఆలోచించే కాంగ్రెసు వాదులచేత ఒప్పించగలిగాము.

మా శక్తికొలది మేం చేసిన కార్యక్రమాన్ని బహిరంగ సభల్లో ఈ విధంగానే సమర్థించాము. కాంగ్రెసు సోషలిస్టులు, బోసు అనుచరులు మమ్మల్ని దుమ్మెత్తిపోశారు. కాని. అప్పుడు మేము వారిని లెక్కచేయలేదు. ఆ రోజుల్లో వారు చేసిందేమీ లేదు, సభలయినా పెట్టలేదు. వారినీ వీరినీ కలుసుకొని మమ్మల్ని తిట్టిపోసేవారు. మమ్మల్నెరిగిన కాంగ్రెసువాదులుగాని, మే మెవరిమధ్య పనిచేస్తున్నామో ఆ ప్రజలుగాని మేము బ్రిటిషువారితో కలిసిపోయామని అనుకోలేదు,

ఐక్యతను నిర్మించడమే మా లక్ష్యం

చేతులు ముడుచుకూర్చోవడంవల్ల మన కోరికలెలా నెరవేరవో మేము జాతీయ ప్రభుత్వంకోసం చేసిన ఆందోళనలో వివరించాం. అంతే కాదు. బ్రిటిష్‌వారిచేత మనకోరిక నంగీకరింప జేయగలమనే గట్టి నమ్మకాన్ని కలిగిస్తున్న నూతనపరిస్థితులను విశదీకరించాము.

ఆ పరిస్థితులేమిటి?

1. ఫాసిస్టు దురాక్రమణదారులను ప్రతిఘటించి, దేశాన్ని రక్షించడానికి తన సంసిద్ధతను కాంగ్రెసు ఎంత సుస్పష్టంచేస్తుందో అంతర్జాతీయ సానుభూతిని అంతగా చూరగొంటుంది. ఇండియాలో తక్షణమే జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించవలసిందని బ్రిటిష్‌వారిపై అంతర్జాతీయ ఒత్తిడికూడా అంతగా పెరుగుతుంది.

2. యుద్ధపరిస్థిల్లో బ్రిటిష్‌వారిపై ద్వేషం రాజకీయచైతన్యంగల వారిలో మాత్రమేకాకుండా. ప్రజాసామాన్యం అందరిలోనూ బాగా వ్యాపించింది. ఈ విషయంలో పార్టీవిభేదాలకు స్థానం లేకపోయింది. ఒకవైపు ప్రజలపై నిరంకుశాధికారుల దౌర్జన్యాలు మితిమీరిపోసాగాయి: మరోవైపు జపాను ప్రమాదం నానాటికీ తీవ్రమవుతూ వచ్చింది. అలాంటి పరిస్థితుల్లో కూడా పార్టీలూ. నాయకులూ పాతవిభేదాలను మరచిపోయి, ఏకముఖంగా నిలబడలేక పోయారంటే వారిలో ఏదో పెద్దలోపముందన్నమాట.

గడచిపోయిన రోజుల్లో ఎవరిధోరణి సరియైనది, ఎవరిది తప్పు, ఎవరిది చిలిపితనం, ఎవరిది సహింపరానిది అనే వాదోపవాదం కాదు అప్పుడు కావలసింది. ప్రధానరాజకీయపక్షాలు తమ విభేదాలను మూలబెట్టి ఒడంబడికను కుదుర్చుకొని ఏకకంఠంతో జాతీయప్రభుత్వంకోసం ఆందోళన చేయడమే ఆనాటిముఖ్యకర్తవ్యం. 'కాంగ్రెసును నమ్మకూడదు' అనే తమ విషమప్రచారాన్ని ప్రపంచంలోని అభివృద్ధికర శక్తులు అరికట్టిన తరువాత సామ్రాజ్యవాదులు కొత్తనినాదం లేవదీస్తారని మేమన్నాం; అధికారం వప్పగించేయడం మాకిష్టమే కాని. ఎవరికి వప్పగించడం? అనేదే ఆకొత్తనినాదం అవుతుందనీ ఈప్రశ్నను సాకుగాచూపి పరిష్కారం కుదరకుండా చేస్తారనికూడా ఆనాడే చెప్పాం. మనపార్టీలు దేనిమట్టుకది బ్రిటిష్ ప్రభుత్వంతో పరిష్కారం కుదుర్చుకోడానికి ఎంతకాలం ప్రయత్నిస్తాయో,

అంతకాలం మనకు ముక్తిఉండదనికూడా చెప్పాం. మేమన్నదంతా ఎంత సరియయినదో ఈనాడు రుజువవుతూంది.

స్వతంత్రంగా మేము చేయగలిగిన కృషిఅంతా రెండు ప్రధానవిషయాలను దృష్టిలో పెట్టుకొనే చేసేమన్నది, పై విషయాలనుబట్టి మీకే బోధపడగలదు.

యుద్ధంపట్ల, దేశరక్షణపట్ల మనం అవలంబించ వలసిన వైఖరి విస్పష్టంగా ఉండడం; ప్రజలకు న్యాయంగలిగించేదిగాను, మనకు ప్రపంచ ప్రజల సానుభూతి సహకారాలను చేకూర్చేదిగాను ఉండడం మొదటి విషయం.

రెండవది— తాత్కాలిక ప్రభుత్వ స్థాపనను అరికట్టడానికి బ్రిటిషువారు పన్నుతూన్న పన్నాగాలను, జాతీయైక్యతద్వారా భగ్నంచేయాలి.

జాతీయైక్యతద్వారానే జాతీయప్రభుత్వం వస్తుందని మేమన్నప్పుడు మీరొకటనవచ్చును. రాజకీయ నాయకుల్లో ఒకరి తెలివితేటలపై ఒకరికి నమ్మకంలేదు. అలాంటప్పుడు వారి తెలివితేటలపై మీరు నమ్మకంపెట్టుకోవడం ఏమిటని మమ్మల్ని మందలించవచ్చును. అంతేగాని. మేము బ్రిటిష్ పాలకుల గులాములయి పోయామని అనడానికి మీకు నోరెలా వచ్చింది.

ఆనాటి పరిస్థితులు మన మాతృదేశానికి అత్యంత ప్రమాదకరమైనవి. గడిచిపోయిన పార్టీ విభేదాలనే మనసులో పెట్టుకొని ఆ పరిస్థితులలో కూడా వ్యవహరించడం మహాపరాధం అనుకున్నాం. దేశాన్నెదుర్కొన్న ప్రమాదాన్నే దృష్టిలో పెట్టుకొని, ప్రజలకేవిధంగా శ్రేయస్సు కూర్చడమన్నదే ప్రధానంగాతీసుకొని నడుచుకోడానికి శాయశక్తులా కృషి చేశాం. మా పార్టీ తక్కిన పార్టీలకన్నా వయసులో చిన్నది. వేరులు నాటుకున్న అపోహలుగాని, సంకుచితదృష్టిగాని మాకులేవు. అందువల్లనే పార్టీ విభేదాలను మరచిపోయి. విశాలహృదయంతో ముందుకు చూడగలిగాం. చరిత్రలో ఏనాడూ మనదేశానికి సంభవించని ఘోరప్రమాదాన్ని ఎదుర్కోడానికి భారత ప్రజలందరూ ఏక ముఖంగా నిలబడడానికి విజ్ఞప్తి చేయగలిగాము.

ఇంతగాధ జరిగింది. అయినా జాతీయప్రభుత్వంకోసం మేము సూచించిన జాతీయైక్యతామార్గం ఊసే ఎత్తకపోవడం; మేము బ్రిటిష్

ప్రభుత్వంతో కలిసిపోయామని యుద్ధంపట్ల మా వైఖరికి భాష్యం చెప్పడం మాపై దుష్ప్రచారం చేయడం అనిపించుకుంటుంది. మీరుచేసింది యిదే.

మా కార్యకలాపాలను గురించి మీ సబ్ కమిటీ ఇలా రిపోర్టు చేసింది.

"అదేవిధంగా మొదటినుంచీ వారు (కమ్యూనిస్టులు) ప్రభుత్వానికి పూర్తి మద్దతునిస్తూవచ్చారు; యుద్ధకృషిని బేషరతుగా బలపరచాలని ప్రచారం చేస్తూవచ్చారు. యుద్ధకృషికి ఆటంకం కలిగించే చర్యలనుగాని, ప్రభుత్వానికి యిబ్బంది కలిగించేచర్యలనుగాని, ఎవ్వరూ - కర్షకులు, కార్మికులు, విద్యార్థులు, ఎవ్వరూకూడా తీసుకోకూడదని వారిస్తూవచ్చారు.

ఇది రాజకీయవిషప్రచారంకన్నా ఘోరమైనది. నిజం చెప్పాలంటే సత్యాన్ని పాతిపెట్టడమే ఇది.

IV

వంకరటింకర మార్గాల్లో ఆగస్టువైపు గుడ్డిప్రయాణం

యుద్ధం మొదటిదశలోలాగానే. రెండవదశలోకూడా మీలో మీకు తీవ్రమైన అభిప్రాయభేదాలు కలిగాయి, మీ ధోరణినిబట్టి అది తప్పదు.

పరస్పర సామరస్యం కుదుర్చుకోడానికి, జాతీయప్రభుత్వ సాధన కంటూ మళ్ళా వంకరటింకరమార్గాలను పట్టారు, మొదటిదశలోలాగానే రెండవదశలోకూడా చేతికందొచ్చిన అవకాశాలను జారవిడిచారు. అప్పటి వైఖరికి భిన్నమైన వైఖరి నవలంబిస్తున్నట్లు కనబడినా, సరిగ్గా అలాంటి కారణాలవల్లనే, మళ్ళా యిలాజరిగింది.

1. యుద్ధ స్వభావాన్ని సవ్యంగా అంచనావేయడంగాని, వేసుకున్న అంచనాల్లోనయినా ఏకీభావం ఉండడంగాని ఈసారికూడా లోపించింది. అందువల్లనే యుద్ధగమనాన్ని మీరు సరిగా ఊహించలేకపోయారు. ఏరోజుకారోజు జరిగిన యుద్ధాలనుబట్టీ ఇకముందు జరగబోయే వాటిని గురించీ సాగుతూవచ్చిన ఊహాగానాలనుబట్టీ మీరు మీ అంచనాలు వేసుకుంటూ వచ్చారు.

2—బ్రిటన్ ఎంతచిక్కుల్లో పడితే, అంత శ్రద్ధతో మన మాట వింటుందన్నదే యీ దశలో కూడా మీమూలసూత్ర మయింది. కాని యదార్థ పరిస్థితులేమిటి? బ్రిటిష్ ప్రభుత్వం బిర్రబిగుసుక్కూర్చుంది.

అధికారాన్ని మనకు వప్పగింప నిరాకరించడంలో సామ్రాజ్యవాదుల ప్రవర్తన నాటికి దుస్సహమయింది; తమ నిరాకరణను సమర్థించు కోవడంలో వారి నీచప్రచారం అంతకంతకు శృతిమించింది.

కాని ఈ రెండవదశలో జరిగిన ఒక మార్పు ఏమిటంటే, బ్రిటిష్ వారిని మీరందరూ ద్వేషించారు. ప్రజల్లో ఈద్వేషం పెరిగినకొద్దీ అది జపాను అనుకూల ధోరణిగా రూపొందసాగింది. దాని ఛాయలు నాయకులైన మీమీదకూడా కనుపించాయి.

ఇంకొక మార్పుకూడా జరిగింది. సామ్రాజ్యవాద యుద్ధ దశలో మీరు ప్రజాపోరాటం అన్నమాటే ఎత్తలేదు. కాని. ఈదశలో ప్రజాపోరాటం ప్రారంభిస్తాము సుమా అని బ్రిటిష్ ప్రభుత్వాన్ని బెదరించ నారంభించారు. ఆ దశలో యుద్ధం ఎంతోదూరాన ఉంది; ఈదశలో మన పొలిమేరపైకే వచ్చింది. కాని, అప్పుడు వద్దనుకున్న ప్రజా పోరాటాన్ని యిప్పుడు తెస్తామని బెదరించారు. సామాన్య లౌకిక జ్ఞానానికే ఇది అతీతమైన విషయం. ఈ బెదరింపు మూలంగా మీరు జపానువారిని ఆహ్వానిస్తున్నట్లు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అర్థం చేసుకున్నారు; అలా అనే సర్వప్రపంచానికి చాటి చెప్పారు.

"మొదటిదశలో మాతో సహకారం చేయడానికి మీ అంగీకారాన్ని వెల్లడి చేశారుకదా? ఈ దశలోకూడా అందుకు ఇష్టమే అన్నారు. కాని అప్పుడు ప్రజాపోరాటం ఊసేయెత్తలేదు; ఈ దశలో దానిని ప్రారంభిస్తామని బెదరిస్తున్నారు.

"అంటే, ఆదశలో బ్రిటనుకు అనుకూలంగా ఉంది, ఈ దశలో జపానుకు అనుకూలంగా మారుతున్నారు. తాత్కాలికంగా బ్రిటన్ ఓడిపోతుండడమే ఇందుకు కారణం—"అని బ్రిటిష్సామ్రాజ్యవాదులు వాదింప నారంభించారు.

మొదటిదశలో బ్రిటిష్వారితో బేరంకుదరలేదు కాబట్టి మీరు ఈ దశలో జపానువారితో కుదుర్చుకోడానికి సిద్ధపడినట్లుగా వారు భావించారు. మీరు ఏక్షణంలో నయినా శత్రువుయొక్క ఏజంట్లయి పోతారని వారు గట్టిగా నమ్మారు. అలాంటి మీచేతికి ప్రమాద పరిస్థితుల్లో, అధికారాన్ని వప్పగించడం తగదని వారివాదన.

ఇదీ అమెరీల, లిన్‌లిత్‌గోల, మాక్సువెల్‌ల ధోరణి. మీ బెదరింపు ద్వారా బ్రిటిష్ ప్రభుత్వధోరణిలో ఎలాంటి మార్పును తేవాలనుకున్నారో దానికి పూర్తిగా వ్యతిరేకమయిన ఫలితం కలిగింది మీరు ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న నాయకులు; నిగ్గుదేరిన ఫాసిస్టువ్యతిరేకులు. అలాంటి మీతో పరిష్కారం కుదుర్చుకోవడం తమ సామ్రాజ్యవాద ఆశయాలకే దెబ్బఅని బ్రిటిష్‌ప్రభుత్వానికి తెలుసు. అందువల్ల ఏదో ఒక మిషపెట్టి పరిష్కారం కుదుర్చుకోకుండా వుంటూవచ్చింది. ఇప్పుడు మీబెదరింపు వారికొక వరప్రసాదంగా లభించింది.

1941 డిశంబరు 7వ తేదీన జపానుయుద్ధంలో ప్రవేశించింది. మీరందరూ డిశంబరు నెలాఖరున విడుదలయారు. బార్డోలీలో సమావేశమయి, నూతన పరిస్థితులను గురించి మీమొట్టమొదటి తీర్మానం చేశారు. డిశంబరు 25న హాంగ్‌కాంగ్ పతనమయింది. 1942 ఫిబ్రవరిలో బర్మామీద దాడి ప్రారంభమయింది. ఫిబ్రవరి 15న సింగపూరు, మార్చి 8న రంగూను పడిపోయాయి. మార్చి 23న క్రిప్సు ఇండియాకు ఎగిరివచ్చాడు. ఏప్రిల్ 30న లాషిలో పట్టణం పడిపోయింది. మే రెండవవారంసరికి, బర్మాఅంతాచేయిజారిపోయింది. చిండ్విన్ లోయలోనుంచి బ్రిటిష్‌వారు వెనక్కి వచ్చేశారు. ఆగస్టు 8వ తేదీన మిమ్మల్ని తిరిగి అరెస్టు చేశారు.

మీ అంచనాలన్నీ ఎలా తప్పాయో దీనినిబట్టే గ్రహించగలరు. తమ పరాజయాలు పెరిగినకొద్దీ బ్రిటిష్‌వారు మీపై విషప్రచారాన్ని తీవ్రం చేయసాగారు. అసహనము, నిరంకుశత్వము మితిమీరసాగాయి. వారిలో స్వార్ధదృష్టి పెచ్చుపెరిగింది. కాని, మీరో-గ్రుడ్డిగా ప్రవర్తించారు.

అసలు ప్రజాపోరాటం ప్రారంభించాలనే ఉద్దేశ్యమే మీకు లేదని తరువాత నిరూపిస్తాము. ఈ ఉద్దేశ్యమే లేనప్పుడు, వట్టి బెదరింపు మూలంగా పరిస్థితులింత చేయిజారిపోవడం మరింత విషాదకరం.

బూర్జువా మితవాద ధోరణి

ఆదశలో మీ విధానంలోని ముఖ్యమైన లోపమేమిటి? ఆధునిక పరిస్థితుల కనుగుణ్యమైనట్టూ, తీవ్రవాదంతో కూడుకున్నట్టూ అది బయటికి కనపడింది. కాని, నిజానికి రెండూ కాదు.

1. మీ విధానం ఆధునిక విప్లవ దృక్పధంపై ఆధారపడిందికాదు. పాతబడిన భారత మితవాద దృక్పధమే అందులో ప్రతిబింబించింది. దీన్నే బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై భ్రమ పెట్టుకోవడమని మేమంటాము.

2, మనప్రజల్ని భవిష్యద్భారత దేశానికి అధినాధులుగా ఈ విధానం గుర్తించలేదు. కాని మీమట్టుకు మీకు మంచిదని తోచిన ఆశయాన్ని సాధించడానికి పాచికలుగా మాత్రమే వారిని గుర్తించింది. దీనినే ప్రజలపట్ల బూర్జువా దృక్పధమని మే మంటాము.

ఇలాంటి విధానం అవలంబించడంవల్ల మీరు సందిగ్ధావస్థలో పడ్డారు. ప్రజాపోరాటమనే బెదరింపును లక్ష్యపెట్టకుండా, బ్రిటిష్‌వారు జాతీయప్రభుత్వ స్థాపనకు నిరాకరిస్తే దేశాన్ని కాపాడ్డం ఎలా? మూలకు తరుమబడ్డ పిల్లిలాగా మీరు, ముందు ఆలోచన లేకుండా ప్రవర్తించారు.

దేశాన్ని రక్షించడమే మా ఆశయమంటూ మీరు గంభీరమయిన ప్రకటనలతో బయలుదేరారు. చివరకు ఆ రక్షణకే భంగం కలిగించగల బెదిరింపులలోకి దిగారు. ఇది హేతువాదము కాదు; లౌకికజ్ఞానము కాదు.

మాతృదేశ రక్షణను తమ స్వంతవిషయంగా పరిగణించే ఉత్తేజం ప్రజల్లో కలిగించగలమనీ; నిరంకుశాధికారులు వద్దనుకుంటున్నా ప్రజా సహకారం తప్పనిసరిగా పొందేలా చేయగలమనీ మీ ఆలోచన కెన్నడూ తట్టలేదు. మన ప్రజల్ని కాపాడడానికి; దేశరక్షణ సన్నాహాలను ప్రజాస్వామిక పద్ధతులపై నడిపి, జయప్రదం చేయడానికి ఇదే మార్గమని మీ బుద్ధికి తోచలేదు. అది మాకు తట్టింది. కాని, ఆనాడు మాదొక చిన్న మైనారిటీ పార్టీ. ఈ మార్గం అనుసరణీయమని చిన్న ఎత్తున ప్రదర్శించగలిగాము. స్వయంకృషితో తమ హక్కులను రక్షించుకోడానికి పూనుకున్నప్పుడు, ఆచరణలో నిరంకుశాధికారులు దిగిరావడం చూచినప్పుడు ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని నిరూపించగలిగాము.

ప్రజాఐక్యతను నిర్మించడం గురించిగాని, రెండవ ప్రధాన రాజకీయ సంస్థ (ముస్లింలీగు) యొక్క సహకారాన్నయినా పొందడంగురించి గాని మీరు ఎవ్వరూ ఆలోచించలేదు. ఆ ఆలోచన మాకు కలిగింది. సామ్రాజ్యవాదుల మొండి పట్టుదలను పటాపంచలు చేయడానికిదొక్కటే మార్గమని మేము గుర్తించాము.

సవ్యమైన మార్గంకోసం మీరెలా తడవులాడారో; చివరకు దానిని నిర్ణయించుకోలేక తిన్నగాపోయి యెలా బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వలలో పడ్డారో - ఆ విషాదగాథ నిప్పుడు వివరిస్తాము. ఎవ్వరూ కాదనలేని యదార్థ ఘటనలగాథ యిది - మీ స్వంత మాటల్లోనే వెల్లడవుతూంది.

త డ వు లా ట

జైలునుంచి బయటికి రాగానే దేశాన్నెదుర్కొన్న ప్రమాదాన్ని మీరు గుర్తించారు; దురాక్రమణదారుల నెదుర్కొని దేశాన్ని రక్షించ డానికి మీ సంసిద్ధతను వెల్లడించారు.

కాని, వెంటనే మీరు సందిగ్ధావస్థలో పడ్డారు. బ్రిటిష్‌వారు నెత్తి మీద కూర్చొని ఉన్నంతకాలం ఇదెలా సాధ్యమని ఆలోచించసాగారు. అప్పటి కేడాదివరకు సాగిన పరిమిత సత్యాగ్రహం సామ్రాజ్యవాదుల వైఖరినేమాత్రం మార్చలేదు. "వాళ్లు మారకపోతే మనమెందుకు మారా" లని మీలో కొందరు వాదింప నారంభించారు.

1941 డిశంబరు 14వ తేదీన మౌలానా అజాద్ అసోసియేటెడ్ ప్రెస్ ఆఫ్ ఇండియా ప్రతినిధితో మాట్లాడుతూ "కాంగ్రెసు వైఖరిలో యెలాంటి మార్పు జరగకపోవచ్చు"నని అన్నారు. అప్పటికి గడచిన 15 మాసాల్లో "బ్రిటిష్ ప్రభుత్వ ధోరణి యేమాత్రం మారినట్లు నిదర్శ నాలు లేకపోవడమే" అందుకు కారణమన్నారు.

(బొంబాయి క్రానికల్ 1941 డిశెంబరు 15,)

మీ పరిమిత సత్యాగ్రహం సామ్రాజ్యవాదుల వైఖరిలో ఎలాంటి మార్పు తీసుకరాలేకపోవడం అటుండగా, ప్రజల్లో ఒకలాంటి కార్యశూన్య తను కలిగించింది. బ్రిటిష్‌ప్రభుత్వం కాంగ్రెసు కోరికను నెరవేర్చేవరకు చేతులు ముడుచుకూర్చోడమే తమపని అన్న భావం ఈ ఉద్యమఫలితంగా వారిలో వ్యాపించింది. బ్రిటిష్‌ప్రభుత్వం ఆపని చేయకపోయేసరికి ప్రజల్లో తీవ్రద్వేషం రగులుకొచ్చింది. ఏమీచేయలేక ప్రభుత్వాన్ని దూషింపసాగారు. బానిసబుద్ధితో అక్షరాజ్యాల విజయాలను హర్షింప నారంభించారు.

ఈ పరిణామం మీకే ఆశ్చర్యం కలిగించింది. ఇది బ్రిటిషువారి నిరంకుశవిధానం ఫలితంమాత్రమే కాదు, యుద్ధంయొక్క మొదటిదశలో మీరవలంబించిన వైఖరికికూడా ఇందులో వంతుంది. 1941 డిశంబరు 17వ

తేదీన బొంబాయిలో పత్రికాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ నెహ్రూ గారిలా అన్నారు:

"బ్రిటిష్ ప్రభుత్వంతో సహకారం చేయాలనేవారు రెండు విషయా లను మరచిపోతున్నట్లుంది. బ్రిటిష్ విధానంపట్ల మన ప్రజల్లో ఇదివరకె న్నడూ లేని ద్వేషం మొదటి విషయం.........నా పాతికేళ్ళ రాజకీయ జీవి తంలో ఇంత తీవ్రద్వేషాన్ని ప్రజల్లో నేను చూడలేదు.

(బొంబాయి క్రానికల్—1941 డిశంబరు 18)

బార్డోలిసమావేశంలో మీరు రంగాన్ని సిద్ధంచేయసాగారు. కాని సవ్యమైన కార్యక్రమం కోసంకాదు; ప్రభుత్వంతో పరిష్కారానికి మాత్రమే. అప్పటికి ఒకఏడాదినుంచి కాంగ్రెసువాదులు అహింసా సూత్రాన్ననుసరించి యుద్ధాన్ని చిహ్నప్రాయంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. సాయుధరక్షణలో నమ్మకంలేని ఇలాంటివారికి అధికారాన్ని వప్పగించడం ప్రమాదకరమని ప్రచారంచేయగల అవకాశం సామ్రాజ్యవాదులకీవిధంగా లభించింది.

ఈ పరిమిత సత్యాగ్రహాన్ని నడపిన గాంధీజీయే బ్రిటిష్‌వారి వైఖ రిని వ్యతిరేకించ నారంభించాడు. కాలంగడచినకొద్దీ వారు వట్టి ఊహా గానాల్లో పడసాగారు.

"ఈ యుద్ధంలో ఏ ఒక్కపక్షానికీ సంపూర్ణవిజయం చేకూరదని గత 12 మాసాల్లోనూ నేను చెబుతూ వచ్చాను. రెండుపక్షాలూ పూర్తిగా అలసిపోయినప్పుడు సంధిచేసుకుంటాయి, కాని యిది నా ఊహామాత్రమే. (హరిజన్ 1942 జూన్ 7)

యుద్ధరంగంలో ఉన్న రెండుపక్షాల్లో మంచిచెడ్డలాయనకేమీ కన పడలేదు. అందువల్ల యుద్ధంపట్ల తటస్థవైఖరి నవలంబించాలనీ, చిహ్న ప్రాయంగా వ్యతిరేకతను కనుపరుస్తూ రావాలనీ, ఆయన నిర్ణయించారు:

రెండుగుంపులు—రెండుపంథాలు

సర్దార్ పటేల్, రాజేంద్రప్రసాద్, ఆచార్య కృపాలని, డాక్టర్ ప్రఫుల్లఘోష్‌గార్లు మరికొందరు గాంధీజీతో ఏకీభవించారు. వర్కింగు కమిటీలోని తటస్థగ్రూపు ఇదే.

ఈ వైఖరి సారాంశమేమిటి?

“దేనితోనూ చేతులు కలుపవద్దు; రెండింటితోనూ సహాయ నిరాకరణే. వైఖరిలో ఎలాంటి మార్పు అవుసరంలేదు”— ఇదీ దీని సారాంశము.

రెండవగ్రూపు నాయకుడు నెహ్రూపండితుడు, మౌలానా అజాద్, పండిత పంతు, అసఫాలీలు ఈ గ్రూపులోనివారు. యుద్ధంలో సరాసరి జోక్యం కలిగించుకోవద్దు అని ఈ గ్రూపు వైఖరి. కాని, ఈ గ్రూపు దృక్పథంవేరు. “సోవియట్ యూనియన్, చైనా ఉన్నపక్షం అభివృద్ధికర పక్షము; వారికీ మనకూ సమాన ఆశయాలున్నాయి, ఆ పక్షంపట్ల మనం సానుభూతి వహించాలి. కాని, మనకు స్వాతంత్ర్యం లభించేవరకు యుద్ధంలో పాల్గొనలేము.”— ఇదీ దీని దృక్పథము.

ఈ వైఖరి సారాంశ మేమిటి ?

“యుద్ధంలో పాల్గొనాలనే మా వాంఛకూడాను. కాని. స్వాతంత్ర్యం వచ్చిన తరువాతనే పాల్గొంటాము.”

ఏపంథా అవలంబించాలా అని బార్డోలీలో దీర్ఘ చర్చలు జరిగాయి. చివరకు రెండవగ్రూపుకే అవకాశం యివ్వడానికి అంగీకరించారు. ఫాసిస్టు వ్యతిరేకపక్షంతో చేరి ప్రపంచ యుద్ధంలో పాల్గొనడంకోసం బ్రిటిష్‌వారితో ఒడంబడిక కుదుర్చుకోవాలి అనేవారి విధానం ఎంతవరకు ఆచరణీయమో పరీక్షించాలని నిర్ణయించారు. యుద్ధంలోని అభివృద్ధికర పక్షంపట్ల నైతిక సహకార భావాన్ని మొదటిగ్రూపుకూడా ప్రకటించింది. సోవియట్, చైనా ప్రజలను అభినందిస్తూ ఒక తీర్మానంకూడా ఆ సమావేశంలో చేశారు.

బ్రిటిషు ప్రభుత్వ వైఖరి మారకపోయినప్పటికీ, ప్రపంచంలో నేడేర్పడిన నూతన పరిస్థితులను, దేశాన్ని నేడెదుర్కొంటున్న తీవ్ర ప్రమాదాన్నిబట్టి మీ ధోరణి మార్చుకోవలసిన అవుసరం కలిగిందని మీ ప్రధాన తీర్మానంలో ప్రకటించారు. “దురాక్రమణకు గురి అయి, తమ స్వాతంత్ర్యాన్ని దక్కించుకోడానికి యుద్ధంచేస్తున్న ప్రజలపట్ల కాంగ్రెస్ తన సానుభూతినంతా చూపాలి” అని మీరు తీర్మానంలో అన్నారు. యుద్ధంలోని అభివృద్ధికర పక్షంపట్ల బేషరతుగా మీ నైతిక సహకారాన్ని ప్రకటించారు. కాని, “దేశరక్షణకోసం జాతీయశక్తులను సమీకరించడం స్వాతంత్ర్యం వస్తేనేగాని సాధ్యంకాద”నికూడా ప్రకటించారు. దేశ

స్వాతంత్ర్యాన్ని అంగీకరిస్తే యుద్ధంలో పాల్గొంటామని వాగ్దానం యివ్వడమే దీని అర్థం.

అయితే జాతీయ ప్రభుత్వం యేర్పడేలోగా మేమికావాలి ? ప్రభుత్వంపట్ల అవిశ్వాసము, వైరభావాలతో దేశం నిండిపోయివుంది; ఈ పరిస్థితిలో బ్రిటిష్‌వారి వట్టి వాగ్దానాలు యేమీ పనిచేయవని మీ తీర్మానం స్పష్టంచేసింది. “ఫాసిస్టు నియంతృత్వానికి యేమాత్రం తీసిపోని, సామ్రాజ్యవాదంతో బానిస భారతదేశం ఇచ్ఛాపూర్వకంగా సహకారం చేయజాలద”ని తెలిపింది. ప్రమాదానికి గురిఅయింది మనదేశమే అని బార్డోలి తీర్మానం స్పష్టంచేసింది. కాని ఆ ప్రమాదాన్ని తొలగించడానికి జరుగుతూన్న యుద్ధంమాత్రం పరాయివారిదట. అధికారం హస్తగతమయేంతవరకు దేశరక్షణకోసం ప్రజల్ని ఉత్తేజపరచలేమని ప్రకటించింది.

దానితోపాటే బార్డోలి సమావేశం మరొకపనికూడా చేసింది. బొంబాయి ఏ. ఐ, సి. సి. సమావేశంలో గాంధీజీపై పెట్టిన బాధ్యతను తొలగించింది. కావాలనుకుంటే వాక్స్వాతంత్ర్యం కోసం ఆయన సత్యాగ్రహోద్యమం సాగించవచ్చునని తెలిపింది. గాంధీతత్వవాదులయిన సర్దార్ పటేల్, రాజేంద్రప్రసాద్ మొదలైన నలుగురు సభ్యులు బార్డోలి తీర్మానాన్ని వ్యతిరేకించారు.

కాంగ్రెసువాదు లందరూకూడా ఈ తీర్మానాన్ని తృణీకరించవలసిందని కోరుతూ ఈ నలుగురూ ఒక ప్రకటనకూడా చేశారు. కాంగ్రెసువాదులను తన దృక్పథానికిమార్చడానికి సర్దార్ పటేల్ స్వయంగా కృషిచేశారు. గుజరాతురాష్ట్ర కాంగ్రెసుకమిటీని సమావేశపర్చి గాంధీగారిని అందులో ఉపన్యసించమని కోరారు. బార్డోలీ తీర్మానాన్ని గాంధీజీ ఈవిధంగా వ్యాఖ్యానించారు:

> “ఈతీర్మానంయొక్క భావమిది: యుద్ధానంతరం సంపూర్ణ స్వాతంత్ర్యం ఇస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసినట్లయితే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని చిరస్థాయిగా చేయడానికి కాంగ్రెస్ కృషిచేస్తుందన్నమాట ఇలాంటిబేరం అచ్చంగాజరిగిందనికాదు. బేరంయొక్క షరతులను అప్పుడే నిర్ణయించుకొన్నారు. అసలు ఎలాంటిబేరం పెట్టుకోవడమే ఇష్టంలేనట్లయితే, ఆసంగతి స్పష్టంచేసి వుండవలసింది.” (హరిజన్—1942 జనవరి 18)

ఆ సమావేశంలో 36గురు రాష్ట్రకమిటీ సభ్యులు బార్డోలీ తీర్మానానికి అనుకూలంగాను 27గురు ప్రతికూలంగాను వోటుచేశారు.

ఈవిధంగా ఏర్పడినచీలికను తొలగించడానికి వార్ధా ఏ. ఐ. సి. సి. సమావేశంలో గాంధీజీ స్వయంగా జోక్యం కలిగించుకొన్నారు. బార్డోలీ తీర్మానానికి తనగ్రూపు (మొదటిది) కూడా బద్ధులే అని రాజేంద్రబాబు ప్రకటించారు. ఈ ప్రకటన చేస్తూ ఆయన ఇలాఅన్నారు.

"ఈసమయంలో దేశాన్ని యుద్ధంలో ఇరికించడం రాజకీయంగా పొరపాటనుకుంటాను. ఈ యుద్ధంలోచేరి శత్రువును సాయుధంగా ఎదుర్కోవలసి ఉంటుందని ఈతీర్మానం సూచిస్తుంది. అది మన దేశానికి క్షేమకరంకాదు...... ఈ తీర్మానం చేసినంతమాత్రాన వెంటనే ఆయుధాలు పట్టవలసివుంటుందని మేమనుకోము, బ్రిటిష్ ప్రభుత్వం భారత స్వాతంత్ర్యాన్ని అంగీకరిస్తు ఒక ప్రకటనచేసి పరిపాలనను ప్రజాప్రతినిధులకు వప్పగించిననాడే ఇదిసాధ్యమవుతుంది. అది ఈనాడు జరిగే జాడలేవీలేవు"

(టైమ్సు ఆఫ్ ఇండియా — 1942 జనవరి 17)

బార్డోలీ తీర్మానంపట్ల తమ గ్రూపుయొక్క ఆక్షేపణ రాజకీయమేననీ; బ్రిటిష్‌వారితో ఒడంబడిక కుదిరే అవకాశం కలిగించడానికే తమ ఆక్షేపణను ప్రస్తుతం దిగమింగామనీ రాజేంద్ర ప్రసాద్ సుస్పష్టంచేశారు.

చివరకు ఎలాగైతేనేం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్ని ఏకముఖంగా ఎదుర్కొని, ఒడంబడికకు దిగివచ్చేలా చేయడానికి రెండు దృక్పథాలవారు నిర్ణయించుకొన్నారు.

అప్పటినుంచీ ఒడంబడిక కోసం మీనమేషాలు లెక్కపెడుతూ కాచుకూర్చోవడం ప్రారంభమయింది.

క్రిప్సు రాక - తప్పుఅంచనా

డిసెంబరు 1941 మొదలుకొని మార్చి 1942 లోగా పరిస్థితులు శరవేగంతో మారుతూ వచ్చాయి. మలయా, సింగపూరులు శత్రువశమయిపోయాయి. జపానుమూకలు బర్మాలో జొరబడ్డాయి. 1942 మార్చి

ప్రారంభంలో రంగూన్ పడిపోయింది. మార్చి నెలాఖరున క్రిప్సు మన దేశానికి వచ్చాడు.

ఈ ఘటనలన్నీ ఇండియాకు ప్రమాదాన్ని మరింత తీవ్రం చేశాయి. అయినప్పటికీ పరిస్థితులు విషమిస్తున్నకొద్దీ బ్రిటిష్‌వారే ఒడంబడికకు దిగివస్తారు; మన మేమీ చేయనక్కర్లేదనే పాత దృక్పథంతోనే ఇంకా వ్యవహరింప సాగారు. ఒకవైపు నాయకులిలా ఒడంబడిక కోసం ఎదురుచూస్తూ కూర్చుంటుంటే అటు ప్రజలు జపాను విజయాలకు బాహాటంగానే సంతోషాన్ని ప్రదర్శింప నారంభించారు. బ్రిటన్ పూర్తిగా ఓడిపోతుందని ఎదురు చూడసాగారు.

1942 జులై 16 న నెహ్రూగారిలా అన్నారు :

"గత మూడు నాలుగు నెలలుగా దేశంలో స్పష్టంగా వెల్లడవుతున్న జపాను అనుకూల భావాలను అరికడుతూ వస్తున్నాం. అది నిజంగా జపాను అనుకూలతత్వం యెంతమాత్రంకాదు. బ్రిటిష్‌వారిపై ప్రజల్లోవున్న ద్వేషం పెచ్చుపెరిగి. ఈవిధంగా వారిని జపానువారివైపు మొగ్గజేస్తూవుంది. భారతదేశం నిస్తబ్దత చెందాలని మా అభిలాషకాదు. జపానువారితో సంధినిగురించి ఊహించడం పిచ్చిభ్రమ;"

(గాంధీ ఫాసిస్టు వ్యతిరేకి - ఇంగ్లీషు - 93 వ పేజీ)

ఇలాంటి పరిస్థితుల్లో క్రిప్సు ఇండియాకు వచ్చాడు. ఆయన ఇండియాకు వచ్చింది యెందువల్ల ? ఫాసిజాన్ని వ్యతిరేకిస్తూ మీరు చేసిన ఉత్తేజకర ఉపన్యాసాలూ, జపాను ప్రతికూల పోరాటంలో కోట్లకొలది భారతీయుల్ని సమీకరించడానికి మీరు కనబరచిన సంసిద్ధతా, బర్మా, మలయాల్లో సామ్రాజ్యవాదులు ప్రదర్శించిన అవక తవకలూ, బ్రిటన్, అమెరికాల్లోని ప్రజాస్వామిక వర్గాలను కదిల్చాయి: వారి ఆందోళనకు తట్టుకోలేకే చర్చిలు క్రిప్సును రాయబారం పంపాడు.

ఈ విషయంలోకూడా మీరు తప్పుగానే అంచనావేశారు. చర్చిల్ క్రిప్సును పంపడంమాత్రమే మీరు గుర్తించారు. దానికి కారణభూతమైన అంశాలను చూడలేదు. బ్రిటిషువారు క్లిష్టపరిస్థితిలో చిక్కుకున్నారనీ, గత్యంతరంలేక భారతీయుల సహాయాన్ని అర్ధించడానికి వచ్చారనీ అంచనావేశారు. మీలో చాలామందికి క్రిప్సు చిరకాలమిత్రుడు. అలాంటతను వచ్చాడు కాబట్టి పరిష్కారం తప్పదని అనుకున్నారు.

కాని, మేము మాత్రం అలాంటి వెర్రిఆశలేమీ పెట్టుకోలేదు. బ్రిటిష్ ప్రజల వత్తిడివల్ల క్రిప్సు రావలసివచ్చినప్పటికీ, అతనిపై పెత్తనం చేస్తున్నది మాత్రం చర్చిలే అన్నవిషయాన్ని మేము మరచిపోలేదు. ప్రజలు ముందుగా జాగ్రత్తపడి కంతలన్నిటినీ పూడ్చేయకపోతే, పాలకవర్గంఅనే పందికొక్కు ఎలాంటి క్లిష్టపరిస్థితిలో నుంచయినా తప్పించుకు పోగలదని లెనిన్ చెప్పాడు. కమ్యూనిస్టులం ఈమాటల నెల్లప్పుడూ మనసులో ఉంచుకుంటాం. రాజకీయపుటెత్తుగడల్లోను, వంచకత్వంలోను బ్రిటిష్సామ్రాజ్యవాదులు మూడుశతాబ్దాల అనుభవంతో పండిపోయారన్న సంగతి మాకు బాగా తెలుసు.

అందువల్లనే, కాంగ్రెసు, లీగులు తమలోతాము ముందుగా వొడంబడిక కుదుర్చుకోవాలని ఆనాడు మేము ఎలుగెత్తి చాటాము. ఇరువురినీ, ఎదుర్కొంటున్నది ఒక్కటే ప్రమాదం; బ్రిటిష్వారు అధికారాన్ని వదులుకొనేలా చేయాలనే ఇరువురి వాంఛకూడాను. అందువల్లనే ఈరెండు ప్రధాన సంస్థలూ, క్రిప్సును ఏకముఖంగా ఎదుర్కోవాలని మేము కోరాము.

కాని మీ కా దృష్టి లేకపోయింది. మీ అంతట మీరే పరిష్కారం కుదుర్చుకోగలమనే ధీమాతో బయలుదేరారు.

క్రిప్సుతో చాలా సబబుగా వుండాలనీ, పరిష్కారం కుదరడానికే అన్నివిధాల ప్రయత్నించాలనీ, మీరు నిశ్చయించుకొన్నారు. అంతేగాని మీ స్వంత అన్నదమ్ములతో ఒప్పుదలకు వద్దామనే ఆలోచనే మీకు అక్కరలేకపోయింది, సమాన ప్రమాదాన్నెదుర్కోడానికి స్వంత అన్నదమ్ములయిన ముస్లింలతో చేతులు కలపడానికే మీకింత కష్టంగావుంటే, అన్ని విషయాల్లోనూ మనతో భేదించే బ్రిటిష్పాలకులు మనకు అధికారాన్ని వప్పగించడానికి ఎందుకంగీకరిస్తారు?

ముస్లింసోదరులను లెక్కజేయక మీరు క్రిప్సుతో బేరాలు సాగించారు. బ్రిటిష్ ప్రభుత్వం అతన్ని వెనక్కి రమ్మంది. క్రిప్సు రాయబారాలను చాలించాడు.

తన సంప్రదింపులు యీ అవలక్షణాలతో సాగినందుకు క్రిప్సు మురిసిపోయాడు.

బ్రిటిష్వారి నిజాయితీని శంకించడానికి వీలులేదని రుజువయిందని ప్రకటనలు చేశాడు. అనేకమంది నాయకులు వేరువేరు సమావేశాల్లో

తనను కలుసుకోడానికి వచ్చారన్నాడు. కాని, పాపం ఒక్కసారి కూడా తమలో తాము కూడబలుక్కోడానికి ప్రయత్నించలేదని మొసలి కన్నీళ్లు కార్చాడు.

మెజారిటీ జాతియొక్క నియంతృత్వాన్ని స్థాపించడానికే కాంగ్రెస్ ఉవ్విళ్లూరుతున్నదనే నీచమైన నిందను మీ తలపై వేశాడు.

రాయబారం చెడి పోయినప్పటికీ, భారత రాజకీయ నాయకులు ఇండియా రక్షణకు అనధికారరీత్యా చేయగల సహాయమంతా చేస్తారనే నమ్మకం తనకు కలిగిందన్నాడు.

"ఇండియా ప్రభుత్వంలో భాధ్యతలను పుచ్చుకోడానికి ఈ నాయకులు ప్రస్తుతం అంగీకరించక పోయినా, భారతదేశ రక్షణకు అనధికార రీత్యా చేయగల సాయమంతా తప్పకుండాచేస్తారు." (బొంబాయి క్రానికల్ 1942 ఏప్రిల్ 23)

మొదటిదశలో లిన్‌లిత్‌గో గాంధీజీకీ ఆశ్చర్యం కలిగించాడు. ఈ దశలో క్రిప్సు నెహ్రూని దిగ్భ్రాంతుని చేశాడు. అతిక్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకున్న సామ్రాజ్యవాదులు ఈ విధంగా సంప్రదింపులను భగ్నం చేయ గలుగుతారని మీరు కలలోనయినా అనుకోలేదు. అందులోనూ అక్షరాజ్యాలు విజయ పరంపరలను సాధిస్తున్న ఆ దశలో వీరలాంటి ఆత్మ వినాశకరమైన చర్య నెన్నటికీ తీసుకోరని మీలో అనేకులు బల్లగుద్ది వాదించారు. క్రిప్సు కరాచీవరకే వెళ్ళి మళ్ళా వస్తాడనీ; ఒకవేళ అంతకన్నా దూరంవెళ్ళినా, కెయిరోనుంచే తిరిగి వస్తాడనీ మీలో అనేకులు వ్యక్తిగత సంభాషణలో అన్నారు.

డిశంబరు నుంచి ఏప్రిల్ వరకు కాంగ్రెసు విధానాన్ని నడిపిన గ్రూపుకే నాయకుడయిన నెహ్రూకిక ఏమీ పాలుపోలేదు. భారత ప్రజల్ని రెచ్చగొట్టడమే సామ్రాజ్యవాదుల విధానమని ఆయన కొద్దికొద్దిగా గ్రహింపసాగారు. అలాంటి పన్నాగంలో పడిపోవద్దు సుమా అని హెచ్చరించారు. 1942 ఏప్రిల్ 12 వ తేదీని పత్రికా ప్రతినిధుల సమావేశంలో ఇలా అన్నారు ;

దేశాన్నెదుర్కొంటున్న సమస్యలు చాలా తీవ్రమైనవి. బాధ్యతగలవారెవ్వరూ వాటిని గురించి చులకనగానూ, ఆ యా ఘటనవల్ల కలిగే ఆవేశంలో పడిపోయి మాట్లాడకూడదు. మనం ఆవేశంలో పడి కొట్టుకుపో

గూడదు, అందువల్ల విచక్షణాజ్ఞానం దెబ్బతింటుంది." (బొంబాయి క్రానికల్ — 1942 ఏప్రిల్ 13)

రెండు గొంతులు

కాంగ్రెసు వర్కింగ్ కమిటీలోని రెండు గ్రూపుల మధ్య తాత్కాలికంగా ఏర్పడిన ఏకీభావం ఒక సన్నని, ఒక పల్చని తెరలాంటిదే. క్రిప్సు రాయబారం భగ్నమవడంతో విభేదాలు బయిటికి పొక్కాయి. వర్కింగ్ కమిటీలో మళ్లా రెండు గొంతులు వినిపింపసాగాయి.

బ్రిటిష్‌వారితో జోక్యం లేకుండానే స్వతంత్రంగా జపానువారిని ప్రతిఘటించే సన్నాహాలు చేయాలని నెహ్రూగారు సూచించారు. "స్వతంత్ర భారతదేశంగా మనంతట మనం యుద్ధకృషిని సాగించగల మార్గాలనాలోచించా ల"న్నారు.

ఆయన ఇలా అన్నారు :

"ఆత్మరక్షణ, స్వయంపోషణ కార్యక్రమాలను పూర్తిగా కొనసాగించ వలసిన విధి ప్రతి కాంగ్రెసు వాదిపైన, ప్రతివారిపైన వుంది. గెరిల్లా పోరాటంకూడా ప్రారంభించవలసి వుంటుంది. ఇంతకూ కాంగ్రెసు ఏమినిర్ణయిస్తుందో నేను చెప్పలేను. — అందరికీ నా సలహా ఏమంటే — శత్రువుకి లొంగిపోవద్దు; వాళ్లకేమీ సప్లయి చేయవద్దు; పూర్తిగా సహాయ నిరాకరణ చేయండి; వీలయిన అన్నివిధాలా వాళ్లను ముప్పుతిప్పలు బెట్టి మూడు చెరువులనీళ్లు త్రాగించండి. మిగిలిన యుద్ధమంతా సేనలే చేస్తాయి." (బొంబాయి క్రానికల్ — 1942 ఏప్రిల్ 13)

బయటనుంచి కలిగిన జపాను ప్రమాదాన్ని ఎదుర్కొడానికి స్వతంత్రంగా ఎదుర్కొవాలని నెహ్రూగారు సూచించారు. దేశంలోని ఐక్యతా సమస్యను పరిష్కరించడానికి రాజాజీ ప్రయత్నించారు. పాకిస్తాన్ కోరికను బహిరంగంగా బలపరిచారు రాజాజీ. 'వేరే గత్యంతరంలేదు కాబట్టి' పాకిస్థాన్నంగీకరించి. లీగుతో ఐక్యమత్యం కుదుర్చుకోవాలని కాంగ్రెసును కోరారు. ఈ కాలకూటాన్ని మింగగల శక్తి ఒక కాంగ్రెసుకే ఉందన్నారు.

గాంధీజీ నాయకత్వంక్రింద ఉండిన తటస్థగ్రూపు (మొదటిది) ఈ స్వతంత్ర కార్యక్రమసూచనల్ని వ్యతిరేకించింది. ఈ విషయమై గాంధీజీ ఇలా రాశారు.

"అందువల్ల, జవహర్లాల్ రాజాజీగార్లు మనపవిత్ర మూలసూత్రాలకే విరుద్ధంగా పోతున్నందుకు నేను ఆందోళన చెందడం లేదు. వీరి ప్రయత్నాలు నిష్ఫలంకాక తప్పదు. అప్పుడు ద్విగుణీకృత దీక్షతో వీరు అహింసా మార్గానికి వస్తారు."
(హరిజన్—1942 ఏప్రిల్ 26)

దీనిభావం సుస్పష్టమే. తమ పరిష్కార ప్రయత్నాలన్నీ విఫలమయాయి. కాబట్టి రెండవగ్రూపుకూడా సంపూర్ణతాటస్థ్యానికి అంగీకరించి మొదటిగ్రూపు నాయకత్వాన్ని శిరసావహిస్తుందని దీనిభావం. గాంధీగారే ఇలా అన్నారు.

"యుద్ధంతో అధికారరీత్యా ఏలాంటి సంబంధం లేకుండానే బ్రిటిషువారికి హింసాపద్ధతుల్లో తోడ్పడడం —అందులోనూ క్రిప్సురాయబారాలు విఫలమైనతరువాత అలాచేయడం దేశానికి తలవంపులు తేవడమే అవుతుంది." (హరిజన్—136వపేజీ 1942 ఏప్రిల్ 26.)

ఈవిధంగా. క్రిప్సురాయబారాలు భగ్నంకాగానే వర్కింగ్‌కమిటీ రెండుగొంతులతో పలకసాగింది. 1942 ఏప్రిల్‌లో జరిగిన అలహాబాద్ ఏ. ఐ. సి. సి. సమావేశంలో ఈరెండు దృక్పధాలు ఒకదానొ్నకటిని ఎదుర్కొన్నాయి. కాని, మళ్ళా మీరు ఏదోఒకవిధంగా ఏకీభావాన్నే ప్రదర్శించాలనుకున్నారు. ఈఉద్దేశంతో రాజీకివచ్చారు. యుద్ధంపై మీరుచేసిన తీర్మానంలో ఈవిషయం వెల్లడయింది.

"భారతదేశానికి స్వాతంత్ర్యం ఉన్నట్లయితే తన పాలసీని తానే నిర్ణయించుకునేది; యుద్ధంతో జోక్యం కలిగించుకోకపోయేది కూడా ఏ పరిస్థితుల్లోను కూడా కాంగ్రెసు సానుభూతి అంతా దురాక్రమణకు బలి అయిన ప్రజలపైపే ఉండేది"

ఈతీర్మానం రెండుగ్రూపుల మధ్యరాజీభావంతో చేసుకున్న తీర్మానమే అని నెహ్రూ పండితుడు బహిరంగంగా ఒప్పుకున్నారు.

ఆయన ఇలా అన్నారు :

"రెండు దృక్పధాలకు సామరస్యం కుదుర్చుతూ మా మార్గాన్ని నిర్ణయించుకోవలసి వుంది. ఒకవైపు బ్రిటన్‌తో వున్న విభేదాలు.

మరోవైపు జపాను అన్నా, అక్షరాజ్యాల విజయం అన్నా మాలో కొందరికి గల భయం" (బొంబాయి క్రానికల్—1942 మే 2)

అలహాబాదు ఏ. ఐ. సి. సి. సమావేశంలో బ్రిటిష్ ప్రభుత్వంమీద పిడుగులు కురిపిస్తూ ఉపన్యాసాలు సాగించారు. "బ్రిటన్‌తో ఒడంబడిక కోసం మేమిక ప్రయత్నించం" అన్నారు: జిన్నాపైని, లీగుపైని కత్తి ఝులిపించారు. ప్రజలంతా మావెనుక ఉన్నారు కాబట్టి బ్రిటిష్ ప్రభుత్వం లొంగిరావాలి, లీగు చేతులుజోడించి రావాలి అనే మితిలేని ధీమాను ప్రదర్శించారు.

మాటల్లో ఇంత గాంభీర్యంఉన్నా, భావాల్లో ఎక్కడలేని అధైర్యం కనబడింది.

ఆ సమావేశంలో ప్రధానతీర్మానాన్ని పండితపంతు ప్రవేశపెట్టారు. ఆయన ఈవిధంగా మాట్లాడుతూంటే ఎంతో జాలివేసింది.

"యుద్ధంలో దేశాన్ని రక్షించవలసిన పద్ధతివేరు. మన ఆత్మ గౌరవానికి అనుగుణ్యమైన అవకాశాన్నేగాని ఇచ్చినట్లయితే మనదేశాన్ని మనం కాపాడుకొని ఉండేవారమని నా నమ్మకం. ఈనాడు మన మాపని చేయలేక పోతున్నామంటే ఆదోషం బ్రిటిష్‌వారిదే. వారు మనల్ని గౌరవంగా బ్రతకనయినా బ్రతకనివ్వకుంటున్నారు. మర్యాదగా చావనయినా చావనివ్వకుంటున్నారు." (మా షార్టుహ్యాండు విలేఖరి నోట్సునుండి.)

మా వైఖరి

జాతికి నాయకులనిపించు కుంటున్నవారే ఈవిధంగా మాట్లాడడం ఏ. ఐ. సి. సి. కమ్యూనిష్టు సభ్యులమైన మాకెంతో బాధ కలిగించింది. "మన ప్రజల దేశభక్తిని ప్రజ్వలింపజేసి, జపానుమూకల్ని ప్రతిఘటించి, మన ఇళ్ళువాకిళ్ళను, భారతమహిళల శీలాన్ని, భారతదేశాన్ని కాపాడేలా చేయబూనుకుంటే ఏశక్తి మనకు అడ్డుపడగలదు?" అని మా ఆవేదనను వెలిబుచ్చాము. ఆసమావేశంలో డాక్టర్ అష్రాఫ్ ఇలా అన్నాడు:

"నాయకుల మాటలు వింతగావున్నాయి; ఓటమితత్వంతో నిండివున్నాయి, ఇటూ అటూ అగాధాలమధ్య సన్ననిబాటపై నున్నాం—ఎట్టఎదుట మృత్యువు' అని మౌలానాగారు మాట్లాడు

తున్నారు. బ్రిటిష్‌వారు భారతదేశాన్ని మనమాతృదేశంగా ఎంచనీయకుంటున్నారని వీరంటున్నారు. నాయకత్వం వహించి, దారి చూపవలసినపద్ధతి ఇదికాదు. దేశాన్ని మృత్యువువాత బడకుండా సజీవంగా నిలబెట్టడానికి కాంగ్రెసు పూనుకోవాలి. ఐక్య ప్రజాసంఘటనను నిర్మించండి; తద్వారా బ్రిటిష్‌వారు పరిష్కారానికి దిగివచ్చేలా చేయండి.—ఇదే మా నినాదం." (మాషార్టుహ్యాండు విలేఖరి రిపోర్టు)

ముస్లింలీగుతో ఐక్యతాసమస్యపై రాజాజీసూచనను నెహ్రూపండితునితో సహా అందరూ వ్యతిరేకించారు.

ఇటీవల కొన్నిసంవత్సరాలనుండి నెహ్రూపండితునిలో ఒకలక్షణం కనబడుతూంది: కొరకరానిసమస్య వచ్చినప్పుడల్లా ఆయన పరిష్కార మార్గాన్ని కనిపెట్టడానికిబదులు, ఎక్కడలేని కోపం తెచ్చుకుంటున్నారు. ఈధోరణిలోనే ఆసమావేశంలో ఇలా అన్నారు.

"భారత దేశంలో పుట్టి పెరిగి భారత దేశంకోసం సేవచేసిన ప్రతివారికీ ఈ పాకిస్థాన్ దృక్పథం బాధ కలిగిస్తుంది. ఇది నా నాటికీ భరింపరాని దవుతూంది. భారత స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించే వారైతేనే తప్ప, బుద్ధివున్నవారెవరూ పాకిస్థాన్ న్యాయమైన కోరిక అని అనరు."

(బొంబాయి క్రానికల్ — 1942 మే 3)

ఆరోజుల్లో మా పార్టీపై నిషేధం ఉంది. అయినప్పటికీ, "జపాను వ్యతిరేక ప్రజా ప్రతిఘటనకోసం జాతీయైక్యత" అనే శీర్షికతో చిత్తు తీర్మానం తయారుచేసి మా దృక్పథాన్ని ఏ. ఐ. సి. సి. సభ్యులకు తెలియజేసాం. అంతేకాకుండా ఏ. ఐ. సి. సి. సభ్యులకొక విజ్ఞప్తిని రహస్యంగా అచ్చువేయించి సమావేశంలో పంచిపెట్టించాం: దేశాన్నెదుర్కొంటున్న తక్షణ కర్తవ్యాలను గురించి ఇలా అన్నాం:

"వాస్తవిక పరిస్థితులకు పనికిరాని పాత సిద్ధాంతాలను. పాత అపోహలను మూలబెట్టి ఆచరణయోగ్యమైన నూతన పంథాను నిర్ణయించుకోవడం మన తక్షణ దేశభక్తియుత కర్తవ్యం. దేశంమీదికొస్తున్న శత్రువును ప్రతిఘటించడానికి జాతీయశక్తుల నన్నిటిని సమీకరించగల చొరవను కాంగ్రెసుకు ఇచ్చేదిగా వుండాలి కొత్తపంథా. శత్రువుపై దెబ్బతీసే ప్రతి చర్యను. ప్రజలకు క్షేమంకూర్చే ప్రతి ప్రయత్నాన్నీ – అవి ప్రజల కృషి

అయినాసరే ప్రభుత్వమూ, సైన్యమూ చేసిన కృషిఅయినాసరే — వీటి నన్నిటినీ కాంగ్రెసు ఏకత్రాటివి నడిపించి, సమన్వయ పరచాలి."

(ఏ. ఐ. సి. సి. కమ్యూనిస్టుల చిత్తు తీర్మానం.)

మా వైఖరి మొదటినుంచీ స్పష్టంగానూ, ఏకతీరుగాను. వాస్తవిక పరిస్థితుల కనుగుణ్యంగాను ఉన్నదని మీరు గ్రహించగలరని ఆశిస్తున్నాం. లీగు విషయంలో పాత అపోహలను తొలగించుకున్నాం; పాత అహింసా సిద్ధాంతాలను, వెనుకటి సహాయనిరాకరణ పద్ధతులను దాటి ముందుకు నడిచాం. స్వయం నిర్ణయసూత్రానికొక విస్పష్టమైన నిర్వచనను ఏ. ఐ. సి. సి. ఎదుట పెట్టాం. భారతదేశంలోని వివిధజాతులకు స్వతంత్రరాజ్యాల నేర్పరచుకొనే హక్కుఉన్నదనీ, ఈవిధంగా ఏర్పడిన ముస్లింరాజ్యాలకు ముస్లింప్రజలు కోరినట్లయితే భారతసమాఖ్యలోనుంచి విడిపోగలహక్కు-కూడా ఉన్నదని కాంగ్రెసు అంగీకరించాలని కోరాం. ఇలాంటి స్పష్టమైన ప్లానును మేమెలా సూచించగలిగాము? భారతదేశరక్షణే, స్వాతంత్ర్య సాధనకు మార్గమని మే మొక్కరమే గుర్తించాం. మాతృదేశ రక్షణకు ప్రజల్ని ఎంత ఎక్కువగా ఐక్యపరుస్తామో, దేశంపై బ్రిటిష్ సామ్రాజ్య వాదుల పట్టు అంతగా సడలిపోతుందని గుర్తించాము కాబట్టే, ఐకమత్యాన్ని స్థాపించడానికి పై ఉత్తమమార్గాన్ని సూచించగలిగాము.

మా సూచన కాంగ్రెసు కార్యవర్గంలోని రెండు గ్రూపులకు నచ్చలేదు. వర్కింగ్ కమిటి సమావేశంలో ఈ రెంటికీ అప్పుడే ఘర్షణ ప్రారంభమయింది.

రెండు గ్రూపులకూ ఘర్షణ

నిజానికి గాంధీగారి తటస్థవైఖరి 1942 ఏప్రిల్‌లో అలహాబాదులో జరిగిన వర్కింగ్‌కమిటీ సమావేశంలోనే 'క్విట్ ఇండియా' రూపం దాల్చింది. ప్రభుత్వం ప్రచురించిన 'అల్లరులకు కాంగ్రెసు బాధ్యత' అనే గ్రంథానికి ఈ సమావేశ చర్చలను అనుబంధంగా చేర్చారు. ఆ గ్రంథాన్ని మేమెంత అసహ్యించుకొంటున్నప్పటికీ, వేరే రికార్డేదీ లేకపోవడం వల్ల దానినుంచే ఇప్పుడు ఉదాహరణలు తీసుకోవలసి ఉంటుంది. ఈఅనుబంధంలోని విషయాలను మీరింతవరకూ కాదనలేదు కూడాను.

ఏ. ఐ. సి. సి. కోసమని గాంధీగారు ఒక చిత్తు తీర్మానాన్ని తయారుచేసి ఆ వర్కింగ్ కమిటీ సమావేశానికి పంపారు.

అందులో ముఖ్యాంశాలు :

1—"జపానుకు ఇండియాతో ఏలాంటి తగాదాలేదు. అదియుద్ధం చేస్తుంది. బ్రిటిష్ సామ్రాజ్యంమీదనే"

2. "భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చేస్తే మొట్టమొదటి చర్యగా బహుశా జపానుతో సంధి కుదుర్చుకోవచ్చు."

3. బ్రిటిష్‌వారు వెళ్లిపోయిన తరువాతనే మనదేశం జపాన్నిగాని, మరే దురాక్రమణ దారునిగాని, ఎదుర్కొని ఆత్మరక్షణ చేసుకోగలుగుతుంది.

4. "అందువల్ల బ్రిటిష్‌వారు ఇండియాను విడిచిపోవాలని ఏ. ఐ. సి. సి. భావిస్తుంది."

5. ఒకవేళ జపాను మన దేశంమీదికి వస్తే మనం అహింసా పద్ధతుల్లో దానికి సహాయ నిరాకరణ చేయాలేగాని, దాసోహం అనకూడదు,

6. బ్రిటిష్‌వారికికూడా క్రియా రూపంగా ఎలాంటి సహాయమూ చేయకూడదు.

7. మనం బానిసలుగా మాత్రమే తమకు తోడ్పడాలని బ్రిటిష్‌వారి అభిప్రాయము — ఇందుకు మన మెన్నటికీ అంగీకరించము.

8. మిలటరీరీత్యా అవసరమైనప్పుడు యుద్ధ సామగ్రిని ధ్వంసం చేయడం మినహా భూదగ్ధ విధానాన్ని మరేవిషయంలోనూ అమలు జరుపకూడదు.

9—భారతదేశంలో విదేశ సైనికులుండడం భారతదేశ శ్రేయస్సుకి హానికరం కాబట్టి వారిని పంపివేయాలి.

(ప్రభుత్వం ప్రకటించిన ఇంగ్లీషు పుస్తకంలో 46—47 పేజీలు)

ఈ ధోరణిని నెహ్రూ వ్యతిరేకించారు. ఆయన ఇలా అన్నారు:

"జపానొక సామ్రాజ్యవాదదేశం ఇండియాను కబళించాలని దాని ఆశయం. బాపూజీ ధోరణినేగాని అనుసరిస్తే అక్షరాజ్యాల పన్నాగాలలో మనం పరోక్షంగా మనం భాగస్వాముల మవుతామన్నమాట. గత రెండున్నర సంవత్సరాలలో కాంగ్రెసు అవలంబించిన విధానానికి ఈ వైఖరి పూర్తిగా వ్యతిరేకం. మిత్రరాజ్య ప్రజలు మనం తమకు శత్రువుల మేమో అని అనుమానిస్తారు........ జపాను, జర్మనీ గెలుస్తాయని గాంధీజీ

అనుకుంటున్నారు. ఈ అభిప్రాయమే వారి నిర్ణయానికి కారణం. వారి ధోరణి నా ధోరణికి వ్యతిరేకం" (ఆ పుస్తకంలోనే 42—43 పేజీలు)

ఈ విషయమై జరిగిన చర్చల్లో రెండు పరస్పర విభిన్న దృక్పధాలు వెల్లడయాయి. ఏకీభావం ఉన్నవిషయాలకే ప్రాధాన్యతనిచ్చి విభేదాలను తగ్గించడానికి నెహ్రూపండితుడు శాయశక్తులా ప్రయత్నించారు. నెహ్రూ ఇలా అన్నారు.

1. ప్రభుత్వాన్ని ద్వేషించడంలోను;

2. దానికి ఏవిధంగాను సహాయం చేయలేమనే విషయంలోను మనకు అభిప్రాయ భేదాలులేవు. మనస్వయంపోషణ, ఆత్మరక్షణ కార్యక్రమం ఒకవిధంగా ప్రభుత్వానికి తోడ్పడుతుంది; దానికి మనమేమీ చేయలేము.

3. బ్రిటిష్‌వారి యుద్ధకృషికి అంతరాయం కలిగించాలని మనం కోరము. ఎందువల్లనంటే, అది శత్రువుకు తోడ్పడడమే అవుతుంది. ఈ మూడుఅంశాల్లోనూ మనకు అభిప్రాయభేదాలులేవు. కాని ఈ మూడు అంశాల్లోనూ వెల్లడవుతూన్న దృక్పధాన్ని ఆచరణలో పెట్టడంలోనే అభిప్రాయభేదాలు వస్తున్నాయి. గాంధీగారి దృక్పధంతో నేను భేదిస్తున్నాను కాబట్టి నేను ప్రాధాన్యతఇచ్చే విషయాలు కూడా వేరుగా వుంటాయన్నమాట నిజమే.

(ఆపుస్తకంలోనే 44వ పేజి)

ఏకీభావం ఉన్న విషయాలకు నెహ్రూగారు ప్రాధాన్యతనిస్తే, సర్దార్ పటేలుగారు భేదాభిప్రాయాలకు ప్రాముఖ్యతనిచ్చారు.

"యుద్ధం ప్రారంభమయిన దగ్గరనుంచి ఎలాగో ఒకలాగ ఏకబాటను పోవడానికి ప్రయత్నించాం. కాని అదియిక సాధ్యం కాకపోచ్చు. గాంధీజీ ఒకస్థిరనిర్ణయానికి వచ్చారు. వారి భావాలు కొందరికి సరిపడకపోతే ఆకొందరిభావాలు. మాకు సరిపడవు. మనోవాక్కాయకర్మలా నేను గాంధీగారినాయకత్వాన్నంగికరిస్తున్నాను. సర్వకాలసర్వావస్థలయందూ ఎలాంటి గడ్డుపరిస్థితుల్లో నయినా గాంధీగారు సరియైన మార్గాన్నే చూపుతారని నా విశ్వాసం. బొంబాయి ఏ. ఐ. సి. సి. రోజుల్లో అభిప్రాయభేదాలు తటస్థించాయి. అయినప్పటికీ రాయబారాలకు అవకాశం లేకుండా చేశాం. బార్డోలీ సమావేశంలో, పరిష్కారానికి కాంగ్రెసు తలుపు తెరచేవుంచిందని స్పష్టంచేశాం. మా సానుభూతిఅంతా మిత్రమండలివైపే ఉందని ప్రకటించాము. కాని, ఈ సద్భావానికి ప్రతిఫలంగా బ్రిటిష్‌వారు మనపై అవమానాలు కురిపించారు. ఇక ఏలాంటి రాయబారాలకు ప్రాకులాడకుండా తలుపులు బిగించవలసిన సమయం వచ్చింది. మనముందున్న గాంధీగారి చిత్తుతీర్మానంతో నే నేకీభవిస్తున్నాను. అందులో ఫాసిస్టు అనుకూలఛాయ ఏమైనా ఉంటే తొలగించండి.

ఇది దేశానికే ఒక పెద్దవిపత్తు. చరిత్రలో ఎన్నడూ ఎరుగని ప్రమాద పరిస్థితి దేశాన్నెదుర్కొన్న సమయంలో జాతీయ నాయకత్వమే అయోమయావస్థలో పడింది; భేదాభిప్రాయాలతో తగవులాడ సాగింది. చివరకు ఏమీ పాలుపోక అధ్యక్షుడు మౌలానా అజాదే ఇలా అనవలసి వచ్చింది.

మనస్థితి ఏమిటి? బ్రిటిష్‌వారిని వెళ్ళిపోమందామా? వెళ్ళిపోయి జపానువారికి, జర్మన్లకు అంతా విడిచిపెట్ట మందామా? లేక వారిని ఉండమని ఈ కొత్త దురాక్రమణను అరికట్టమందామా? (ఆ పుస్తకంలోనే 42 వ పేజీ)

నాయకుల్లోని కొన్ని అయోమయావస్థలకు కొన్ని ఉదాహరణలు:

"ఈదశలో ఇలాంటి అభిప్రాయభేదాలు వినాశకరం" — ఒరిస్సా నాయకుడు విశ్వనాథదాసు.

"మా రాష్ట్రమిప్పుడే విమాన దాడులకు గురిఅయ్యే పరిస్థితి వచ్చింది. సిద్ధాంత చర్చలకిది సమయంకాదు. అహింసాయుతమైన సహాయ నిరాకరణే మన తక్షణకర్తవ్యం. దానిమీదనే మన శక్తినంతటినీ, కేంద్రీకరిద్దాం"—అస్సాము నాయకుడు బార్డొలాయ్.

"ఈ చిత్తు తీర్మానం అక్షరాజ్యాలకు మనపై ఎలాంటి సదభిప్రాయమూ కలిగించదు. బ్రిటిష్‌వారిని పొమ్మనడంవల్ల ఎవ్వరికీ ప్రయోజనం ఉండదు."— అసఫాలీ.

"పరిస్థితు లన్నిటినీ సాకల్యంగా పరిశీలించి తయారుచేసిన చిత్తు తీర్మానమది. ప్రస్తుత పరిస్థితులకు ఎంతైనా ఇది తగివుంది. మన శక్తిని మనం గుర్తించవలసిన సమయ మాసన్నమయింది." — డాక్టర్ పట్టాభి శీతారామయ్య.

గాంధీజీ తీర్మానానికి పూర్తిగా సంతోషించింది వర్కింగ్ కమిటీ లోని ఇద్దరు కాంగ్రెసు సోషలిస్టు ప్రతినిధులు. కాని, తటస్థవైఖరి తామే విధంగా అర్థంచేసుకున్నారోకూడా బయటపెట్టారు.

అచ్యుత పట్వర్ధన్ ఈవిధంగా అన్నారు ;

"మిత్రమండలి గెలిచే సూచనలుంటే ఏమిచేయాలాఅని ఆలోచించ వలసి ఉండేది. కాని, ప్రస్తుతం బ్రిటన్ అగాధంలోకి దొర్లిపోతూంది. దేశంలో తటస్థ వాతావరణాన్ని నెలకొల్పాలి. అటు బ్రిటన్‌వంక చూడొద్దు; ఇటు జపానువంకా చూడొద్దు."

ఆచార్య నరేంద్రదేవ్ ఇలా అన్నారు; "హిట్లరు జర్మనీని ఓడించా లనుకోవడం నా కిష్టంలేదు."

అతుకులబొంతలాంటి ఐక్యత

దేశం ఎంత ఘోరప్రమాదంలో పడిపోబోతూందో ఈ విషయాలు కొంచెం గమనిస్తే చాలు, స్పష్టమవుతుంది. ఒకవైపు ద్వేషం, మరోవైపు అయోమయావస్థ. ఇంకోవైపు ప్రజలపై అవిశ్వాసం, వేరొకవంక క్లిష్ట సమస్య లెదుర్కొనేసరికి నిస్సహాయత వెలిబుచ్చడం—ఇదీ దేశానికి దారి చూపవలసిన నాయకవర్గంయొక్క స్థితి ఆనాడు.

ఆ సమావేశంలో ఏ సమస్యనూ పరిష్కరించలేదు. అభిప్రాయ భేదాలను తొలగించేదారి చూడలేదు. గాంధిగారి చిత్తుతీర్మానాన్ని రాజేంద్ర ప్రసాద్ ఆక్కడక్కడ సవరించారు; నెహ్రూ తనతీర్మానాన్నిసవరించారు- ఈవిధంగా ఒకరిభావాలకొకరు కొంతచోటివ్వడానికి ప్రయత్నించారు. కాని దృక్పధాల్లో భేదాలు చెక్కుచెదరలేదు. రాజేంద్రబాబు చిత్తుతీర్మానానికి (ఆయన చేతికొద్దిగా సవరించబడిన గాంధీగారి తీర్మానం.) అనుకూలంగా ఏడుగురు వర్కింగుకమిటీ సభ్యులూ, ప్రత్యేంగా ఆహ్వానింపబడిన వారిలో అయిదుగురూ, వోటుచేశారు. నెహ్రూగారి తీర్మానానికి అనుకూలంగా నలుగురు సభ్యులూ, ఇద్దరు ఆహ్వానితులూ వోటుచేశారు. రాజేంద్రబాబు తీర్మానాన్ని వర్కింగుకమిటీ ప్యాసుచేసింది.

దానితోనే నెహ్రూగారికి పట్టరానికోపం వచ్చిందన్న సంగతి అంద రికీ తెలిసిన విషయమే. మెజారిటీ సభ్యులునిర్ణయించిన పంధానుతీవ్రంగా వ్యతిరేకించారాయన. ఈ నాడు మమ్మల్నేమిటి చేస్తున్నాడో, ఆనాడు వాళ్ళనదే చేస్తానని బెదరించాడు. నాయకవర్గంలో ప్రతిష్టంభన ఏర్పడింది. అందువల్ల ఆనాటి సాయంత్రం అధ్యక్షుడు తిరిగి ఈ విషయాన్ని ప్రవేశ పెట్టాడు.

"ఉదయం రాజేంద్రబాబు చిత్తు తీర్మానాన్ని బలపరచిన వారిని ఆయన బ్రతిమలాడారు; నెహ్రూగారి తీర్మానాన్నే అంగీకరించి, దాన్నే ఏకగ్రీవంగా ప్యాసు చెయ్యమని కోరారు. ఈ రెండు చిత్తు తీర్మానా లకు ఏదో పెద్ద వ్యత్యాసం ఉందని రెండు పక్షాలవారూ అంటున్న ప్పటికీ. నిజానికి అట్టే భేదంలేదని అధ్యక్షుడు వాదించాడు. రాజేంద్రబాబు తీర్మానాన్ని బలపరిచినవారే అధ్యక్షుని కోరిక ననుసరించి నెహ్రూగారి చిత్తు తీర్మానాన్ని అంగీకరించారు. ఈ విధంగా ఏ. ఐ. సి. సి. లో ప్రవేశ పెట్టవలసిన చిత్తు తీర్మానంవరకు తయారయింది."

(ఆ పుస్తకంలోనే 46 వ పేజీ)

ఇదొక అతుకులబొంత - నిస్సందేహంగా, రాజేంద్రబాబు తీర్మా నంలో తటస్థ వైఖరికి సంబంధించిన భాగం నెహ్రూ తీర్మానంలో లేనేలేదు. అలాగే 'క్విట్ ఇండియా నినాదం. క్రియారూపంగా మిత్ర మండలికి తోడ్పడకూడదనే విషయాలుకూడా లేవు. ఒక్క విషయం లోనే ఆ తీర్మానంలోని అభిప్రాయాలకు చోటిచ్చింది. "సామ్రాజ్య వాదాన్ని ద్వేషిస్తున్నట్లే నాజీజాన్ని, ఫాసిజాలనుకూడా ద్వేషిస్తున్నా మ"ని అంటూ, ఇండియాకే స్వాతంత్ర్యంఉంటే, బహుశా ఈ యుద్ధం లో ప్రవేశించకుండా ఉండేదని తెలిపింది. అయినప్పటికీ, ఏ. ఐ. సి, సి, లో ఒకే ఒక తీర్మానం ఉండాలనే ఉద్దేశంతో కమిటీలోని మెజా రిటీ గ్రూపుకూడా చివరకు ఈ తీర్మానానికే ఓటుచేసింది. కాని, ఆ తీర్మానం పరిష్కరించిం దేమీలేదు.

విభిన్న వ్యాఖ్యానాలు

ఇందులో మరొకచిత్రం. తీర్మానాన్ని అంతాకలసి ఆమోదించినా, యే గ్రూపుకా గ్రూపు తనకు తోచినట్లు దాన్ని వ్యాఖ్యానించింది.

బెదరింపుకు నెహ్రూపండితుడు అంతవరకూ చూపుతూవచ్చిన వ్యతిరేకతను వదలుకొనేలా చేశారు. గాంధీగారుకూడా తన వైఖరిని మార్చుకొనేలా నచ్చచెప్పారు. బ్రిటిష్‌వారు దేశాన్ని విడిచి వెళ్ళిపోవాలనే కోరికను తటస్థభారతదేశం తనస్వాతంత్ర్యాన్ని గుంజుకోడానికి తగిన అవకాశంగా ప్రదర్శించవద్దన్నారు. ఫాసిస్టు వ్యతిరేక భారతదేశం ఆత్మరక్షణకోసం కోరుతూన్న అత్యవసరమైన షరతుగా దానిని ప్రదర్శించడానికి సమ్మతింపజేశారు. "జపానువారిని గాని, ఇతర దురాక్రమణదారులనుగాని, ప్రతిఘటించడానికీ, చైనాను కాపాడి తగు సహాయం చేయడానికీ; మిత్రరాజ్యాలు అవుసరమనుకుంటే తమ సేనలను ఇండియాలో ఉంచుకోవచ్చు" నని గాంధీజీచేత ఒప్పింపజేశారు.

అగష్టు తీర్మానంలోని పరస్పరవైరుధ్యానికి బీజం వార్ధాతీర్మానమే వేసింది. ఈ వైరుధ్యమే చివరకు దేశానికింత విపత్తు కలిగించింది.

క్రిప్సురాయబారం భగ్నంకావడంతో దేశంలో నిస్పృహవ్యాపించిందని తీర్మానం తెలిపింది. ఇండియాను విడిచిపెట్టాలనే భావం బ్రిటిష్‌వారికి లేదని రుజువు కావడం దీనికి తోడయింది. తత్ఫలితంగా బ్రిటిష్‌వారిపై ద్వేషభావం దేశమంతటా అతిత్వరగా వ్యాపించింది. జపానువారి విజయాలను చూచి ఆనందించే స్థితికి దారితీసిందని ఈ తీర్మానం స్పష్టపరిచింది. ఈపరిస్థితి వర్కింగుకమిటీకెంతో ఆందోళన కలిగిస్తూంది. ఎందువల్లనంటే — "ఆదిలోనే అరికట్టకపోతే, ఇది దురాక్రమణకు తలవొగ్గడం కిందికి దారితీస్తుంది." అని ఈ తీర్మానం తెలిపింది.

ఒక వైపు ఇలా అంటూనే, మరోవైపు సామ్రాజ్య వాదులపై విశ్వాసాన్ని ఈ విధంగా ప్రకటించింది:

"ఈ తీర్మానంలో చాలా న్యాయమైన, సబబైన, సూచనలు చేస్తున్నాం. వీటికి అంగీకరించడం భారతదేశంయొక్క శ్రేయస్సుకే కాకుండా, బ్రిటన్ క్షేమానికీ, మిత్రమండలి ప్రకటించిన స్వాతంత్ర్య సంరక్షణ ఆశయానికీ అత్యవసరం. ఇలాంటి సూచనలనుగాని అంగీకరిస్తే బ్రిటిష్ ప్రభుత్వాన్ని కాంగ్రెసు చాలా మెచ్చుకుంటుంది."

ఈ విజ్ఞప్తిగాని నిష్ప్రయోజనమైతే, కాంగ్రెసు విధిలేక, దేశవ్యాపిత సత్యాగ్రహ పోరాటాన్ని ప్రారంభించవలసి వస్తుందని తెలిపింది.

దీనిని చూచినవారికొక ప్రశ్న తట్టకమానదు. ప్రస్తుత పరిస్థితుల్లో పోరాటం తలపెట్టడం ఆత్మవినాశ కరమని ఎలుగెత్తి చాటిన నెహ్రూపండితుడు ఇప్పుడీ తీర్మానానికి ఎలా అంగీకరించారు? ఏదో చేస్తామని బెదరించడంతో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు లొంగివస్తారని ఇతరులతోపాటు తానుకూడా ఆశపెట్టుకొని వుంటాడు. ఇంతకుమించి మరో సమాధానం కనబడడంలేదు.

ఈ విషయమే తీర్మానంలో ఇలా వెల్లడయింది: "తన అంతిమ ఆశయాన్ని సాధించడానికి కాంగ్రెసు తహతహ లాడుతూంది. అయినప్పటికీ తొందరపడి ఏలాటి చర్య తీసుకోవాలనే ఉద్దేశం కాంగ్రెసుకు లేదు. మిత్రమండలికి ఇబ్బంది కలిగించే చర్యను దేనినీ సాధ్యమయినంతవరకు తీసుకోకుండా ఉండాలనే కాంగ్రెసు చూస్తుంది."

వట్టి బెదరింపుతో కార్యం నెరవేర్చుకుందామనే ఎత్తుగడ ననుసరించే గాంధీజీ వర్ధాలో 1942 జులై 14 వ తేదీన 'యునైటెడ్ ప్రెస్' విలేఖరితో మాట్లాడుతూ విషయాలను బయటపెట్టారు.

"దురాక్రమణను ప్రతిఘటించడానికి స్వతంత్ర భారతదేశం మిలటరీ సహకారం చేయడాన్ని తాను వ్యతిరేకించనని గాంధీజీ అన్నారు. అలా వ్యతిరేకించడం సబబుకాదు. భారతదేశ స్వాతంత్ర్యాన్ని అంగీకరించడంతో, బ్రిటన్‌పట్ల ఇప్పుడున్న ద్వేషభావం సద్భావంగా మారుతుంది. బ్రిటన్‌కి అదొక ఘనత అవుతుంది."

వర్ధా తీర్మానంకూడా విదేశపత్రికల్లో ఒక పెడబొబ్బను లేవదీసింది. ప్రజాపోరాటం అనే ఈ బెదరింపునుచూచి భారతదేశమిత్రులుకూడా విస్తుపోయారు.

బయటినుంచి ఈరూపంగా వచ్చిన వత్తిడికిలొంగి వర్ధాతీర్మానాన్ని ఆగస్టులో మార్చారు. జులై 14 న వర్కింగుకమిటీచేసిన తీర్మానాన్ని, ఆ తరువాత జరిగిన ఘటనలనూ, "యుద్ధపరిస్థితిలో కలిగిన మార్పులనూ, బాధ్యతగల బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధిఅన్న మాటలనూ,

దేశంలోనూ, విదేశాల్లోనూ, జరిగిన విమర్శనలనూ, ఏ. ఐ. సి. సి. గుర్తించింది" అన్న మాటలతో ఆగస్టు తీర్మానం ప్రారంభమయింది.

మా ఈజవాబులో మరొకచోట ఆగస్టు తీర్మానం పూర్తిపాఠాన్ని ఉదహరిస్తాం. అభివృద్ధికర పక్షంతో భారతదేశం యొక్క ఏకీభావాన్నే ఈ తీర్మానంలో అన్నిటికన్నా ఎక్కువగా నొక్కిచెప్పారు. మిత్రమండలి ఆశయసిద్ధికే భారతదేశ జాతీయప్రభుత్వం అత్యవసరమన్నారు. ఇండియా ప్రభుత్వంచేతిలో భారతదేశరక్షణ శక్తి నానాటికీ క్షీణిస్తుండడంవల్ల, అటు చైనాలోను రష్యాలోను పరిస్థితులు విషమించడంవల్ల, జాతీయ ప్రభుత్వస్థాపన అత్యవసరమన్నారు. ఈ విషయాన్నిగురించి విస్పష్టంగా ఇలా అన్నారు"

"తన అధీనంలోఉన్న మిలిటరీ బలాలను, అహింసాయుత శక్తుల్ని, అన్నిటినీ వినియోగించి, ఇతర మిత్రరాజ్యాలతోపాటు దురాక్రమణను ప్రతిఘటించి, భారతదేశాన్ని కాపాడడమే తాత్కాలిక జాతీయ ప్రభుత్వంయొక్క ప్రధాన కర్తవ్యం.........."

ఈ తీర్మానం ఇంకా ఇలా ఉంది:

"చైనా, రష్యాల స్వాతంత్ర్యం అమూల్యమైనది; దానిని తప్పకుండా కాపాడాలి. వాటి రక్షణకు ఏలాంటి అంతరాయం కలిగించకూడదని వర్కింగు కమిటీ భావిస్తూంది. అంతేకాదు. మిత్రరాజ్యాల ఆత్మరక్షణ శక్తిని ఏవిధంగాను కుంటుపరచకూడదని కూడా యీకమిటీ వాంఛిస్తూంది."

చిట్టచివరకు వచ్చింది బెదరింపు.

"దేశంలోవున్న అహింసాయుత శక్తుల నన్నిటినీ వినియోగించడంకోసం, ఇదివర కెన్నడూ ఎరుగనంతటి విశాల రంగంలో ప్రజాపోరాటాన్ని సాగించాలి..........

తీర్మానంలోని ప్రమాదకరమైన వైరుధ్యం ప్రపంచాని కంతటికీ స్పష్టంగా వెల్లడయింది. ఒకవైపు నెహ్రూగారి ఫాసిస్టు వ్యతిరేకత; మరోవైపు గాంధీజీగారి తటస్థ ధోరణి. ఈ రెండింటికీ చక్కని సామరస్యం కుదర్చడానికయినా ప్రయత్నించకుండా ఏదో ఒక విధంగా అతికారు.

తీర్మానంలోని మొదటిభాగం చదివితే మనసుకు స్ఫురించే కార్యవిధానంఒకటి; రెండవభాగంలో వివరించిన కార్యక్రమం వేరొకటి. ప్రపంచంలోని కోటానుకోట్ల ప్రజాస్వామికవాదులు మొదటిభాగాన్ని హర్షించారు. కాని రెండవభాగానికి చంకలెగురవేసింది అక్షరాజ్యబంది పోటుదొంగలూ, సామ్రాజ్యవాదకుతంత్రకారులూ.

ప్రజలపై విశ్వాసం శూన్యం

అయితే ఈ బెదరింపుకు కారణమేమిటి? సామ్రాజ్యవాదుల విధానాన్ని అవగాహనచేసుకోకుండా, వారిఅంతరాత్మను చలింపజేయగలమనే పిచ్చిభ్రమేదీనికి కారణం.

నైతికఘనతను సామ్రాజ్యవాదులకు బహుమానంగా చూపిస్తున్నారు గాంధీజీ. దీనికాశపడి "బ్రిటిష్ సామ్రాజ్యమకుటంలో అత్యుత్తమ వజ్రాన్ని" పోగొట్టుకొనేటంత వెర్రివెంగళాయా చర్చిల్?

ఈ ప్రశ్నకు సమాధానంలేదు—తూర్పు రంగంలోని తమ ఇతర దేశాల నన్నిటినీ పోగొట్టుకున్నారుకదా అనే కుంటి సమాధానంతప్ప.

కాని ఆ దేశాలన్నీ పోయాయి కాబట్టే సామ్రాజ్యవాదులు ఇండియాను దక్కించుకోడానికి మరింత పట్టుదలతో ప్రయత్నిస్తారన్నది ఎలాంటివారికయినా స్పష్టంకాదా? ఒకవేళ ఇండియా జపానువారి చేతుల్లోకిపోయినా దానిని తిరిగి స్వాధీన పర్చుకోవచ్చును. కాని భారతీయుల చేతికేగాని వప్పగిస్తే ఇక అది తమకు దక్కదనే భావంతోనే కదా సామ్రాజ్యవాదులు ప్రవర్తిస్తారు?

జాతీయ సంస్థల్లో తలమానికమైన కాంగ్రెసుకి నాయకులైన మీరు ఈ విషయాన్ని గుర్తించలేకపోయా రెందువల్ల? మీరుప్రజలపై విశ్వాసం ఉంచకుండా, సామ్రాజ్యవాదులపై వెర్రిఆశలు పెట్టుకోవడంవల్లనే అలా జరిగింది.

మీరు తల నెరిసిన నాయకులు— నూతన పరిస్థితులను అవగాహన చేసుకోలేకపోయారు. వాస్తవిక పరిస్థితులను లీలగానయినా చూడగలిగిన నెహ్రూవంటివారుకూడా నూతన పరిస్థితులకు తగిన పంథాను నిర్ణయించలేకపోయారు.

పాతసిద్ధాంతాలూ, పాతవిధానాలూ, పాతఆలోచనా పద్ధతులూ, కార్యక్రమాలూ మీకు తెగ్రించరాని బంధాలయాయి. సరికొత్త పరిస్థితుల్లో బూజుపట్టిన పద్ధతులననుసరింపజూచారు. పరస్పరవైరుధ్యాలతో ఒక తీర్మానంచేశారు; దేశాన్ని నానాభీభత్సం చేయడానికి సామ్రాజ్యవాదులకు చక్కని అవకాశమిచ్చారు; ప్రజలకు కనీవినీ ఎరుగని అగచాట్లు తెచ్చారు.

మా కమ్యూనిస్టు ఉద్యమం జాతీయోద్యమంలో ఒక కొత్తశక్తి. తగినంతబలం మాకింకాలేదు. మీ తీర్మానంలోని వైరుధ్యాన్ని స్పష్టంగా ఎత్తిచూపాం. ప్రమాదకరమైన దాని ఫలితాలనుగురించి హెచ్చరించాం. కాని మమ్మల్ని మీరు తృణీకారభావంతో చూచారు. మేము మాచేతులతోనే మా గొంతులు కోసుకుంటున్నామని మీరు లెక్కగట్టారు. ప్రజాభిమానాన్ని చేతులారా పోగొట్టుకుంటున్నామనీ, ఆత్మహత్య చేసుకుంటున్నామనీ జాలితలచారు. మాలో ఒకరితో నెహ్రూ ఈ మాటలనే అన్నారు.

మీరు దేశాన్ని ముందుకునడపడంకాదు జరిగింది. మనల్ని బానిసలుగా త్రొక్కిపెట్టిన కరకు సామ్రాజ్యవాదులు మీ ముక్కుకు త్రాడు బిగించి తమ ఇష్టం వచ్చిన ఆటలను ఆడించడానికి ముందుకు నడిపారు.

V

ఆగస్టు తీర్మానం

ఏయే దశల్లోనుంచి మీరు ఆగస్టుతీర్మానంచేసే స్థితికి వచ్చారో వివరించాం. ఆ తీర్మానంలో విస్పష్టము, ఉత్తేజకరము అయిన మొదటిభాగం మాకెంతో ఆనందం కలిగించింది. మాకేకాదు, జపానుపై ఎలాంటి వెర్రి ఆశలుపెట్టుకోకుండా, మిత్రమండలితో ఒడంబడిక కుదుర్చుకొని అక్ష రాజ్యాలను ప్రతిఘటించి పోరాడాలని తహతహలాడిన కాంగ్రెసువాదులందరికీ అది బ్రహ్మానందం కలిగించింది. కాని, బెదరింపుభాగమో? దానికి చంకలెగురవేసింది జపాను ఫాసిస్టుమూకలు. ఇది వారి రేడియోప్రసారాల్లో కనబడింది. వారికేకాదు. మీతోడినాయకులు, అనుచరుల్లో కొందరికికూడా తీర్మానంలోని ఈ రెండవభాగం పనికివచ్చింది, వీరెలాంటివారో చూడండి: మొట్టమొదట వీరు బ్రిటిష్‌సామ్రాజ్యవాద ప్రభుత్వంపై కొండంతఆశతో

బయలుదేరారు; ఆ ఆశలడియాసలయేసరికి పట్టరానిద్వేషంతో పరవశులయారు. దానితో ప్రజాస్వామ్య ఆశయాలపైనే విశ్వాసం పోగొట్టుకున్నారు. మిత్రమండలిలోని సామ్రాజ్యవాద వర్గాలకు, ప్రజాశక్తులకు మధ్య విచక్షణచూపడం మానేశారు. ఈయుద్ధం అంతా ప్రపంచాధిపత్యం కోసం జరుగుతూన్న పెనుగులాటగానే లెక్కగట్టారు. అంతేగాని, ప్రపంచ ప్రజాస్వాతంత్ర్యాన్ని కాపాడడానికి ఫాసిస్టుసామ్రాజ్యవాద శక్తుల్ని ప్రతిఘటించి ప్రజాశక్తులు సాగిస్తున్న పవిత్ర పోరాటంగా గుర్తించలేదు. ఇలాంటివారుకూడా మీ తీర్మానంలోని బెదరింపును అభినందించారు.

మొదటి భాగంలో విస్పష్టంగా ప్రకటింపబడిన నిర్మాణాత్మక వైఖరిని మేము అభినందించాము. రెండవ భాగం దీనికెలా భిన్నంగా పోతూందో గ్రహించి హెచ్చరించింది మేమొక్కరమే. మీ సందిగ్ధావస్థను మేము గుర్తించాం. ఒకవైపు దేశాన్ని కాపాడుకోవాలనే ఆకాంక్ష; మరోవైపు బ్రిటిష్‌వారితో చేతులు కలపడమంటే వున్న ఏవగింపు. ఈ రెండిటి మధ్య ఏది మార్గం? ఆరోజుల్లోనే దేశభక్తుడయిన ప్రతి భారతీయుడు ఈ సందిగ్ధావస్థతో బాధపడ్డాడు. దీన్నే మీ తీర్మానం ప్రతిబింబించింది.

పవిత్ర స్వాతంత్ర్యాశయంపేరిట, తక్షణ కర్తవ్య నిర్వహణకోసం మీకొక విజ్ఞప్తిచేశాం. ఏయే అంశాల్లో మీ తీర్మానంతో ఏకీభవిస్తున్నామో, ఎక్కడ భేదిస్తున్నామో స్పష్టం చేశాం. దేశానికి శ్రేయస్సు కూర్చగల మార్గం సూచించాం.

"పోరాడాలి! నిజమే! కాని ఎవరితో? ఎలా? అనే శీర్షికతో 1942 జులై 26 వ తేదీ 'పీపుల్సువార్'లో వర్కింగు కమిటీ కొక బహిరంగ లేఖను ప్రచురించాం. దానిలో కొన్ని భాగాల నిక్కడ ఉదహరిస్తున్నాం:

తీర్మానంలోని మొదటి భాగాన్ని హర్షిస్తూ ఇలా రాశాం —

"జాతీయ నాయకవర్గంలోని నిరాశావాదులు ఓడిపోయినందుకు సంతోషిస్తున్నాం.

"భారతదేశం తనను తానే రక్షించుకోవాలి.

"దురాక్రమణను ప్రతిఘటించి భారతదేశం చేతులు కలపాలి.

"ఆత్మరక్షణ చేసుకోగల ఆ అధికారం భారత దేశానికి లభించాలి.

"ప్రపంచ స్వాతంత్ర్యంకోసం పోరాడడానికి భారత దేశానికి స్వేచ్ఛ కావాలి. అనే నిర్ణయాలకు మీ రందరూ వచ్చినందుకు అభినందిస్తున్నాం."

ఒకవైపు ఇలాంటి నిర్ణయాలకు వస్తూ మరోవైపు బెదరింపులకు పూనుకోవడం వల్ల కలిగే ప్రమాదాలను గురించి హెచ్చరించాం—

"భారతప్రజలు ఫాసిస్టుల నెదుర్కొని పోరాడడం సామ్రాజ్యవాద ప్రభుత్వానికి ఇష్టంలేదు. ఎందువల్లనంటే,—ఈ పోరాటం ద్వారా భారతీయులు స్వాతంత్ర్యం సాధించగలరనీ, అంతటితో తమపెత్తనము అంతరించి పోతుందనీ, ఆ సామ్రాజ్యవాదులకు బాగా తెలుసు. క్రిప్సు రాయబారాల అనుభవంతో మీలో చాలామంది ఈ సత్యాన్ని గ్రహించారు. కొందరీ విషయాన్ని బహిరంగంగా వెల్లడి చేశారు కూడా.

అలాంటప్పుడు మీరనుకున్న ప్రజా పోరాటాన్ని ప్రారంభించటం అంటే సామ్రాజ్యవాదుల ఆటలు సాగే అవకాశాన్ని కలిగించడమన్న మాటేకదా? ఈ పోరాటాన్నేగాని మీరు ప్రారంభిస్తే యేమవుతుంది?

"మిమ్మల్ని, వేలకొలది కాంగ్రెసువాదుల్నీ సామ్రాజ్యవాదులు చల్లగా జైళ్ళలో పడేస్తారు. ఫాసిస్టు దురాక్రమణదారులనుండి భారతదేశాన్ని జయప్రదంగా కాపాడ గలందులకు ఈ పనిచేయక తప్పిందికాదని రుద్రాక్షపిల్లి కబుర్లాడతారు.

"మీరూ, ప్రతిదేశసేవకుడూ ప్రజలకుఅండగా నిలబడవలసిన అవసరం అత్యధికంగాఉన్నఈపరిస్థితుల్లో మిమ్మల్ని ప్రజలనుండిదూరంచేస్తారు. ఈనాడు శత్రువును ప్రతిఘటించడంకోసం ప్రజలనందరినీ సంఘటితపరచవలసిన చరిత్రాత్మక బాధ్యత మీపైనుంది. అలాంటప్పుడు ఈ బెదరింపు ఫలితంగా మీరు ప్రజలను నాయకులులేని వారిగా చేసినవారవుతారు." పిచ్చి నిరంకుశాధికారులపాల బడవేసినవారవుతారు.

"........పోరాటం తలపెట్టడంవల్ల మీరు పరాయి ప్రభుత్వంపై ఏమాత్రం దెబ్బతీయడంలేదు: మన పవిత్రస్వాతంత్ర్యాశయానికే దెబ్బగొడుతున్నారు, ఈ విషయాన్ని గుర్తించవలసిందని వేడుకుంటున్నాం."

('పీపుల్సువార్' సంపుటి 1 సంచిక 3)

మిమ్మల్నొక విషయం అడగవచ్చునా?—

మా 'పీపుల్సువార్' లో నుంచి కొన్నిభాగాలనెత్తి మీకు ఉదహరించినవారు ఈ భాగాన్నితీసి చూపించారా? అగస్టు తీర్మానానికి రెండు వారాలుముందుగానే మేమురాసినవ్యాసాన్ని చూచేశ్రద్ధయినా తీసుకొన్నారా? తుచ తప్పకుండా అంతా మేమన్నట్లే జరగలేదా?

ఇలా జరుగకతప్పదని మేము ముందుగానే ఎలాగ్రహించగలిగాం? ఈప్రశ్న మీకు తట్టవద్దూ? దేశభక్తియుత పంధానుసరించి, పరిస్థితులను వాస్తవికదృష్టితో పరిశీలించగలిగాం కాబట్టే మాకీముందుచూపు అలవడిందని నిస్సంకోచంగా చెప్పగలం. సామ్రాజ్యవాదంపై వెర్రిఆశలనే పొరలేవీ మాదృష్టిని కప్పలేదు. ఆనాడే మీ కిలా విజ్ఞప్తిచేశాం:

> "బానిసలుగా క్రుంగుతున్న మనకు మిగిలివున్న బలంకాస్తా ఐక్యతాబలమే. అదే మనకవచం; మన ఆయుధం. దేశానికి నాయకులు మీరు. మనప్రజల నధోగతిపాల్జేసి, ఫాసిస్టు ఇనుపపాదాల క్రింద మనజాతికి దుర్మరణం చేకూర్చేతప్పటడుగొకటైనా మీరు వేయతగదు. జాతీయప్రభుత్వాన్ని సాధించగల జాతీయైక్యతా నిర్మాణానికి మీరు చొరవతీసుకోవాలి. ఒక్కదెబ్బతో అటు బ్రిటిష్ పెత్తనాన్ని కూలద్రోయడానికి, ఇటుపాసిస్టులనెదుర్కొని విజయం సాధించడానికి మార్గం అదే"

మేము ప్రచురించిన ఈ బహిరంగలేఖ పూర్తిపాఠాన్ని ఈజాబుకు అనుబంధంగా జేరుస్తున్నాం. దానిలోని విషయాన్నంతా మీరే తెలుసుకోవచ్చు. 1942 అగస్టు 8వ తేదీకి సరిగా రెండువారాలు ముందుగారాసిన జాబది. మేము తెలిపిన రీతిగానే చాలావరకు యదార్థాలయాయి.

ఆగస్టు తీర్మాన పాఠం

మేము ఆగస్టు తీర్మానాన్ని వ్యతిరేకించామని మా నెత్తిమీద కావలసినంత దుమ్ము కొడుతున్నారు. ఆగస్టు తీర్మానాన్ని కొందరు ఆగస్టు విప్లవం అనికూడా అంటున్నారు.

ఆ తీర్మానాన్ని ఏ. ఐ. సి. సి. కమ్యూనిస్టు సభ్యులు సూచించిన సవరణలతో ఇక్కడ పూర్తిగా ఉదహరిస్తున్నాం. దీనిని మళ్లామళ్లా చదవ వలసిందని ప్రార్థిస్తున్నాం.

కమ్యూనిస్టు సవరణలతో ఆగస్టు తీర్మానం

కాంగ్రెసు అధికార తీర్మానంలోనూ, కమ్యూనిస్టులు సవరించ దలచుకొన్న పాఠంలోనూ ఒకటే అయిన భాగం —

"1942 జులై 14 వ తేదీని వర్కింగు కమిటీ చేసిన తీర్మానాన్ని అఖిలభారత కాంగ్రెసు కమిటీ చాలా శ్రద్ధగా పరిశీలించింది. అటుతరువాత జరిగిన ఘటనలను, యుద్ధపరిస్థితులతో గలిగిన మార్పులను, దేశంలోను, ఇతర దేశాల్లోను జరిగిన విమర్శలను పరిశీలించింది. ఏ. ఐ. సి. సి. ఈ తీర్మానాన్ని ఆమోదిస్తూంది.

ఈ తీర్మానం తదనంతరం జరిగిన ఘటనలు దానినింకా బలపరుస్తున్నాయని భావిస్తూంది. భారత దేశానికి శ్రేయస్సు చేకూరాలంటే, మిత్ర రాజ్యాల ఆశయం సిద్ధించాలంటే, ఇండియాలో బ్రిటిష్‌పెత్తనం తక్షణమే అంతమొందుట అత్యవసరమని నిర్ధారణ అయింది. ఈ పెత్తనం కొనసాగడం భారతదేశాన్ని అవమానాల పాలు జేస్తూంది; నిర్వీర్యం చేసేస్తూంది. తత్ఫలితంగా భారతదేశం ఆత్మరక్షణ చేసుకోలేక పోతూంది; ప్రపంచ స్వాతంత్ర్య పోరాటంలో తనవంతు నెరవేర్చలేక పోతూంది.

"రష్యా, చైనా రంగాల్లో పరిస్థితులు విషమిస్తున్నందుకు ఏ. ఐ. సి. సి. ఆందోళన చెందుతూంది. తమ స్వాతంత్ర్య రక్షణకోసం ఆదేశాల ప్రజలు ప్రదర్శిస్తున్న అద్భుత ధైర్య సాహసాలను కొనియాడుతూంది. రష్యా, చైనా రంగాల్లో ప్రమాదం నానాటికీ తీవ్రమవడం స్వాతంత్ర్య కాముకులయిన ప్రతివారిపైనా, దురాక్రమణకు బలిఅయిన వారిపట్ల సానుభూతి గల ప్రతివారిపైనా, ఒక మహత్తర భాధ్యతను పెడుతూంది. మిత్ర

మండలి ఇంతవరకు అనుసరిస్తూ వచ్చిన విధానం ఫలితంగా ప్రమాదకరమైన పరాజయాలే సంభవిస్తూ వచ్చాయి. ఈ విధానంయొక్క మూల సూత్రాలను పరిశీలించ వలసిన బాధ్యతే అది. ఈ పరాజయాల నరికట్టి విజయం సాధించాలంటే మార్గం ఆ విధానాలకు, ఆశయాలకు అంటిపెట్టుకోవడం కాదు. ఈ విధానం ఎల్లప్పుడూ పరాజయ పరంపరలనే చేకూర్చుతుందని గత అనుభవమంతా వేనోళ్ళ చాటుతూంది. ఎందువల్లనంటే — ఈ విధానాలకు పునాది స్వాతంత్ర్యాశయం కాదు. బానిస, వలసదేశాల ప్రజలను పీడించుకు తినడమే వీటికి మూలసూత్రం. సామ్రాజ్యవాద సాంప్రదాయాలను కొనసాగించడమే వీటి ఆశయం. సామ్రాజ్యాన్ని చేతిలో పెట్టుకోవడం పాలక దేశానికొక ఆయుధంగా కాక, పెద్ద గుదిబండగా తయారయింది; దాని తలపై ఒక శాపంలా పరిణమించింది. ఒకప్పుడు ఆధునిక సామ్రాజ్యవాదానికి క్రీడా రంగమయిన భారతదేశమే ఈనాడు దానికి విషమసమస్య అయింది. ఒక్క బ్రిటనుకే కాదు, మిత్రమండలి అంతటియొక్క ఆశయాలకే భారతదేశ స్వాతంత్ర్య సమస్య అగ్నిపరీక్ష అయింది. ఆఫ్రికా, ఆసియా, ప్రజల ఆశలుకూడా ఈ సమస్యపైనే ఆధారపడివున్నవి.

"అందువల్ల యుద్ధంయొక్క భవిష్యత్తుకూ; స్వాతంత్ర్య ప్రజాస్వామ్య ఆశయసిద్ధికీ భారతదేశంలో బ్రిటిష్‌ప్రభుత్వం అంతమొందడం ఈనాడు అత్యంతప్రధానమైంది. భారతదేశంయొక్క బలసంపద అపారం. స్వతంత్ర భారతదేశం ఈ శక్తిసంపద నంతటినీ ఒడ్డి ప్రపంచ స్వాతంత్ర్య సమరంలో పాల్గొని, నాజీ, ఫాసిస్టు సామ్రాజ్యవాద శక్తుల్ని ప్రతిఘటిస్తుంది; పరిపూర్ణ విజయాన్ని ఖాయంచేస్తుంది. దీనితో యుద్ధరంగంలోని ప్రస్తుతబలాబలాలు తారుమారవుతాయి. అంతేకాదు, భారతదేశం మిత్ర రాజ్యాలపక్షం చేరడంతో, పరాధీన, పీడిత జాతులన్నీకూడా ఆపక్షంలోకి వచ్చేస్తాయి. దానితో ప్రపంచంపై నైతిక నాయకత్వం మిత్రరాజ్యాలకు లభిస్తుంది. అలాకాకుండా భారతదేశాన్ని బానిస సంకెళ్ళలోనే ఉంచినట్లయితే అది బ్రిటిష్ సామ్రాజ్యతత్వానికి దారుణచిహ్నంగా నిలుస్తుంది. ఆ అప్రతిష్ఠ మిత్రరాజ్యాలన్నిటిపైనా పడుతుంది.

"కాబట్టి ప్రస్తుత ప్రమాదాన్ని తొలగించాలంటే బ్రిటిష్‌పరిపాలన అంతమొంది, భారతదేశానికి స్వాతంత్ర్యం లభించడం అత్యవసరం.

ముందుముందు ఏమోచేస్తామనే వాగ్దానాలు, గ్యారంటీలు ఇకచెల్లవు. వాటి వల్ల ప్రమాదం ఏమీతొలగదు. ప్రజలలో కావలసిన ఉత్సాహము. ఉద్వేగము ఈ గాలిమాటలవల్ల కలుగవు. కోటానుకోట్లప్రజల్లో అంతర్భూతమై ఉన్న ఉత్సాహాన్ని, శక్తిని ప్రజ్వలింపజేసి, యుద్ధస్వభావాన్నే మార్చగలది నేడొక్క స్వాతంత్ర్య జ్యోతే."

అధికారాన్ని వప్పగించడం గురించి అధికార తీర్మానం

"కాబట్టి భారతదేశంనుండి బ్రిటిష్ ప్రభుత్వం తొలిగిపోవాలని ఎ. ఐ. సి. సి. పునరుద్ఘాటిస్తూంది. స్వాతంత్ర్యాన్ని ప్రకటించడంతో భారతదేశంలో తాత్కాలిక జాతీయ ప్రభుత్వం ఏర్పడుతుంది. స్వతంత్ర భారతదేశం మిత్రమండలి పక్షం చేరి, వారి కష్టసుఖాలను పంచుకుంటూ, ప్రపంచ స్వాతంత్ర్య మహాసమరంలో పాల్గొంటుంది. పై తాత్కాలిక ప్రభుత్వం దేశంలోని ప్రధాన రాజకీయపక్షాల, గ్రూపుల సహకారంతోనే ఏర్పడగలదు. ఆవిధంగా అది దేశంలో ప్రధానవర్గా లన్నిటియొక్క ప్రతినిధులతో కూడిన ప్రభుత్వమవుతుంది. ఈ ప్రభుత్వంయొక్క ప్రధాన కర్తవ్యాలు —

తన చేతిక్రిందనున్న మిలిటరీశక్తులను, అహింసాశక్తులనన్నిటినీ వినియోగించి మిత్రరాజ్యాలతో భుజం భుజం కలిపి భారతదేశాన్ని కాపాడాలి. దురాక్రమణను ప్రతిఘటించాలి. కార్మిక, కర్షకులశ్రేయస్సును, అభివృద్ధిని, పెంపొందింపజేయాలి. దేశంలో అధికారం అంతా ప్రధానంగా కార్మిక, కర్షక వర్గాలకే చెందాలి. తాత్కాలిక ప్రభుత్వం ప్రజాపరిషత్సభను ఏర్పాటుచేయడానికి తగిన సన్నాహాలను చేస్తుంది. ఈ సభ ప్రజలందరికీ సమ్మతమైన రాజ్యాంగ యంత్రాన్ని తయారుచేస్తుంది. ఈరాజ్యాంగం ఒక సమాఖ్యగా ఉండాలని కాంగ్రెసు అభిప్రాయం. ఈసమాఖ్యలో చేరే రాష్ట్రాలకే అత్యధిక స్వపరిపాలనాధికారాలు ఉంటాయి. సమాఖ్య కేంద్ర ప్రభుత్వానికని నిర్దేశింపబడిన అధికారాలుపోగా మిగిలిన అధికారాలన్నీ ఈరాష్ట్రాలకే చెందుతాయి. భారతదేశానికీ, మిత్రరాజ్యాలకూ ఇకముందు వుండవలసిన సంబంధ బాంధవ్యాలను ఈదేశాల ప్రతినిధులందరూ సమావేశమయి నిర్ణయిస్తారు. ఈ నిర్ణయాలు పరస్పర శ్రేయోదాయకములును, ఒండొరుల సహకారంతో దురాక్రమణ నరికట్టడానికి అనుకూలమయినవిగాను ఉండేలా

చూచుకుంటారు. ప్రజలందరియొక్క సంఘటితశక్తితో స్వతంత్ర భారతదేశం దురాక్రమణదారులను జయప్రదంగా ప్రతిఘటించగలదు."

కమ్యూనిస్టు సవరణ

పై అధికార తీర్మానాన్ని ఈక్రిందివిధంగా సవరించవలసిందని కమ్యూనిస్టు సభ్యులు ప్రతిపాదించారు :

"కాబట్టి భారతదేశంనుండి బ్రిటిష్ ప్రభుత్వం తొలగిపోవాలని ఏ. ఐ. సి. సి. పునరుద్ఘాటిస్తూంది. స్వాతంత్ర్యాన్ని ప్రకటించడంతో భారతదేశంలో తాత్కాలిక జాతీయప్రభుత్వం ఏర్పడుతుంది. స్వతంత్ర భారతదేశం మిత్రమండలి పక్షంచేరి వారి కష్టసుఖాలను పంచుకుంటూ, ప్రపంచ స్వాతంత్ర్య మహాసమరంలో పాల్గొంటుంది. పై తాత్కాలిక ప్రభుత్వం దేశంలోని ప్రధానరాజకీయపక్షాల, గ్రూపుల సహకారంతోనే ఏర్పడగలదు. ఆవిధంగా అది దేశంలో ప్రధానవర్గా లన్నిటియొక్క ప్రతినిధులతోకూడిన ప్రభుత్వమవుతుంది. ఈ ప్రభుత్వంయొక్క ప్రధాన కర్తవ్యాలు — తన చేతిక్రిందనున్న మిలటరీ శక్తులను, అహింసా శక్తుల అన్నిటినీ వినియోగించి మిత్రరాజ్యాలతో భుజం, భుజం కలపి భారతదేశాన్ని కాపాడాలి. దురాక్రమణను ప్రతిఘటించాలి. కార్మికుల, కర్షకుల శ్రేయస్సును అభివృద్ధిని పెంపొందింప చేయాలి. దేశంలోని అధికారమంతా ప్రధానంగా కార్మిక, కర్షకవర్గాలకే చెందాలి. తాత్కాలిక ప్రభుత్వం ప్రజాపరిషత్సభను ఏర్పాటు చేయడానికి తగిన సన్నాహాలు చేస్తుంది. ఈ సభ ప్రజలందరికీ సమ్మతమైన రాజ్యాంగ యంత్రాన్ని తయారుచేస్తుంట. ఈ రాజ్యాంగం ఒక సమాఖ్యగా ఉండాలని కాంగ్రెసు అభిప్రాయం. ఇరుగు పొరుగుగా ఉన్న ప్రదేశంలో ఒకేచరిత్ర, ఒకేభాష, సంస్కృతి, మనస్తత్వం, ఒకే ఆర్థిక జీవనంగల ప్రజలతో కూడియున్న రాష్ట్రాలు సరిసమానమైన హోదాలతో ఈ సమాఖ్యలో సభ్యులుగా ఉంటాయి. వీటికి సంపూర్ణ స్వపరిపాలనాధికారంతోపాటు, సమాఖ్యలోనుంచి విడిపోయే హక్కుకూడా ఉంటుంది. భారతదేశానికి మిత్రరాజ్యాలకు ఇకముందుండవలసిన సంబంధ బాంధవ్యాలను ఈదేశాల ప్రతినిధులందరూ సమావేశమయి నిర్ణయిస్తారు. ఈ నిర్ణయాలు పరస్పర శ్రేయోదాయక

మును, ఒండొరుల సహకారంతో దురాక్రమణ నరికట్టడానికి అనుకూల మయినవిగాను ఉండేలా చూచుకొంటారు. ప్రజ లందరియొక్క సంఘటిత శక్తితో స్వతంత్ర భారతదేశం దురాక్రమణ దారులను జయప్రదంగా ప్రతిఘటించగలదు." అధికార తీర్మానంలోను, సవరణ తీర్మానంలోను ఒకటే అయిన భాగం —

"భారత స్వాతంత్ర్యం ఆసియాలో ఇతర పరాధీనత దేశాలన్నిటి యొక్క స్వాతంత్ర్యానికి తొలిపలుకుగా ఉండాలి, బర్మా, మలయా, ఇండో చైనా, డచ్చిఇండీస్, ఇరాన్, ఇరాక్, దేశాలుకూడా సంపూర్ణస్వాతంత్ర్యాన్ని పొందాలి, వీటిలో ప్రస్తుతం జపాను ఆక్రమణ క్రిందికిపోయిన దేశాలు యుద్ధానంతరం మరేఇతర సామ్రాజ్యవాదదేశాల అధీనములోకిపోకూడదు.

"ప్రస్తుత ప్రమాదపరిస్థితిలో భారతదేశాన్నికాపాడి స్వాతంత్ర్యాన్ని సాధించడమే ఏ. ఐ. సి. సి. ప్రధానలక్ష్యం. అయినప్పటికీ, ప్రపంచంలో శాంతి భద్రతలు నెలకొని సక్రమమార్గంలో అభివృద్ధి చేకూరాలంటే స్వతంత్రదేశాలన్నీ కలసి ఒక ప్రపంచసమాఖ్యగా ఏర్పడడం అవసరమని ఏ. ఐ. సి. సి. భావిస్తూంది. నేటి ప్రపంచా న్నెదురుకొంటున్న అసంఖ్యాక సమస్యలను పరిష్కరించేమార్గం మరేదీలేదు, ఇలాంటి ప్రపంచసమాఖ్య, సభ్యులుగాఉన్న దేశాలన్నిటి స్వాతంత్ర్యాన్ని రక్షిస్తుంది; ఒకదేశాన్ని మరొకదేశం ఆక్రమించుకొని పీడించడం అరికడుతుంది; మైనారిటీజాతుల హక్కులు కాపాడుతుంది; వెనుకబడిన ప్రదేశాలను, అక్కడి ప్రజలను అభివృద్ధిలోకి తెస్తుంది. ప్రపంచంలోని సిరిసంపదలనన్నిటినీ, విశ్వమానవ కళ్యాణంకోసం వినియోగిస్తుంది. ఇలాంటి ప్రపంచసమాఖ్య ఏర్పడిననాడు అన్నిదేశాల్లోను, ఆయుధవిసర్జన కార్యక్రమాన్ని అమలుజరపడం సాధ్య పడుతుంది; ఒక్కొక్కదేశం సేనలను, నౌకావిమాన బలాలను, ఉంచు కోవలసిన అగత్యం ఉండదు. ప్రపంచంలో శాంతిభద్రతలను కాపాడడానికి సమాఖ్యతరుపునే కొంత మిలటరీ బలం ఉంటుంది.

"ఇలాంటి ప్రపంచ సమాఖ్యలో స్వతంత్ర భారతదేశం సంతోషంగా చేరుతుంది. అంతర్జాతీయ సమస్యలను పరిష్కరించడానికి ఇతర దేశాలతో, సరిసమాన హోదాతో, సహకారం చేస్తుంది."

"ఈ సమాఖ్యయొక్క మూలసూత్రాల నంగీకరించిన ప్రతిదేశానికి సభ్యత్వ అర్హత ఉండాలి. కాని ప్రస్తుత యుద్ధ పరిస్థితుల్లో మిత్రరాజ్యా

లకు మాత్రమే ఇందులో స్థానం ఉంటుంది. ఇప్పుడిలాంటి నిర్మాణానికి పూనుకుంటే యుద్ధంపైన అక్షరాజ్యాల ప్రజలపైన దీని ప్రభావం ఎంతగానో ఉంటుంది. యుద్ధానంతరం ఏర్పడే శాంతి స్వభావంపైన కూడా దీని ప్రభావం ఉంటుంది."

"శాంతి సుస్థిరం కావాలంటే ఏనాడో ఒకనాడు సమాఖ్యను నిర్మించక తప్పదు. కాని, యుద్ధం ఎన్నో భయంకరమైన గుణపాఠాలను నేర్పుతున్నప్పటికీ, ఘోర ప్రమాదాల్లో ప్రపంచం మునిగి తేలుతున్నప్పటికీ, ఇతరదేశాల ప్రభుత్వా లీవిషయం గుర్తించ నందుకు ఏ. ఐ. సి. సి. విచారిస్తూంది. బ్రిటిష్ ప్రభుత్వం ధోరణిని బట్టి చూచినా, దుష్ప్రచారానికి చెవియొగ్గి విదేశ పత్రికలు చేస్తున్న విమర్శలను బట్టి చూచినా భారత దేశపు స్వాతంత్ర్య వాంఛకూడా ఆక్షేపణీయంగానే ఉన్నట్లు కనబడుతూంది. ప్రస్తుత ప్రమాదాన్నెదుర్కోడానికి, భారత దేశానికి ఆత్మరక్షణ శక్తిని కలిగించడానికి, ఇబ్బందుల్లో ఉన్న రష్యా చైనాలకు తగు సహాయాన్నందివ్వడానికే ఈ కోరికను కోరామన్న సంగతి వీరికి అక్కర లేనట్లుంది. చైనా, రష్యాల స్వాతంత్ర్య రక్షణకు ఎలాంటి అవాంతరమూ కలగకూడదని ఏ. ఐ. సి. సి. హృదయ పూర్వకంగా కోరుతూంది. ఆదేశాల స్వాతంత్ర్యం అమూల్యం; అవశ్యము రక్షణీయమూ. మిత్రరాజ్యాల రక్షణబలాన్నికూడా కుంటుపరచకూడదనే ఈ కమిటీ భావిస్తూంది. కాని భారతదేశానికీ, ఈమిత్ర రాజ్యాలకూ ప్రమాదం నానాటికీ పెరుగుతూంది, ఈ పరిస్థితుల్లో నిస్తబ్దత, పరాయి ప్రభుత్వానికి తలవొగ్గి ఉండడం భారతదేశాన్ని అవమానాల పాల్జేస్తూవుంది. అంతే కాదు. దానిఆత్మరక్షణశక్తిని సన్నగిలజేస్తూంది, నానాటికి పెరుగుతున్న ప్రమాదాన్నెదుర్కోడానికిగాని, మిత్రరాజ్య ప్రజలకు శ్రేయస్సుకూర్చడానికి గాని మార్గంకాదు. బ్రిటన్‌కి, మిత్రరాజ్యాలకు వర్కింగుకమిటీ చేసిన విజ్ఞప్తి అరణ్యరోదనమయింది. పైగా విదేశవర్గాలుచేస్తున్న విమర్శనలను చూస్తే భారతదేశంయొక్క అవసరాలను, ప్రపంచఅవసరాలనుగాని, వారు ఏమాత్రం గుర్తించినట్లు కనబడదు. భారతదేశ స్వాతంత్ర్యంపట్ల వైర భావంకూడా అప్పుడప్పుడు వెల్లడవుతూంది. ఇతరదేశాలపై పెత్తనం చెలాయించాలనే తత్వానికీ, జాత్యహంకారానికీ, ఇదంతా నిదర్శనం. తన స్వాతంత్ర్యాశయం న్యాయమైనదనీ, దానిని సాధించగలశక్తి తనకున్నదనీ

తెలుసుకొన్న ప్రాచీన ఔన్నత్యంగలజాతి ఈ వైఖరినేమాత్రం సహింప జాలదు"

తీర్మానంలో కార్యక్రమానికి చెందిన భాగం

అధికార తీర్మానం లోనిది—

ఈఆఖరు ఘడియలో లోకవిముక్తిని కాంక్షించి, ఏ. ఐ. సి. సి. బ్రిటన్, మిత్రరాజ్యాలకు మరొకమారు విజ్ఞప్తి నందజేస్తూవుంది. కాని. తమపై పెత్తనంచేస్తూ, దేశ క్షేమంకోసం, విశ్వమానవ కళ్యాణంకోసం ఇతోధిక సేవచేయనీయకుండా తమను నిర్బంధిస్తున్న సామ్రాజ్యవాద నిరంకుశ ప్రభుత్వాన్ని ధిక్కరించి తమ స్వాతంత్ర్య వాంఛను ప్రదర్శించకుండా ప్రజలను ఆపిపట్టడం ఇక నేమాత్రం సబబుకాదని ఏ. ఐ. సి. సి. భావిస్తూంది.

"కాబట్టి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు భారతదేశం యొక్క జన్మ హక్కని ప్రపంచానికి నిరూపించడానికి సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించడానికి అనుమతిస్తూ ఏ. ఐ. సి. సి. తీర్మానిస్తూంది. ఈ 22 సంవత్సరాల ఉద్యమంలో సేకరించిన అహింసాశక్తి సర్వస్వం వినియోగం కావటంకోసం ప్రస్తుత సమరం దేశవ్యాపితంగా సాగాలని ఏ. ఐ. సి. సి. తీర్మానిస్తూంది. ఈ సత్యాగ్రహ సమరం గాంధీజీ నాయకత్వం కిందనే సాగాలి. వారు దేశానికి నాయకత్వం వహించి తీసుకోవలసిన చర్యలను తీసుకోవలసిందని కమిటీ కోరుతూంది.

"తమకు కలుగ బోయే కష్టాలను. ప్రమాదాలను ధైర్య సైర్యాలతో ఎదుర్కొని. సుశిక్షిత భారతస్వాతంత్ర్య సైనికుల్లాగ గాంధీజీ నాయకత్వంక్రింద అచంచలంగానిలబడి, వారిఆదేశాలను సాగిస్తుండాలని కమిటీ భారతప్రజలకు విజ్ఞప్తి చేస్తూంది. ప్రారంభింపబోయే సమరానికి మూలసూత్రం అహింసఅన్న విషయాన్ని మరచిపోకూడదు. ఎలాంటి ఆదేశాలను ప్రకటించడానికిగాని. ఒకవేళ ప్రకటించినా అవి ప్రజలకు చేరడానికిగాని. కాంగ్రెసుకమిటీలు పనిచేయడానికిగాని, వీలులేని పరిస్థితు లేర్పడవచ్చును. అలాంటి పరిస్థితుల్లో, ఉద్యమంలో పాల్గొంటున్న ప్రతివ్యక్తీకూడా, అదివరకే ప్రకటించబడిన సాధారణ సూత్రాలకు కట్టుబడి తనంతటతానే వ్యవహరించాలి. స్వాతంత్ర్యాన్ని కాంక్షించి, దానికోసం కృషిచేసే ప్రతిభారతీయుడూ, భారతనారీ, తనకుతానే తగుసలహాలనిచ్చుకుంటూ, విశ్రాంతినెరుగని పోరాటమార్గా న్ననుసరించి, భారతస్వాతంత్ర్య గమ్యస్థానం వైపు పురోగమించాలి.

"ఆఖరువిషయం స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగాన్ని గురించి ఏ. ఐ. సి. సి. తన అభిప్రాయాలను తెలిపింది. ఇప్పుడీ ప్రజాపోరాటం ప్రారంభించడంలో పరిపాలనాధికారం అంతా కాంగ్రెసు హస్తగతం చేయాలనే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని ఏ. ఐ. సి. సి. స్పష్టపరుస్తూంది. పరిపాలనాధికారం వచ్చేటప్పుడు అది భారతప్రజలందరికీ చెందుతుంది."

పై అంశాలకు కమ్యూనిస్టు సవరణ

"ఈ ఆఖరు ఘడియలో, లోకవిముక్తిని కాంక్షించి. ఏ. ఐ. సి. సి. వెంటనే, మిత్రరాజ్యాలకు మరొకసారి ఈ విజ్ఞప్తినందజేస్తుంది. కాని కార్యక్రమశూన్యతను, నిస్తబ్దతను కొనసాగించడం ఇకనేమాత్రం సబబుకాదని కమిటీ భావిస్తుంది. ప్రస్తుత ప్రమాదాన్నెదుర్కోడానికీ. భారత స్వాతంత్ర్యాన్ని సాధించాలనీ. సాయుధంగాను, అహింసాయుతంగాను దురాక్రమణదారుల నెదుర్కొని దేశాన్ని రక్షించడానికి మిత్రరాజ్యాలతో భుజం భుజం కలిపి కృషిచేయగల తాత్కాలిక ప్రభుత్వంలో చేరాలనీ, తోడ్పడాలని కోరే అన్నిపార్టీలను, వర్గాలనుచేర్చి 'జాతీయమైక్య సంఘటన'ను నిర్మించే చొరవతీసుకోవాలని కమిటీ అభిప్రాయం.

"కాబట్టి కమిటీ ఈవిధంగా తీర్మానిస్తుంది.

1. ఈ ప్రమాదపరిస్థితిలో బ్రిటిష్ పెత్తనాన్ని తొలగద్రోసి, తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి ప్రజలనందరినీ, సమీకరించగల సంపూర్ణ జాతీయైక్యతను నిర్మించడం అత్యవసరం. ఈ ఆశయంతో ముస్లింలీగుతో ఒప్పుదలకావచ్చు ఐక్యసంఘటనను నిర్మించడానికి హృదయపూర్వకంగా ప్రయత్నించడానికి [illegible]కుంది. ఇరుగుపొరుగుగా ఉన్నప్రదేశాల్లో ఒకచరిత్ర, [illegible] సంస్కృతి. మనస్తత్వం, ఒకే ఆర్థికజీవనంగల ప్రజలతో కూడియుండి స్వపరిపాలనాధికారం. విడిపోయేహక్కుగల రాష్ట్రాల సమాఖ్యగానే స్వతంత్ర భారత రాజ్యాంగం ఉండాలని కాంగ్రెసు తీర్మానించింది. ఐక్య సంఘటనను

నిర్మించడానికి, తాత్కాలిక సంయుక్తజాతీయ ప్రభుత్వాన్ని స్థాపించడానికి ఈ తీర్మానమే తగిన ప్రాతిపదికగా ఉండగలదని కమిటీ భావిస్తుంది.

(2) కాంగ్రెసు లీగులు ఐకమత్యం కుదుర్చుకొని భారతదేశంలోని ఇతర పార్టీలనుకూడా సంఘటితపరచాలి. ఆ విధంగా జాతీయవాంఛకు ప్రజలందరియొక్క అండను సంపాదించాలి. మిత్రమండలి సేనల సహకారంతో దురాక్రమణదారులను ప్రతిఘటించగల తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని తక్షణమే సాధించడానికి భారతప్రజ లందరూ ఐక్య సంఘటనతో పూనుకుంటున్నారని ఈ విధంగా మిత్రమండలి ప్రజలకు తెలియపరచాలి.

(3) తక్షణమే అధికారాన్ని వప్పగించేసి తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని వెంటనే కావాలని కోరుతూ దేశమంతటా బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరపటానికి కాంగ్రెసు - లీగులు ప్రజలను సమీకరించాలి, దురాక్రమణదారులను ప్రతిఘటించటానికీ, జపాను అనుకూల భావాలను అరికట్టడానికీ, ప్రజలను ఉత్తేజపరచాలి. ప్రజారక్షణ సంస్థలనునిర్మించాలి. అలాంటి సంస్థలనే ప్రభుత్వంకూడా ఏర్పాటు చేసినట్లయితే అవి ప్రజలకు శ్రేయస్కరంగా ఉన్నచోట్ల వాటికీ, ప్రజాసంస్థకూ, సమన్వయం కుదర్చాలి; ప్రజలకు హానికరంగా ఉన్నచోట్ల ఎదుర్కోవాలి.

ఐక్యతే మా ఆశయం

ఆగస్టు తీర్మానాన్నిబట్టి చూస్తే మీ ఆశయ మేమిటి? జపాను దురాక్రమణదారుల్ని ప్రతిఘటించడం; బ్రిటిష్‌వారినుండి జాతీయ ప్రభుత్వాన్ని గుంజుకోవడమే కదా!

ఈ రెండు ఆశయాలతోను మా సవరణ తీర్మానాలు ఏకీభవించడం లేదా?

ఇక మీతో మేము భేదించిందెక్కడ? బ్రిటిషువారి పెత్తనం చెక్కుచెదరకుండా ఉంచే జాడలు కనుపించినప్పుడూ, జపానువారి వలలో పడే లక్షణాలు కనుపించినప్పుడే మీతో మేము భేదించాము,

మీరు ప్రకటించిన విశ్వ శ్రేయస్కర ఆశయాన్ని మా సవరణ తీర్మానం బలపరిచింది. అంతేకాదు, మీరు తెలియజేసిన స్పష్టమైన జాతీయ వాంఛను బలపరిచింది, వీటికితోడు మా సవరణలు మరొక్క పనికూడా

చేశాయి. దేశాన్నెదుర్కొంటున్న సంధిగ్ధావస్థలోనుంచి బయట పడటానికి చక్కని మార్గంకూడా చూపించాము.

మా సవరణలతో ఏకీభవించవచ్చు. లేకపోవచ్చు. కాని మీ తీర్మానాన్ని, మా సవరణ తీర్మానాన్ని చదివిన తరువాత మేము "బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పక్షం చేరి పోయామ" ని కళ్ళున్నవారెవరు ఆరోపించగలరు?

మేము బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పక్షం చేరలేదు సరిగదా, పైపెచ్చు మాసవరణలు విజ్ఞప్తి చేసిందేమిటి? "వెళ్ళండి—మీస్వంత అన్నదమ్ములతో చేతులు కలపండి; మీ సోదర సంస్థలతో ఐకమత్యం కుదుర్చుకోండి!" అని ప్రార్థించాయి.

దేశాన్నెదుర్కొన్న సంధిగ్ధావస్థలోనుంచి బయట పడడానికీ, బ్రిటిష్‌వారి చేతుల్లోనుంచి అధికారాన్ని గుంజుకోడానికీ, జపాన్ను ప్రతిఘటించి దేశాన్ని రక్షించగల జాతీయప్రభుత్వాన్ని సాధించడానికీ, ఈఐక్యత ఒక్కటే మార్గమని ఆ నాడు నమ్మాము. ఈనాడు ఇంకా గట్టిగా నమ్ముతున్నాము.

సోదర కాంగ్రెసువాది మాతీర్మానాలతో ఏకీభవించ లేకపోవచ్చును కాని, అవి కాంగ్రెసు ఆశయాలకు, సాంప్రదాయాలకు భిన్నమని ఎలా ఆక్షేపించగలరు?

మనదేశంలో మన ప్రజలచేత స్వయంనిర్ణయ సూత్రాన్ని అమలు జరిపించడానికి అతనికి అభ్యంతరం ఏమిటి? మేమూ, అతనూ ముక్తకంఠంతో బ్రిటిషు వారినుండి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరుతున్నప్పుడు, స్వయంనిర్ణయ సూత్రానికి అతనికేలాంటి ఆక్షేపణా ఉండడానికి వీల్లేదు.

లీగుతోను, ఇతర ప్రజా పక్షాలతోను కాంగ్రెసు ఐక్యసంఘటనను నిర్మించాలన్న దానికి ఆక్షేపణ ఏ ముండగలదు? పరిపాలనాధికారం తనకే కావాలని కాంగ్రెసు కోరడంలేదు; ప్రజలందరికీ చెందాలనే కోరుతూందని ఈ తీర్మానంలో మీరే స్పష్టం చేయలేదా? ఒకవిధంగా అస్పష్టంగావున్న ఈ మాటలనే మా సవరణ మరింత స్పష్టంచేసింది—అంటే ముఖ్యమైన ప్రజాపక్షం ఐక్యతను సాధించి, తద్వారా ఐక్య ప్రజా సంఘటనను నిర్మించి బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్నెదుర్కోవాలని మా సవరణ సూచించింది.

ఐక్యసంఘటన అనేది కాంగ్రెసుకేమీ కొత్తకాదు. దాని బలానికంతటికీ పునాది ఈ ఐక్యసంఘటనే. సంఘటిత జాతీయసంస్థగా అభివృద్ధి పొందాలనేకదా ఇన్ని సంవత్సరాలనుంచీ కాంగ్రెసుకృషి? ఎవరి సంస్థను చూచి వారు గర్వపడడం, ప్రస్తుతించడం మంచిదే. కాని అది ఇతరసంస్థలను చులకన చేయడానికి దారితీయకూడదు. కాంగ్రెసు కొన్నిముఖ్య సమస్యలనింకా పరిష్కరించ లేకపోయిందనీ; ఆ కారణంచేత దేశంలో కాంగ్రెసే కాకుండా మరికొన్ని ప్రజాసంస్థలు పుట్టి పెరుగుతున్నాయనీ అంటే ఏవ్వరూ కాదనలేరు. ఇందుకు కారణాలనుగురించి భేదాభిప్రాయాలుంటే ఉండవచ్చును గాని, ఈ సత్యాన్ని కాదనలేరు. ముస్లింలీగును గురించి ఎవ్వరేమయినా అనుకోవచ్చునుగాక. కాని, ముస్లింప్రజల్లో ఒక పెద్దభాగం లీగుజెండాక్రింద నిలిచిఉన్నారన్న విషయాన్ని నిష్పాక్షికులైన కాంగ్రెసు వాదులెవ్వరూ కాదనలేరు. కాబట్టి 'పరిపాలనాధికారం ప్రజలకే చెందాల'ని కాంగ్రెసు అన్నప్పుడు. ప్రజాసంస్థలన్నిటినీచేర్చి ఐక్యసంఘటనను తక్షణమే నిర్మించవలసిందని మేము సూచించాము.

అంటే మేము కోరిందేమిటి? భారత స్వాతంత్ర్యోద్యమం యొక్క ప్రాతిపదికను విశాలం చేయమని కోరాం. ఏ ప్రజాసంఘటన పద్ధతులమీదనైతే కాంగ్రెసు తనశక్తిని నిర్మించుకుందో ఆపద్ధతుల్లోనే ఈప్రాతిపదికను విశాలం చేయమన్నాం. దేశానికున్న ప్రధానదౌర్బల్యాన్ని (ఐక్యతలేకపోవడం) ఆవిధంగా తొలగించవలసిందని సూచించాం.

తీవ్రభేదాభిప్రాయాలతో మనప్రజాపక్షాలు ఎడమొగం పెడమొగంగా ఉన్నప్పటికీ, ఎదుటిపక్షంవారు దిగివస్తేనేగాని పొత్తుకుదరదని మన నాయకులు ఖచ్చితంగా చెబుతున్నప్పటికీ, ఈ ఐక్యసంఘటన సాధ్యపడుతుందనే నమ్మకం మాకెలా కలిగింది?

గడచిపోయిందేదో గడచిపోయింది; ఇక ఈనాడుకూడా తలొకదారిగా ఉండడానికి వీల్లేదని మేము నిర్ణయించుకున్నాం. ప్రతిభారతీయునికి పవిత్రమయిన స్వాతంత్ర్యాశయాన్ని కాపాడుకోవాలంటే, భారతీయులు తమప్రాణాలు దక్కించుకోవాలంటే అనైక్యతకిక అవకాశం లేదని అనుకున్నాం,

మేము ఆలోచించిందంతా దేశాన్నెదుర్కొన్న ఘోర ప్రమాదాన్ని గురించే; దేశరక్షణకు సామ్రాజ్యవాదులు కలిగిస్తున్న అడ్డంకులను ఎలా

తొలగించాలి అన్న విషయాన్ని గురించే. దేశం మనందరి సొత్తు అయినట్లయితే, మాతృదేశ శ్రేయస్సుకోసం ప్రధాన జాతీయసంస్థలు రెండూ తమ పాత భావాలనెందుకు మార్చుకోకూడదు?

ఆ రోజుల్లో దేశంలో సాగుతూన్న రాజకీయ, ఆర్థిక పరిపాలన అల్లకల్లోలంగా ఉంది. ఆ పరిస్థితుల్లో జపానువారు వచ్చి పడినా, లేక బ్రిటిషు పెత్తనమే ఇంకా సాగినా ప్రజలగతి ఏమవుతుంది అన్నదే మా ఆందోళన అంతాను. ప్రజల శ్రేయస్సు ఒక్కటే అంటారు. అలా అయినట్లయితే, ఆ శ్రేయస్సుకోసం, తమ నిత్య జీవితంకోసం, తమ ఆత్మరక్షణకోసం, తమ కుటుంబ స్త్రీల రక్షణకోసం, తమ పొట్టకూటిని దక్కించుకోవడంకోసం వారు తమ పాత తగాదాలను మరచిపోయేలా ఎందుకు చేయకూడదు? ముంచుకొస్తున్న ప్రమాదాన్ని గుర్తించి, దానినెదుర్కోడానికి అందరూ యేకమై నిలుచునేలా యెందుకు కృషి చేయకూడదు?

దేశాన్నెదుర్కొంటున్న ప్రమాదం మన రాజకీయపక్షాల్లో భ్రాతృభావాన్ని పెంపొందింప జేస్తుందని ఆశించాం. ప్రజల శ్రేయస్సుకోసం, ఈ పక్షాలు ఐక్యమవుతాయనుకున్నాం. అనైక్యత ఇంకా కొనసాగినట్లయితే కలిగే ప్రమాదాలను గుర్తిస్తారనుకొన్నాం.

ఏ పరిస్థితుల్లో ఏది కర్తవ్యమో దానిని ఆచరించాలి. లేకపోతే ప్రజలు చరిత్ర నిర్మాతలు కాజాలరు. చరిత్ర రథచక్రాలే ప్రజలమీదనుంచి సాగిపోతాయి. మా మార్క్సిస్టు సిద్ధాతం మాకు నేర్పిన అమూల్యమైన పాఠం ఇది.

ఏఒకరి కోసమోకాదు స్వాతంత్ర్యం - అందరికోసమున్నా

మనప్రస్తుత చరిత్రను లిఖించడంలోను మనలో నూతన చైతన్యాన్ని రేకెత్తించడంలోను ప్రధానపాత్ర కాంగ్రెసుదే. ఈ కాంగ్రెసుకు నాయకసంస్థ ఏ. ఐ. సి. సి. ఆరోజుల్లో దేశాన్నెదుర్కొన్నది. జీవితంలో ఇదివరకెరుగని భయంకర ప్రమాదం. ఆపరిస్థితిలో ఏ. ఐ. సి. సి. వేదికనుండి మేము కొన్నిసూచనలు చేశాం. దేశభక్తి మాతృదేశంపట్ల ప్రజాస్వామికంపట్ల గాఢాభిమానము. ప్రజలయెడల అపారప్రేమ— వీటినే మా సూచనలకు ప్రాతిపదికలుగ తీసుకున్నాము. ఇతర సంకుచిత విషయాలను

లెక్కలోకి తీసుకోలేదు. బ్రిటిష్‌వారు తక్షణం మనకు న్యాయంచేయాలని కాంగ్రెసుకోరింది.— అది న్యాయమైనదే. మేము సూచించిందేమిటి. మన ముస్లింసోదరులకు న్యాయం కలిగించడానికి కాంగ్రెసు తక్షణమే పూనుకోవాలన్నాం. దీనివల్ల కాంగ్రెసు ఆశయం మరింత బలపడుతుందనీ, త్వరలోనే సఫలీకృతమవుతుందనీ, భావించాం. ఒకరినుండి న్యాయంకోరడం చాలదు; ఒకరికి న్యాయం చేయడానిక్కూడా సిద్ధపడాలి. న్యాయబుద్ధి కలవారే న్యాయంకోసం కృషిచేసి జయంపొందగలరు. మనందరి మాతృదేశం భరతఖండం. మనల్నందరిని పీల్చి పిప్పిచేస్తున్నది బ్రిటిష్ సామ్రాజ్యవాదం. ఆపీడన తొలగిపోయి మాతృదేశానికి స్వాతంత్ర్యం చేకూరాలని కాంగ్రెసు కోరుతూంది. ఆ స్వాతంత్ర్యమే దేశంలోని వివిధజాతుల జన్మభూములకు కూడా లభించాలని మేము సూచించాం.

బ్రిటిషువారినుండి స్వాతంత్ర్యాన్ని మీరు వాంఛించారు. ఆస్వాతంత్ర్యం దేశంలోని అన్ని జాతులకు వర్తించాలనే మేము మిమ్మల్నికోరాం.

మనపై బ్రిటిషువారి పెత్తనం అంతరించాలని మీరు కోరారు. మన ప్రజలలో ఒకభాగంపై మరో భాగం పెత్తనం చలాయిస్తుందేమో అన్న భయానికి అవకాశం లేకుండా చేయాలనే మేము మిమ్మల్ని అర్థించాం.

మనందరి పవిత్రవాంఛ స్వాతంత్ర్యం. యావద్భారత దేశానికి బ్రిటిషు పాలకులీ స్వాతంత్ర్యాన్ని ప్రకటించాలని మీ కోరిక. అప్రకటననే సోదర జాతుల విషయంలో మీరుకూడా చేయాలని మా సూచన.

ఈ రెంటిలో ఒకదానికొకటి షరతుగా పెట్టింది ముస్లింలీగు. కాని మేమలా చేయలేదు. ఈ రెండూ పరస్పరం పెనవేసికొని యున్నాయన్న విషయాన్ని సూత్రప్రాయంగానే కాకుండా, ఆచరణలోకూడా మేము గుర్తించాం. 'నీవు చెప్పేదేదో ఆచరణలో చూపించు'అన్నది నీతివాక్యంగా ఉంటుంది. గాని, కార్యరంగంలో తరచుగా కనబడదు, ప్రపంచ స్వాతంత్ర్యాశయం పట్ల మీ సానుభూతిని ప్రకటించారు; భారత స్వాతంత్ర్యాన్ని అభిలషించారు. మేము కోరిదంతా మీరు మరొక్క అడుగు ముందుకు పోవాలనే — ఆ స్వాతంత్ర్య మధుర ఫలాన్ని మన సోదర జాతులన్నీ స్వేచ్ఛగా, నిరాటంకంగా అనుభవించగల అవకాశం ఇవ్వమన్నాం.

చిత్తశుద్ధిగల ఏ ప్రజాస్వామ్యవాదీ ఆక్షేపించలేని పదాల్లో స్వయం నిర్ణయ సూత్రాన్ని నిర్వచించి. దానిని మీరు అంగీకరించాలని కోరాం. లీగు కోరికలకు మూలసూత్రం ఇదే. దీనిని మీరు స్పష్టంగా అంగీకరించినట్లయితే, ఐక్యతాసంప్రదింపులకు న్యాయమైన ప్రాతిపదిక వేసినవారవుతారని ఆశించాం. లీగు కోరుతున్నదానిలో న్యాయవిరుద్ధమైన అంశాలు అనేకం ఉన్నాయనీ, సహింపరాని విషయాలుకూడా ఉన్నాయనీ మాకు తెలుసు. కాని, ఈ కోరికలో న్యాయమైన దానినంతా మీ అంతట మీరు అంగీకరించాలని మేము సూచించాము. ఏ సూత్రంమీదనైతే లీగు తన కోర్కె నాధారపరచిందో ఆ స్వయంనిర్ణయ సూత్రాన్నిగాని మీ రంగీకరించినట్లయితే మీ ఆక్షేపణలను వారిచేత అంగీకరింప జేయవచ్చునని మేమాశించాం.

ముస్లిం జన్మభూములలో స్వతంత్ర రాజ్యాంగం స్థాపించుకొనే హక్కును లీగు కోరుతూంది — దానినే పాకిస్థాన్ అంటూంది. దీనికి మీ రంగీకరించినట్లయితే ఈ సూత్రాన్నిబట్టే లీగు కోరికలోఉన్న న్యాయవిరుద్ధమైన అంశాలను ఎత్తి చూపించవచ్చు. ముస్లిం నివసించే ప్రాంతాలను ప్రత్యేకించి వాటికి స్వయంనిర్ణయాధికారాన్ని కోరడం న్యాయం. ప్రస్తుత పంజాబు రాష్ట్రంలోని హిందూప్రదేశం వాటిలో చేరదు. సిక్కు ప్రజలకు స్వపరిపాలనాధికారం ఉంటుంది, ఆ న్యాయం ముస్లిం జన్మభూముల్లోకి రాదా; బెంగాలీ, హిందూప్రజలకు సర్వాధికారాలు ఉంటాయి. ఇలా జరగడం న్యాయంకాని లీగు కోరుతున్నదేమిటి? న్యాయంగా తన పాకిస్థానుకి చెందని ప్రదేశాలనుకూడా కలిపి కట్టి ఆరు రాష్ట్రాలు కావాలంటుంది. ఈ అన్యాయాన్ని లీగుచేత గుర్తింపజేయగల అవకాశం స్వయం నిర్ణయాధికారాన్ని అంగీకరించినప్పుడే మీకు లభించగలదు.

హిందువులు ముస్లింలపై అధికారం చెలాయిస్తారన్న భయంతోనే లీగు విడిపోయే హక్కును కోరుతూంది. స్వయంనిర్ణయసూత్రాన్ని అంగీకరించిన మీదట, పాకిస్థానుకీ భారతదేశానికీ పరస్పరసంబంధా లెలా ఉండాలో సూచించమని మీరు వారిని కోరవచ్చు. తమకేదో అన్యాయం జరుగవచ్చుననే భయం ఉన్నంతకాలం వారు విడిపోయే వాంఛను వెల్లడిస్తూనే ఉంటారు, వారి కోరికలకు మూలసూత్రాన్ని అంగీకరించిన యెడల

వారి భయాన్నిపోగొట్టి, ఐక్యభారత ప్రజల ఉమ్మడి శ్రేయస్సుపట్ల వారికి ఉత్సాహం కలిగించవచ్చు.

మీరు మమ్మల్ని అపార్థం చేసుకోవద్దని కోరుతున్నాం. జపాను వారు వచ్చేస్తారేమో అని బెంబేరెత్తిపోయి, లీగు కోరిందంతా పూర్తిగా ఒప్పేసుకోమనీ, ఐక్యతను నిర్మించి, ప్రమాదంనుండి "బయట పడడానికి అదొక్కటే మార్గమ"ని సూచించామని లెక్కకట్టవద్దు.

రాజాజీకూడా లీగుతో ఐక్యతయొక్క అవసరాన్ని గుర్తించాడని మే మెరుగుదుము కాని లీగుకోరికలలోని న్యాయాన్ని వారంగీకరించలేదు. ఆకోరికను ఒక 'కాలకూటం'గా స్వీకరించవలసిందని కాంగ్రెసుకు సలహా ఇచ్చారు.

మీరు న్యాయబుద్ధిని చూపాలనే మేము కోరాము.

మీరు సోదరభావాన్ని ప్రదర్శించాలనే అభిలషించాము.

దేశాన్నెదుర్కొంటున్న ప్రమాదాన్ని గుర్తించి మీరు న్యాయాన్ని కోరడమే కాకుండా, న్యాయాన్ని చేయడానికూడా పూనుకుంటే ప్రతి భారతీయుని హృదయంలోను సోదరభావాన్ని ఉప్పొంగ జేయగలరని ఆశించాం. సంకుచిత, పక్షపాతదృష్టితో ప్రవర్తించే పార్టీలకుగాని, నాయకులకుగాని, నిలువనీడలేకుండా చేయగలరని నమ్మాం. ఇంత ఆశ పెట్టుకొని మనందరిసంస్థకు నాయకులైన మీవంక ఎదురుచూశాం. అన్నలయిన మీరు నాయకత్వం వహించి నడపాలని కోరాం.

పరిపాలనాధికారం ప్రజలకు చెందాలనే కదా మీరు కోరింది? కాని ఆ ప్రజ లెక్కడున్నారు. తమతమ ప్రజాపక్షాల జెండాలక్రిందనే ఆనాడూ, ఈనాడూ నిలచిఉన్నారు. అసలు సమస్యను మేము సులభంగానే గ్రహించాం. అప్పటి పరిస్థితుల్లో ప్రధాన రాజకీయ పక్షాలమధ్య ఐక్య సంఘటన లేనిదే అధికారాన్ని హస్తగతం చేసుకోవడం కల్ల అని గుర్తించాం.

లీగుపై ఒత్తిడి

మా సవరణలు కాంగ్రెస్‌కే వ్యతిరేకాలని ఆనాడెవ్వరూ అనలేదు. మౌలానా అజాద్, అష్రాఫ్‌ను వేదికవద్దకు పిలచి ఈ సవరణలను ప్రతి

పాదించవద్దని కోరాడు. అవి కాంగ్రెసు పంథాకు వ్యతిరేకం అని చెప్ప లేదు; సున్నితమైన సంప్రదింపులు జరుగనున్నాయని కారణం చెప్పారు.

కాని; నెహ్రూ పండితుడు లీగును గురించి ఎలా మాట్లాడారో చూడండి :

" జిన్నాగారి ధోరణి యొక్క ప్రతిబింబాలు, నాజీ జర్మనీ లోను, ఫాసిస్టు ఇటలీలోను, సుడెటెన్‌లాండు (జకోస్లోవియా లోని జర్మన్ ప్రదేశం) లోను కనబడగలవు. అయినప్పటికీ, లీగుతో కాంగ్రెసు ఒప్పందల కుదుర్చుకోవాలని 'బొంబాయి క్రానికల్' విధివిరామం లేకుండా ఘోషిస్తూంది" ('భారతజ్యోతి' 1942 ఆగస్టు 9)

ఈ విధంగా నెహ్రూగారు నిప్పులు చెరుగుతూ ఒకవైపు ఒత్తిడి తెస్తుంటే, రెండో వైపునుంచి గాంధీగారువెళ్ళి మంచిమాటలతో జిన్నాను బుజ్జగించాలని అసలు ప్లాను. కాని ప్రభుత్వం దీనికి అవకాశం ఇవ్వలేదు.

విడుదలై వచ్చిన తరువాత యు. పి. లోని ఘాజీపూర్‌లో 1945 అక్టోబరు 14 న ఉపన్యసిస్తూ నెహ్రూగారు ఇలా అన్నారు :

" మత సంస్థల నాయకులను నేనడుగుతున్నది ఒక్కటే ప్రశ్న. గత 25 సంవత్సరాల్లోను వారు నిర్వహించిన పాత్ర ఏమిటి? ముఖ్యంగా ఈ మూడేళ్ళలో సాగిన స్వాతంత్ర్య సమరంలో వారేంచేశారు?...... వారేలాంటి పాత్ర నిర్వహించలేదని నేను చెబుతున్నాను. భారత స్వాతంత్ర్య మార్గంలో లేనిపోని షరతులనే అడ్డంకులు పెట్టారు. భారత స్వాతంత్ర్య సాధనకు పాకిస్తాన్ని ఒక షరతుగా పెట్టింది, ముస్లిం లీగు. భారత సాతంత్ర్యంకోసం కృషి చేస్తున్న ఏకైకసంస్థ అయిన కాంగ్రెసు కీవిధంగా లీగు అడ్డు తగిలింది"

(బొంబాయి క్రానికల్—1945 అక్టోబరు 16)

అక్టోబరు 18వ తేదీన క్వెట్టాలో ఉపన్యసిస్తూ జిన్నాగారు ఈ ఆరోపణకు ఇలా జవాబు చెప్పారు.

"1921, 1930—31 ఉద్యమాల్లో ముస్లిములను ఉత్తేజపరిచింది, మా స్వాతంత్ర్యాభిలాషే. ఆ అభిలాషతోనే వారీఉద్యమాల్లో పాల్గొన్నారు. పాల్గొని ఎంత మహత్తర త్యాగాలు చేశారో మీకందరికీ తెలుసు.

ఈసారికూడా ముస్లిములను బుట్టలోవేసుకోవాలని హిందువులు చూచారు. 1942 ఆగస్టు తీర్మానాన్ని మేము బలపరచి, త్యాగాలుచేయడానికి సిద్ధపడాలని కోరారు. కాని ఆతీర్మానం కోరిందేమిటి? భారతదేశానికంతటికీ ఏకైక కేంద్రప్రభుత్వం ఉండాలని, ఇండియాకంతటికీ రాజ్యాంగ యంత్రాన్ని నిర్ణయించడానికి ఒకే ఒక కాన్స్టిట్యుయంట్ అసెంబ్లీ ఏర్పాటుచేయాలని కోరింది. ఇలాంటి తీర్మానాన్ని ముస్లింలు బలపరుస్తారని ఎలా అనుకోగలరు.? నేను నెహ్రూపండితుని ఒకటి అడుగుతున్నాను — పాకీస్తాన్ని అంగీకరించండి; అప్పుడుచూడండి. ఎవరు ఎక్కువ త్యాగాలు చేస్తారో!"

('డాన్'—1945 అక్టోబరు 20)

అవసరమైతే తన ఛాతీని తుపాకిగుండ్లకు ఎదురిస్తానని జిన్నాగారన్నారు. కాని నెహ్రూపండితునిలాగానే ఈయనకూడా పరుషంగా, అసహ్యకరమైన మాటలు అన్నారు. కాంగ్రెసునడిపిన మహోద్యమాలను అపహాస్యం చేశారు. "గొర్రెపోతుల్లాగ లాఠీదెబ్బలు తినేరకం" అని హేళనచేశారు. బొంబాయి ఏ. ఐ. సి. సి. సందర్భంలో లీగుపై నెహ్రూ కురిపించిన నిందలనుకూడా జ్ఞప్తికి తెచ్చారు.

"1942 ఆగస్టులో బొంబాయిలోని బిర్లాభవనంలో సమావేశమయి చిత్తుతీర్మానాన్ని తయారుచేసినప్పుడూ. ఆతీర్మానాన్ని ఏ. ఐ. సి. సి. లో పెట్టినప్పుడూ: దానిని బలపరుస్తూ తానేమన్నారో నెహ్రూపండితునికి జ్ఞాపకం చేయవచ్చునా? లీగు ఒక అభివృద్ధి నిరోధకసంస్థఅని ఆడిపోశారు: ముస్లింలందరూ కాంగ్రెసుపక్షంలోనే ఉన్నారన్నారు; వారు కాంగ్రెసునాయకత్వాన్నే అనుసరించగలరని ప్రపంచం చూడగలదన్నారు."

(డాన్—1945 అక్టోబరు 20)

"ముస్లింఇండియాలో ఒక్కరుకూడా ఆగస్టు ఘటనలలో పాల్గొనలేద"ని జిన్నా గర్వపడుతూ చెప్పారు.

ఉన్నదున్నట్లు చెప్పాలంటే, ఆగస్టుతీర్మానం ఒక్క బ్రిటిష్వారి మీదనే కాకుండా, లీగుపైకూడా ఒత్తిడిగా భావించారు. లీగుతో సంప్రదింపులు జరుగనున్నాయి కాబట్టి మాసవరణలను ప్రతిపాదించవద్దని మౌలానా అజాద్ అష్రాఫ్ని పిలిచి చెప్పారు. ఆపరిస్థితుల్లో మాసవరణలనుగాని ప్రతిపాదించినట్లయితే, కాంగ్రెసులో ఒకభాగం స్వయంనిర్ణయ సూత్రాన్ని

అంగీకరించాలనీ, ఐక్యతను కుదుర్చుకోవాలనీ ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకొని లీగుమరింత బిర్ర బిగుసు కుంటుందని వాదించారు. జగత్నారాయణలాల్ తీర్మానాన్ని రద్దుచేస్తున్నాం—అదే చాలునన్నారు, అంటే—స్పష్టమైన సూత్రాలను అంగీకరించకుండా, ఒడంబడికను అభిలషిస్తున్నాం అని అస్పష్టమైన ఒక సూచన చేయడంమాత్రమే అన్నమాట. మాకిది పోటీదారులమధ్య బేరాలు సాగించేపద్ధతిగానే కనబడిందిగాని, అన్నదమ్ములమధ్య జరుగవలసిన వ్యవహారంగా కనబడలేదు. ఒక నిర్దుష్టమైన సూత్రాన్ని ప్రాతిపదికగా తీసుకొని, ఇతరజాతులకు వారి జన్మభూములకు నష్టంరాని పద్ధతుల్లో దానిని దేశంలో అమలుజరపడానికి లీగునువచ్చి, సహకారం చేయవలసిందని కాంగ్రెసు కోరాలని మేము సూచించాం.

మీ రిపోర్టులో మాపై తెచ్చిన ఆరోపణలను రుజువు చేయడానికి ఆగస్టు తీర్మానాన్ని గీటురాయిగా తీసుకున్నారు. కాని, బొంబాయి ఏ. ఐ. సి. సి. సమావేశంలో ఆ తీర్మానానికే మేము సవరణలు సూచించినప్పుడు మేము జాతీయ శ్రేయస్సుకు వ్యతిరేకులమని అనగల సాహసం ఎవ్వరికీ లేకపోయింది. పైగా, సమావేశాన్ని ముగిస్తూ గాంధీగారు చేసిన ఉపన్యాసంలో మమ్మల్ని అభినందించారుకూడా;

"అధికార తీర్మానానికి వ్యతిరేకంగా వోటుచేసిన 13గ్గురు మిత్రుల్ని అభినందిస్తున్నాను. ఇలా వ్యతిరేకంగా వోటుచేయడంలో వారు సిగ్గు పడవలసిన దేమీ చేయలేదు. అత్యల్ప సంఖ్యాకులంగా ఉన్నప్పటికీ, నలుగురూ చూచి నవ్వుతున్నప్పటికీ ధైర్యం వీడకూడదన్న పాఠాన్ని గత 20 ఏళ్ల అనుభవంమీద గ్రహించాం.... నమ్మినదానిలో ఈ అచంచల విశ్వాసాన్ని అభివృద్ధిచేసుకోవడం మనకు శ్రేయస్కరం. దానివల్ల వ్యక్తి గౌరవపాత్రుడవుతాడు; నైతికస్థాయి పెరుగుతుంది. గత 30 ఏళ్లకు పైగా ఈ మార్గాన్ననుసరించడానికే నేను పాటుబడ్డాను. ఈ మిత్రులు ఇలా చేసినందుకు ఏంతో ఆనందిస్తున్నాను." అని మమ్మల్నిగురించి గాంధీగారన్నారు. (ఆ సమావేశంలో అచ్చువేసి పంచిన గాంధీగారి ఉపన్యాసంలోని భాగం.)

పోరాటం అన్నది వట్టి బెదరింపు మాత్రమే

మీ తీర్మానంలోని మొదటి భాగానికి, రెండవ భాగానికి ఏమీ సంబంధం లేదనే మా ప్రధాన విమర్శ. రెండవ భాగంలో సూచించిన

మేము చేసిన సూచనలు నిరాకరించారు. క్రిప్సు రాయబారం రోజుల్లో ఊహలు సాగించినట్లే మళ్ళీ సాగించారు. బ్రిటిష్‌వారుగనుక మీతో రాజీ కుదుర్చుకుంటే మిగతావాళ్ళందరూ దారికి వస్తారనుకొన్నారు. పరాయి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు దిగివస్తారని మీలో చాలామంది నమ్మారు. వెనుక ఎన్నోసార్లు అనర్ధదాయకమని రుజువయిన పంధాయే ఇది — బ్రిటిష్‌వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడడం.

ఈ బెదరింపుతోనే అన్నిపనులూ అయిపోతాయని, పరిష్కారం ఊడి పడుతుందనీ ఆశలుపెట్టుకున్నారు. కాబట్టే మీలో చాలమంది పోరాటానికి కావలసిన సన్నాహాల ఊసే ఎత్తలేదు. ఒకవేళ బెదరింపుతోనే పరిష్కారం కుదరకపోతే, "మెరుపులాంటి ఒక చిన్న పోరాటాన్ని" జరిపితే చాలునని సర్దార్ పటేల్‌లాంటి వారు కొందరూహించారు. మీ అందరిఅంచనాలు ఎంతతప్పో, మీరు సూచించిన పంధా ఎంత అనర్ధ దాయకమో ఆగస్టు తీర్మానం వెనువెంటనే జరిగిన ఘటనలే రుజువు చేశాయి.

మీలాంటి భ్రమలు పెట్టుకోకుండా ఉన్నది మా పార్టీ ఒక్కటే. అప్పటి పరిస్థితులను గురించి మా పార్టీ చేసిన పరిశీలన, అది చేసిన హెచ్చరిక, అక్షరాలా నిజమయాయి.

1942 జూలై 26 వ తేదీని మేముప్రకటించిన 'బహిరంగలేఖ'లో స్పష్టంగా హెచ్చరించాము:

"మీరేగాని పోరాటం ప్రారంభిస్తే ఏమవుతుంది: మిమ్మల్ని, వేలకొలది కాంగ్రెసువాదుల్ని చల్లచల్లగా జైళ్ళలో పడవేస్తారు, ఫాసిస్టు దురాక్రమణదారులనుంచి భారత దేశాన్ని కాపాడగలందులకు మేము పని చేయవలసి వచ్చిందని రుద్రాక్షపిల్లి కబుర్లాడుతారు.

ఈ దూరదృష్టి ఉన్నందుకు మమ్మల్ని ఆడిపోయాలా లేక ఆశీర్వదించాలా ?

అనుబంధం

కాంగ్రెసు వర్కింగు కమిటీకి బహిరంగలేఖ

ఫ్రెండ్స్!

మన ప్రాచీనదేశపు చరిత్రలో నేడొక ప్రమాదస్థితి ఏర్పడింది. ఒక పరదేశ సామ్రాజ్యవాద నిరంకుశ విధానం మన భారత ప్రజా బాహుళ్యాన్ని సంకెళ్ళలో బంధించివేసింది. దేశాన్ని పరిపాలించే ప్రభుత్వంగా తాండవ మాడుతోంది. తూర్పుదిశనుంచి, విదేశీయులు మన దేశంపై దండయాత్ర చేయ సిద్ధంగా ఉన్నారు. మనదేశానికి తూర్పున చైనా ప్రజలువీరయోధులై చేస్తున్న ప్రతిఘటన పశ్చిమంలో సోవియట్ ప్రజలు ధైర్య సాహసాలతో చేసే ప్రతిఘటన, నేడు ఫాసిస్టు దండయాత్రను అడ్డుకొంటున్నాయి. ఇదే విధంగా వారు తమ మాతృ దేశాలను రక్షించుకోడానికి పోరుసల్పుతూ, మన దేశాన్నికూడా రక్షించుతున్నారు. రేపో మాపో ఎంతో స్వల్పకాలం లోనే, మనంకూడా మన మాతృదేశం యెడల మన కర్తవ్యాన్ని నెరవేర్చ వలసిన సమయం వస్తుంది.

మా విజ్ఞప్తి

గర్వించదగిన మన జాతీయోద్యమానికి మీరు గౌరవించదగిన నాయకమణులు. మనయోధుల రక్తంతో నిర్మించబడి, అసంఖ్యాకమైన ప్రజలచే బలపరచబడుతున్న కాంగ్రెసు మహాసంస్థకు మీరు నేతలు. 50 సంవత్సరాలుగా వృద్ధిపొందుతూన్న మన స్వాతంత్ర్యోద్యమాన్ని నడిపించవలసిన మహాభారం మీ భుజస్కంధాలమీద వుంది. కమ్యూనిస్టులమైన మా రాజకీయజీవితం 15 సంవత్సరాలుగా వృద్ధిపొందుతూవచ్చింది. విశాలమైన జాతీయోద్యమంలోనే మేముకూడా జన్మించాము. దాన్ని బలపరచడానికి మాశక్తినంతటినీ వినియోగించాము. కాంగ్రెసు సభ్యులమని చెప్పుకోడానికి మేము గర్వపడతాము. మనజాతీయ సాంప్రదాయానికి అదొక అమూల్యమైన ఆభరణం, సహచరులైన మా యితరదేశభక్తులందరితోను చేయిచేయికలిపి, భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడానికి ఈ కాంగ్రెసుసభ్యత్వం మాకు ఉత్సాహాన్ని యిస్తుంది.

దేశానికి నేడు సంభవించిన మహావిపత్సమయంలో మీరొక పంథాను చూపిస్తున్నారు. మా మనస్సులోఉన్న భావాలను మీకు వెల్లడి చేయడం మాకర్తవ్యం అని భావిస్తున్నాం. మీరు స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొనే మాయితరమిత్రులూ మేము చెప్పేవిషయాలు వినేటట్టుచెయ్యడం మా హక్కుగా భావిస్తున్నాం.

జాతీయ నాయకత్వంలో చీలికలు

ప్రస్తుతపు కార్యాచరణవిధానాన్ని మీరు దేశానికి అందజేయడానికి ముందు జాతీయనాయకత్వంలోనే చీలిక ఏర్పడింది. ఇది ఏదేశాభిమానికీ తెలియని రహస్యంకాదు. జపాను సైన్యాలు ఇండియాకు రావనీ, జపాను వారితో గౌరవప్రదమైన శాంతి సాధ్యంఅవుతుందనీ, ఎక్కువగా గౌరవించబడే మన నాయకుడు గాంధీజీయే భ్రమించాడు. జాతీయ ప్రతిఘటన అర్థంలేనిదంటూ ఆయన అనుచరులు ఖండించసాగారు. దేశాన్ని రక్షించాలనీ, జాతీయ ప్రభుత్వంకొరకు పోరాడాలనీ, కబుర్లుచెప్పేకాలం అంతరించిందంటూ వారు వాదించారు. కాని నెహ్రూపండితుడు, మౌలానా అజాదు, మరికొందరు, పైవారిని ఒప్పించగలిగినందున స్వవినాశకరమైన ఈ విధానం నిరాకరించబడినందుకు మేము సంతోషిస్తున్నాము.

జాతీయ నాయకత్వంలో యీ అపజయభీతికలవారు పరాజయమొందినందుకు మేము సంతోషిస్తున్నాము.

> భారతదేశం తనను తాను రక్షించుకోవాలి. భారతదేశం ఫాసిస్టు దురాక్రమణను యెదుర్కోవాలి. భారతదేశం మిత్రదేశాలతో కలసి పోరాడాలి. భారతదేశపు రక్షణను సంఘటిత పర్చడానికి అధికారం కావాలి; భారతదేశం స్వాతంత్ర్యంకొరకు పోరాడటానికి స్వేచ్ఛను కలిగిఉండాలి.

అనే నిర్ణయాలకు మీరంతా ఏకగ్రీవంగా రావడం మాకు సంతోషాన్ని కలుగజేసింది.

ఆచరణయోగ్యమైన కార్యక్రమం కాదు

కాని, మీ రిచ్చిన కార్యక్రమం ఆచరణయోగ్యమైనది కానందుకు మేము బాధపడుతున్నాం. ప్రజలు ఏ కర్తవ్యాలను నెరవేర్చ వలసిందిగా మీరు ఆదేశించారో వాటిని ఏ దేశాభిమానీ నెరవేర్చజాలడని మా నిశ్చితాభిప్రాయం. అంతేకాదు. వాటికి వ్యతిరేకమయిన ఫలితాలు కూడా సంప్రాప్తించవచ్చు.

మనదేశ ప్రజలను బానిసత్వంలో ముంచుతూ ఫాసిస్టు దురాక్రమణ దారులను అడ్డగించడానికి శక్తిలేనట్టియు, మన మాతృ దేశాన్ని మనం రక్షించుకోడానికి ఆటంకాలు కలుగజేసేటట్టియు. సామ్రాజ్యవాద నిరంకుశత్వంవైపు వేలుపెట్టి మీరు చూపడం సరియైనదే కాని, ఫాసిస్టులతో పోరు సలిపేముందు వీరితోనే పోరు సల్పుదాం అని మీరంటారు.

సామ్రాజ్యవాద నిరంకుశత్వం పోవాలనీ, మన దేశాన్ని వారు రక్షింపజాలరనీ, మలయాలో మాదిరి మనల్నికూడా చేతులు కాళ్ళు కట్టివేసి ఫాసిస్టు దుండగీడ్రకు మనల్ని ఒప్పజెప్పుతారనీ, మీరు చెప్పడం సరిగానే ఉంది. అయితే అధికార పదవులలోనుంచి వారిని కిందకు తన్నడం ఎలాగు? మన దేశాన్ని పరిపాలించే యీ ప్రభుత్వపు అధికారాన్ని లాగుకొనడం ఎలాగు? ఇందుకు ఒక్కటే మార్గం ఉంది. మన దేశంయొక్క బలాన్నంతటినీ సంపూర్ణంగాను, వేగంగాను, మనం సమీకరణ మొనర్చాలి. మనం నేడు బానిసస్థితిలో ఉన్నాం; కాబట్టి జాతీయ ఐక్యత అనే రూపంలో యిది వెల్లడి అవుతుంది. సామ్రాజ్యవాదనిరంకుశత్వముతో మనం జరిపే పోరాటం; జాతీయైక్యత కొరకు మనం జరిపే పోరాటం, రెండూ ఒకటే. మన దేశీయుల జాతీయ సంస్థలన్నింటిచేతను బలపరచబడే కాంగ్రెసు- ముస్లింలీగు ఐక్యతకై మనం పాటుపడదాం. ఏనాడు మనం జాతీయైక్యతను పూర్తిగా సాధించగల్గుతామో ఆరోజే సామ్రాజ్యవాద నిరంకుశవర్గం మాయమవుతుంది. ఆరోజునే జాతీయప్రభుత్వం స్థాపించుకొనగలం. స్వాతంత్ర్యం కొరకు ఐక్యత : ఈ నినాదాన్ని మీరే మన జాతీయోద్యమానికంతకూ కీలకంగా

చేశారు, ఈ రోజునమాత్రం మీరు, మొదట స్వాతంత్ర్యంవస్తే తరువాత ఐక్యత వచ్చితీరుతుంది అంటున్నారు.

స్వాతంత్ర్యం ఒకరు మనకు ప్రసాదించే వస్తువా? అలా అనుకోవడం వట్టిభ్రమ. దానికై మనం పోరుసల్పి సంపాదించుకోవాలి. ఇప్పుడే కాదు; ఎల్లప్పుడూ అంతే. ఈరోజున స్వాతంత్ర్యంకొరకు పోరుసల్పడం అంటే అర్థం, మన జాతీయైక్యతకై రాత్రింబగళ్ళు కృషిచేయడం అన్న మాట. ఇది అసాధ్యమైన పని అంటూ మీరు దీన్ని విడనాడుతున్నారు. అయితే, నిరంకుశవర్గాలను వదల్చుకోడానికీ, జపాను దండయాత్రను ఎదుర్కొనడానికీ యిదొక్కటే మార్గం. చైనా సైన్యాలు, సోవియట్ సైన్యాలు యిస్తూన్న అమూల్యమైన వ్యవధిని వినియోగించుకోడానికి యిదొక్కటే మార్గం. దానిని మీరు నిరాకరించారు.

"మా దేశంవిడిచి మీ దేశం వెళ్ళిపొండి"

మా దేశాన్ని విడిచిపెట్టి మీ దేశం వెళ్ళిపొండి అంటూ మీరు బ్రిటిష్ నిరంకుశాధికారుల్ని హెచ్చరించారు. మర్యాదగల పెద్దమనుషుల మాదిరిగా వారు వెళ్ళిపోతారనీ, మన ప్రజల్ని వారు బానిసత్వంలోనుంచి తప్పించుతారనీ, మీరు ఆశలతో నిండియున్నారనీ మేము యెన్నటికీ అనము. ఆవిధంగా మేము మీ కుశాగ్రబుద్ధిని అగౌరవపరచము. అయితే వారు భారతదేశాన్ని భారతీయులకే విడిచిపెట్టిపోతారని మరేలాగు మీరు ఆశించుతున్నారు? మిత్రరాజ్యాల ప్రజలు ఈ విషయంలో కలుగజేసుకుంటారని మీ ఆశ. ఇది స్పష్టంగా తెలుస్తోంది. మా పనిని మీరు చేసిపెట్టవలసిందంటూ వారిపైననే భారం అంతా వెయ్యడం మన జాతీయ ఆత్మగౌరవానికే నష్టం కాదా?

మీ "పోరాటం"

బ్రిటన్, అమెరికా, చైనా, యితర స్వాతంత్ర్య ప్రియ రాజ్యాల ప్రజలు బ్రిటిష్ ప్రభుత్వానికి తెలివివచ్చేటట్లు చేయజాలకపోతే సాంప్రదాయమైన పోరాటం ప్రారంభించడానికి మీరు ప్లానులు వేస్తున్నారు. అలాంటి "పోరాటం" యీ రోజున నిరంకుశాధికారుల్ని నాశనం చెయ్యకపోవడమే కాకుండా బలపర్చుతుంది. ఫాసిస్టు దుండగింద్రతో

భారతప్రజలు పోరు సల్పడానికి బ్రిటిష్ పాలకవర్గం ఆటంకాలు కలుగజేస్తుందనీ, అందుకు కారణం అలా పోరు సలిపితే భారతదేశ స్వాతంత్ర్యానికే, తమ అధికార పతనానికే దారి తీస్తుందనీ, మీకు తెలుసు. క్రిప్సు రాయబారాల అనుబంధంద్వారా యీ విషయం మీరు తెలుసుకున్నారు. మీలో కొందరు తెలియజేశారు,

అట్టి పరిస్థితులలో మీరు మీ "పోరాటా"న్ని ప్రారంభించడం వల్ల సామ్రాజ్యవాదుల్నీ, నిరంకుశ వర్గాన్నీ, బలపరుస్తున్నారన్న విషయం స్పష్టం అవుతోందిగదా! పోరాటాన్ని మీరు ప్రారంభిస్తే, అప్పుడు యేమి జరుగుతుందో చూదాం.

నిశ్శబ్దంగా మిమ్మల్ని, యింకా చురుకుగా పనిచేసే వేలకొలది కాంగ్రెసువాదుల్ని వారు జైళ్ళలో నిర్బంధిస్తారు. ఫాసిస్టు దండయాత్రనుంచి భారతభూమిని రక్షించడానికి శక్తిగలిగియుండటం దురదృష్టమైన తమకర్తవ్యం అంటూలోకం అంతటా డబ్బావాయించుకుంటారు. మీరు, యింకా ఇతరదేశభక్తులు, ప్రజలమధ్యవుండి ప్రజలను నడపించవలసిన సమయంలో మిమ్మల్ని సామ్రాజ్యవాదులు ప్రజలనుంచి దూరం చేసి వేయగల్గుతారు. మనప్రజల్ని జాతీయ ప్రతిఘటనకు సన్నాహపరచి సంఘటిత మొనర్చడంనేడు మీ యొక్క చారిత్రాత్మకమైన బాధ్యత. ప్రజల్ని నాయకులు లేకుండాచేసి పిచ్చిఎత్తిన నిరంకుశ పరిపాలకుల చేతుల్లో విడువడం న్యాయంకాదు. మనదేశంయొక్క రక్షణను మీరు శంరాళ్ళకు పనిచేసే సైనికులకు, విదేశీప్రభుత్వానికి, వదిలిపెట్టడం జరుగుతుంది. అట్టిపరిస్థితులలో మనగతి ఏమవుతుందో మీరు ఊహింపజాలరా? మలయాప్రజలగతి, బర్మాప్రజలగతి. ఏమయిందో మరచిపోయారా? ఈ ఘటనలన్నీ చూస్తూ మీరు కంపించిపోవడం లేదా? కాంగ్రెసు - ముస్లింలీగు ఐక్యతను సాధించే బాధ్యతను ఇప్పుడైనా మీరు వహించవద్దా?

జపాను ఫాసిస్టులకు సహాయకారి

స్వాతంత్ర్యప్రియులైన రాజ్యాలయెదుట భారతజాతీయోద్యమాన్ని "పంచమాంగదళం' అని సామ్రాజ్యవాదులు దుమ్మెత్తిపోస్తారు. ఫాసిజాన్ని ఎంత తీవ్రంగా ఖండించినప్పటికీ, మిత్రరాజ్యాలవైపు మనకుగల

స్నేహభావాన్ని ఎంత ఎక్కువగా ప్రకటించినప్పటికీ, నిరంకుశాధికారుల్ని దేశాన్నుంచి తరుమగొట్టాలని మీరు ప్రారంభించబోయే "పోరాటం" జపాను ఫాసిస్టుల్ని దేశంలోకి రానివ్వడంలో సహాయపడక మానదు. ఈ యదార్థాన్ని ఎవ్వరూ మరుగుపరుచజాలరు. మీ మనస్సులలో మాత్రం మీరు జపాను ఫాసిస్టులు వస్తే పోరాడటానికే సంకల్పించుకొన్నారు. కనుక యిప్పుడే దేశంనుంచి బ్రిటిష్ నిరంకుశుల్ని పారద్రోలాలంటున్నారు. ప్రపంచప్రజలను టోకియో, బెర్లిన్, రేడియోల వద్ద కూర్చొని మనపోరాటం ఎంతచక్కగా ఫాసిస్టులకు ఉపకరిస్తుందో వినమంటూ సామ్రాజ్యవాదులు హెచ్చరిస్తారు. మన జాతీయవాంఛసిద్ధించడానికి మిత్రరాజ్యాలు కలుగజేసుకొనేటట్లు చేయడానికి బదులు, మీ "పోరాటం' అందుకు వాయిదాలు వేస్తుందన్నమాట. భారతదేశభక్తులందరూ నమ్మరానివారని, తెలియని ప్రజలు అనుకొంటారు. గందరగోళంలో పడి కొట్టుకుంటున్నామని మన మిత్రులంటారు. భారత ప్రజాతంత్రవిధానానికి ప్రపంచప్రజాతంత్రశక్తులు యీ విధంగానేనా సహాయం చేయగలగడం. ఊహించుకొంటేనే మన శిరస్సుసిగ్గుచే కృంగిపోతూంది।

కాబట్టి మీరుతలపెట్టే ఉద్యమంవల్ల మనం విదేశీ నిరంకుశాధికారుల్ని నిజంగా దెబ్బతీయడంలేదనీ, మన శ్రేయస్సుకే దెబ్బతీసుకుంటున్నాంఅనీ, మీరు చూడవలసినదిగా ప్రార్థిస్తున్నాం.

స్వాతంత్ర్యానికి పోరాటం అవసరం

భారత స్వాతంత్ర్యంకొరకు పోరాడవలసివుంది. మనమేపోరాడవలసియుంది. ఈపోరాటం ఎంతో విశాలమైనట్టి యుద్ధరంగంలో ప్రపంచప్రజలందరితోనుకలిసి, పోరాడవలసివుంది. పాతయజమానులు మనల్ని బానిసత్వంలోనే ముంచుతున్నారు. కొత్త యజమానులు, యెన్నోరెట్లు క్రూరయజమానులు మనమీదికిదుముకుతున్నారు, మనపైగల బ్రిటిష్‌సామ్రాజ్యాధికారం అవసానదశలోఉంది. నేడు మనలనెదుర్కొంటూన్న సమస్య ఏమంటే, మనపైనున్న బ్రిటిష్‌సామ్రాజ్యాధికారాన్ని 'నాశనం'చేసి, అనగా దానిస్థానే జపానుఫాసిజాన్ని స్థాపించుకోవడమా, లేదా సకాలంలో మనమే

మనదేశాన్ని ఈనిరంకుశాధికారులచేతుల్లోనుండిరక్షించుకొని జాతీయప్రభుత్వాన్ని సంపాదించుకొని. జయప్రదంగా శత్రువును ఎదుర్కొంటూ మన జాతీయ స్వాతంత్ర్యమువైపు సాగిపోవడమా? మన జాతీయ సాంప్రదాయ మంతటిలోనూ, ప్రధానస్థాన మలంకరిస్తున్నది ఏమంటే జాతీయైక్యత. మన జాతీయజీవనమే నేడు ప్రమాద స్థితిలో ఉన్నప్పుడు జాతీయైక్యతపైనే మన మాధారపడదాం. దానిని మనం సాధించుదాం. నేటి మన బానిసస్థితిలో మన జాతీయైక్యతలోనే మన బలం అంతాఉంది అదే నేడు మన శక్తి: అదే మనడాలు: మీరు దేశాన్నంటినీ నడిపే మార్గదర్శకులు. మన ప్రజలకు ముప్పు, మన దేశాని కంతటికి ఫాసిజం క్రింద సర్వనాశనం జరిగే తప్పునడకను మీరు నడిపించడానికి వీలులేదు. జాతీయ ప్రభుత్వాన్ని సాధించేటందుకు జాతీయైక్యత అవసరం కాబట్టి మీరే ముందంజ వేసి దానికైకృషి చేయవలసి వుంటుంది. మనపై యిప్పుడున్న బ్రిటిష్ అధికారం నాశనంచేసి ఫాసిస్టు దురాక్రమణ దారులతో జయప్రదంగా పోరు సల్పడానికి యిదే చక్కనిమార్గం.

సామ్రాజ్యవాద నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జాతీయ ప్రభుత్వం, దాన్ని సాధించడానికి జాతీయైక్యత కావాలి. ఫాసిస్టు దురాక్రమణదారులకు వ్యతిరేకంగా జాతీయప్రతిఘటన. అందుకై జాతీయైక్యత.

ఇదే భారతప్రజల నిజమైన జాతీయ పోరాటమార్గం. గాంధీజీ ప్రారంభించబోతున్నట్టి, మీరంతా ఆమోదించినట్టి, "పోరాటం" ఒక విధానంతోకూడిన పోరాటంకాదు. అదొకజూదం. అది స్వాతంత్ర్యము కొరకు సాగించే పోరాటంకాదు. జైళ్ళకుపోయి తప్పించుకోవడం. అది ప్రజల్ని నడిపించడంకాదు, ప్రజల్ని విడనాడడం. అది సామ్రాజ్యవాద నిరంకుశత్వాన్ని నాశనంచెయ్యదు. దాని క్రిందనే మనం ఉండేటట్టుచేసి, తరువాత వచ్చే జపాను ఫాసిస్టుల చేతులోకి మనల్ని మార్చుతుంది. అట్టి "పోరాటం" మనకు స్వేచ్ఛను యివ్వజాలదు. ఫాసిజాన్ని ప్రసాదిస్తుంది.

ఫాసిస్టు దురాక్రమణదారులు చచ్చేవరకు పోరుసల్పడానికి దేశాన్ని తయారు చేయండి. అది స్వాతంత్ర్యానికి పోరుసల్పడం. ఎందువల్లనంటే, స్వాతంత్ర్యానికి మార్గం అదొక్కటే.

దేశాన్నంతటినీ ఐక్యపరచడానికి బయల్దేరండి. కాంగ్రెసు-లీగు ఐక్యతను సమకూర్చిననాడే జాతీయ ప్రభుత్వం వస్తుంది. అప్పుడే నిరంకుశాధికారులు పోతారు.

సగర్వంగా మీరు నడిపించండి. భక్తితో మేము అనుసరిస్తాం ?

స్వేచ్ఛకలిగిన ప్రపంచంలో భారతదేశం స్వేచ్ఛతో వికసిస్తుంది.

విప్లవం వర్ధిల్లుగాక !

END OF
TITLE